www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 23-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 177 | వరంగల్
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి మ. 1.51 తదుపరి సప్తమి; నక్షత్రం రోహిణి రా. 10.07 తదుపరి మృగశిర; వర్జ్యం: మ.2.25-3.57, తె.3.39-5.15; దుర్ముహూర్తం: మ.12.31-1.19, మ.2.55-3.42; అమృతఘడియలు: రా.7.02-8.34; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.07; సూర్యాస్తమయం: 6.06
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భారత చదరంగం.. స్వర్ణ సంబరం



చెస్ ఒలింపియాడ్ విజేత భారత్

పురుషులు, మహిళల జట్లకు తొలిసారి స్వర్ణాలు

బుడాపెస్ట్‌లో జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో భారత క్రీడాకారులు చాంపియన్లుగా నిలిచి చరిత్ర సృష్టించారు. అటు అబ్బాయిలు, ఇటు అమ్మాయిల విభాగాల్లోనూ సత్తా చాటారు. భారత చదరంగం చరిత్రలో తొలిసారి 2 స్వర్ణాలు సాధించారు.

11



కుటుంబానికో.. డిజిటల్ కార్డు

గడిచిన 9 నెలలుగా నేను ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదు. ప్రభుత్వం చేపడుతున్న కొత్త కార్యక్రమాలను ఎమ్మెల్యేలు ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలి.
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సీఎం పిలుపు

దాని ద్వారానే రేషన్, ఆరోగ్యశ్రీ, కల్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాలు

- ప్రతి ఒక్కరికీ హెల్త్ ప్రొఫైల్ డిజిటల్ కార్డు
- సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్ వెల్లడి
- ఎమ్మెల్యేలు అవినీతికి దూరంగా ఉండాలి
- గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డబ్బులు తీసుకున్నందునే ఓడిపోయారు
- కష్టపడి పనిచేసిన వారికి తప్పక అవకాశాలు
- ప్రభుత్వంపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి: రేవంత్
- మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానించిన సీఎల్పీ
- పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేస్తా: మహేశ్
- సీఎల్పీ భేటీకి పలువురు ఫిరాయింపు ఎమ్మెల్యేలు



సీఎల్పీ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌ను సత్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో ఫ్యామిలీ డిజిటల్ కార్డును తీసుకురాబోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రతి కుటుంబానికీ ఈ కార్డును ఇస్తామని, దీని ద్వారానే రేషన్, ఆరోగ్యశ్రీ, కల్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాల లబ్ధిని ఆయా కుటుంబాలకు అందజేస్తామని పేర్కొన్నారు. దీంతోపాటు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ హెల్త్ ప్రొఫైల్ డిజిటల్ కార్డును ఇస్తామని చెప్పారు. ఇక అధికార పార్టీ శాసనసభ్యులుగా బాధ్యతతో మెలగాలని, అవినీతికి దూరంగా ఉండాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల బదిలీలు, ఇతర విషయాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డబ్బులు తీసుకోవడంతో వారిని ప్రజలు ఓడించారని తెలిపారు. ఈ విషయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఎమ్మెల్యేలు సచివాలయానికి గుంపులు గుంపులుగా రావద్దని, క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి పని చేయాలని సూచించారు. అప్పుడే వారు మరోసారి గెలిపిస్తారన్నారు. ఆదివారం టీపీసీసీ నూతన అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానించేందుకు

మిగతా 13వ పేజీలో...

ఆర్‌ఆర్‌ఆర్ మార్పుపై వెనక్కి వెళ్లలేం

- బాధితులకు నష్టపరిహారం పెంచే ప్రయత్నం చేస్తా
- సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని సమస్యలన్నీ పరిష్కరిస్తా
- సీపీఎం ప్రతినిధి బృందంతో సీఎం రేవంత్

13

అమెరికాలో క్వాడ్ సదస్సులో దేశాధినేతలు ఆంటోని అల్బనెస్, మోదీ, జో బైడెన్, ఫుమియో కిషిదా



నిలబడతాం.. బలపడతాం

- మా కూటమి ఏ దేశానికీ వ్యతిరేకం కాదు
- అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవిస్తాం
- శాంతియుతంగా సమస్యల పరిష్కారం
- భద్రత, సాంకేతికత, వాతావరణ మార్పులు..
- సామర్థ్య నిర్మాణమే మా లక్ష్యాలు
- క్వాడ్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ
- ఇకపై సముద్రంలోనూ క్వాడ్.. కొత్తగా 'మైత్రి'
- ఇండో-పసిఫిక్ లాజిస్టిక్స్‌కు పైలట్ ప్రాజెక్టు
- 'విల్మింగ్టన్ డిక్లరేషన్'లో పాక్‌పై నిప్పులు
- మోదీపై జో బైడెన్ పొగడ్తల వర్షం

నా ముందు మహోన్నత లక్ష్యాలున్నాయి

ప్రవాస భారతీయులతో ప్రధాని మోదీ

వాషింగ్టన్, సెప్టెంబరు 22: "క్వాడ్ కూటమి ఏ దేశానికీ వ్యతిరేకం కాదు. అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవిస్తాం. భద్రత, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, వాతావరణ మార్పులు, సామర్థ్య నిర్మాణమే మా లక్ష్యం. సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవడమే క్వాడ్ అభిమతం. మేం(క్వాడ్ కూటమి) నిలబడతాం.. బలపడతాం" అని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ స్వస్థలమైన విల్మింగ్టన్‌లో ఆదివారం జరిగిన క్వాడ్ దేశాధినేతల శిఖరాగ్ర సదస్సులో ఆయన మాట్లాడారు. నాలుగేళ్లక్రితం ఇండో-పసిఫిక్ రీజియన్‌లో స్వేచ్ఛాయుత వాణిజ్యం, భద్రత వంటి అంశాలతో అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, భారత్ కలిసి క్వాడ్ కూటమిగా ఏర్పడ్డ విషయం తెలిసిందే..! ఈ కూటమి ఏర్పడి నాలుగేళ్లు

మిగతా 2వ పేజీలో...

చైనా మాకు పరీక్ష పెడుతోంది

సదస్సులో సహచర దేశాధినేతలతో బైడెన్

మైక్ ఆన్‌లో ఉన్న విషయం తెలియక మాట్లాడిన అమెరికా అధ్యక్షుడు

2

లడ్డూ కల్తీపై సిట్

ఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో దర్యాప్తు.. ఏపీ సీఎం చంద్రబాబు

- వైసీపీ రాగానే ఇష్టానుసారంగా టీటీడీ బోర్డు
- 50 మందిని నియమిస్తే కోర్టుకెళ్లాల్సి వచ్చింది
- అడ్డగోలుగా దర్శనం టికెట్లు అమ్మారు
- నిరసనగా నేను, పవన్ నాడు ధర్నా చేశాం
- రివర్స్ టెండరింగ్‌తో నిబంధనలు మార్చారు
- అనుభవం లేనివారికి నెయ్యి సరఫరా అప్పగింత
- వారు నాణ్యత లేని సరుకు పంపారు
- ప్రక్షాళనకు నిబద్ధత కలిగిన ఈవోను తెచ్చా
- అన్ని అకౌంట్లూ స్వామి సెటిల్ చేస్తారు: బాబు



అమరావతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ కల్తీపై ఐజీ, అంతకంటే పైస్థాయి అధికారి ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుచేస్తామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. తిరుమలలో జరిగింది తీవ్ర అపచారమని స్పష్టం చేశారు. 'మనోభావాలు దెబ్బతిన్న హిందువులకు, ఇతర మతస్థులకు విజ్ఞప్తి చేస్తున్నా. తెలిసి చేసినా, తెలియక చేసిన తప్పు తప్పే. పరమ పవిత్రమైన వేంకటేశ్వరస్వామి దేవాలయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిందిపోయి అధికార దుర్వినియోగం

మిగతా 14వ పేజీలో...

చర్చి అపవిత్రమైతే ఊరుకుంటావా?

- జగన్.. దీన్ని ఎలా సమర్థిస్తారు?.. లడ్డూ నెయ్యి కల్తీ దుర్మార్గం
- అయోధ్యకూ అవే లడ్డూ.. చర్చి, మసీదులో జరిగి ఉంటే అల్లకల్లోలం
- ఏ మతంపై దాడి జరిగినా ఇలాగే స్పందిస్తాం: పవన్ కల్యాణ్

14

హెచ్చరించినా మారలేదు!

- ఏఆర్ డెయిరీ నుంచి కల్తీ నెయ్యి
- ఏపీ సీఎంకు టీటీడీ నివేదిక





కూకట్‌పల్లి నల్లచెరువులో అక్రమ కట్టడాల కూల్చివేత.. రోదిస్తున్న బాధితుడు రవికుమార్

24 ఇళ్లు నేలమట్టం

- 2 వారాల అనంతరం తిరిగి రంగంలోకి హైడ్రా
- అమీన్‌పూర్‌లోని పటేల్‌గూడలో కూల్చివేత
- కిష్టారెడ్డిపేటలో 3 బహుళ అంతస్తుల భవనాలు
- ప్రభుత్వ భూమిలోని నిర్మాణాలపై చర్యలు
- కూకట్‌పల్లి నల్లచెరువులో 16 షెడ్ల తొలగింపు
- అధికారులతో బాధితుల వాగ్వాదం.. తీవ్ర ఆవేదన
- నోటీసులు ఇచ్చాకే కూల్చివేస్తున్నాం: రంగనాథ్

హైదరాబాద్ సిటీ/హైదర్‌నగర్/పటాన్‌చెరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో రెండు వారాలపాటు కూల్చివేతలకు తాత్కాలిక విరామం ప్రకటించిన హైడ్రా.. తిరిగి తన పనిని మొదలుపెట్టింది. చెరువులు, ప్రభుత్వ స్థలాల్లోని అక్రమ నిర్మాణాలపై మరోసారి కొరడా ఝుళిపించింది. ఏకకాలంలో కూకట్‌పల్లిలో, అమీన్‌పూర్ మునిసిపాలిటీలోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడలో ప్రభుత్వ భూముల్లోని నిర్మాణాలను నేలమట్టం చేసింది. కూకట్‌పల్లి శాంతినగర్‌లోని నల్లచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో, కిష్టారెడ్డిపేటలోని

మిగతా 3వ పేజీలో...

సైనికుల రైలు వెళ్లే పట్టాలపై

డిటోనేటర్లు!

2

- మధ్యప్రదేశ్‌లో ఘటన
- యూపీలో రైలు పట్టాలపై గ్యాస్ సిలిండర్
- దర్యాప్తు జరుపుతున్న రైల్వే, ఎన్ఐఏ

సైదాబాద్‌లో.. మళ్లీ ఉగ్రమూలాలు



రిజ్వాన్ (ఫైల్)

- ఐఎస్ ఉగ్రవాది రిజ్వాన్ అలీకి ఆశ్రయం
- శంకేశ్వర్‌బజార్‌లో ఎన్ఐఏ సోదాలు

14



శ్రీలంక నూతన అధ్యక్షుడు దిసనాయకే

- దేశ చరిత్రలోనే తొలిసారిగా వామపక్ష నేతకు పగ్గాలు
- 9వ అధ్యక్షుడిగా నేడు ప్రమాణస్వీకారం
- మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించిన రణిల్

2



గిన్నిస్ బుక్‌పై మెగా స్టెప్

- 156 సినిమాల్లో 537 పాటల్లో
- మెగాస్టార్ 24 వేల స్టెప్పులు
- గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు
- సర్టిఫికెట్‌ను అందజేసిన గిన్నిస్ బృందం
- ముఖ్య అతిథిగా పాల్గొన్న అమీర్‌ఖాన్
- చిరంజీవికి సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

9

'అమృత్'లో అక్రమాలు లేవని తేలితే

రాజకీయ సన్యాసం

- రేవంత్ పదవి ఊడగొట్టేందుకు మంత్రి పొంగులేటి యత్నం
- దమ్ముంటే దర్యాప్తు జరిపించాలి.. సీజే దగ్గరకు వెళదాం రా
- ఇష్టం లేదంటే సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ వద్దకైనా వెళ్దాం
- ఈ వ్యవహారంలో సీఎం పదవి పోతుంది.. బీ రెడీ
- సింగరేణి కార్మికులకు బోనస్ కాదు.. బోగస్: కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): "అమృత్ టెండర్ల విషయంలో తప్పు జరిగిందని నిరూపిస్తే రాజీనామా చేస్తానని ఒక మంత్రి అన్నారు. ఆ సవాల్‌ను నేను స్వీకరిస్తున్నా. దమ్ముంటే దీనిపై విచారణ జరిపించాలి. ఎలాంటి అక్రమాలూ జరగలేదని విచారణలో తేలితే రాజీనామా కాదు.. నేను రాజకీయ సన్యాసం చేస్తా" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. మంత్రి పొంగులేటిని ఉద్దేశించి అన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం పదవిని ఊడగొట్టే ప్రయత్నంలో భాగంగానే పొంగులేటి తనకు సవాల్ విసిరారని ఆయన వ్యాఖ్యానించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. దమ్ముంటే దీనిపై దర్యాప్తు జరిపించాలని పొంగులేటిని డిమాండ్ చేశారు. "ఈ టెండర్లకు సంబంధించిన

మిగతా 12వ పేజీలో...



ఆలేరులో వ్యవసాయ కమిటీ ప్రమాణ స్వీకార సభలో మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల

త్వరలోనే బీఆర్ఎస్ దుకాణం బంద్!

- ఆ పార్టీ రోజురోజుకూ చచ్చిపోతోంది
- 8,888 కోట్లపై కేటీఆర్ ఆరోపణలు అబద్ధం
- వారి హయాంలో రూ.7 లక్షల కోట్ల అప్పులు
- దాంట్లో రూ.2 లక్షల కోట్లు వారే దోచుకున్నరు
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విమర్శలు
- లడ్డూ ప్రసాదాల నాణ్యతతో రాజీ పడొద్దు!
- యాదగిరిగుట్ట ఆలయ ఈవోకు సూచించిన మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల

ఆలేరు రూరల్/భువనగిరి అర్బన్, సెప్టెంబరు 22: బీఆర్ఎస్ పార్టీ దుకాణం త్వరలోనే బంద్ అవుతుందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆ పార్టీ రోజురోజుకూ చచ్చిపోతోందని చెప్పారు. శాసనసభలో ప్రతిపక్ష నాయకుడు ఎవరో కూడా తెలియదని ఎద్దేవా చేశారు. సీఎంపై కేటీఆర్ ఇచ్చిమొచ్చినట్లు మాట్లాడుతూ, రూ.8,888 కోట్లు

మిగతా 13వ పేజీలో...

నేడు, రేపు భారీ వర్షాలు

- ఒకట్రెండు మినహా అన్ని జిల్లాలకు అలర్ట్
- 4 రోజులు రాష్ట్రమంతా కురిసే చాన్స్

3

ఉగ్ర కుట్రల్లో ఒవైసీ కాలేజీ ఫ్యాకల్టీ

14

- మజ్లిస్.. ఉగ్రవాదులను పోషిస్తోంది
- తిరుపతి వేంకటేశ్వర స్వామి లడ్డూ కల్తీ.. హిందూ ధర్మంపై దాడి
- కేంద్ర మంత్రి బండి సంజయ్

శ్రీలంక నూతన అధ్యక్షుడిగా అనూర దిసనాయకే



దేశ చరిత్రలో తొలి మార్క్సిస్ట్ నేతగా రికార్డు

కొలంబో, సెప్టెంబరు 22: శ్రీలంక నూతన అధ్యక్షుడిగా మార్క్సిస్ట్ నేత, జనతా విముక్తి పెరమున(జేవీపీ) నాయకుడు అనూర కుమార దిసనాయకే ఎన్నికయ్యారు. దేశ చరిత్రలో అధ్యక్ష పీఠాన్ని అధిరోహించబోతున్న తొలి మార్క్సిస్ట్ నాయకుడిగా ఆయన రికార్డు సృష్టించారు. ఆదివారం జరిగిన ఎన్నికల ఫలితాల లెక్కింపులో తన సమీప ప్రత్యర్థి సమగి జన బలవేగయ(ఎస్‌జేబీ) నాయకుడు సజిత్ ప్రేమదాసపై ఘన విజయం సాధించారు. శనివారం జరిగిన ఎన్నికల్లో దిసనాయకే గెలుపొందినట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. ప్రతిపక్ష నేత సజిత్ ప్రేమదాస రెండో స్థానంలో నిలిచారని తెలిపింది. దిసనాయకే దేశ తొమ్మిదో అధ్యక్షుడిగా సోమవారం ప్రమాణస్వీకారం చేస్తారని జేవీపీ ప్రకటించింది. అవినీతి నిర్మూలన నినాదం, దేశ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెడతానని అనూర చేసిన వాగ్దానాలు యువ ఓటర్లను అమితంగా ఆకట్టుకున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. శ్రీలంక అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత మీడియాతో దిసనాయకే మాట్లాడుతూ.. జాతి ఐక్యత కోసం కలిసి పోరాడుదాం అన్ని పిలుపునిచ్చారు. కాగా, రాజపక్సా కాలం నాటి పరిస్థితుల వల్ల ఏర్పడ్డ రాజకీయ శూన్యత, ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని గట్టెక్కించడం వంటి సవాళ్లను దిసనాయకే ఎదుర్కొబోతున్నారు. కాగా, ప్రాధాన్య ఓట్ల లెక్కింపు ఆధారంగా శ్రీలంక అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. శనివారం జరిగిన ఎన్నికల్లో విజయానికి అవసరమైన 50% ఓట్లు ఏ అభ్యర్థి సాధించకపోవడంతో రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. దేశ చరిత్రలోనే మొదటి సారిగా రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరిగిందని ఎన్నికల ప్రధాన అధికారి ఆర్ఎంఏఎల్ రత్నాయకే ప్రకటించారు. కాగా, ఈ ఎన్నికల్లో 38 మంది పోటీ చేశారు. ప్రస్తుత అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే 17.41 శాతం ఓట్లతో తొలి రౌండ్‌లో పోటీ నుంచి నిష్క్రమించారు.



సైనికుల రైలు వెళ్లే పట్టాలపై డిటోనేటర్లు!

» మధ్యప్రదేశ్‌లో ఘటన..యూపీలో పట్టాలపై సిలిండర్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22: రైలు పట్టాలపై డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు ఉంచిన ఘటనలు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో చోటుచేసుకున్నాయి. జమ్మూకశ్మీరు నుంచి కర్ణాటకకు సైనికులతో వెళ్తున్న ప్రత్యేక రైలు.. మధ్యప్రదేశ్‌లోని సగ్‌ఫతా రైల్వే స్టేషన్ సమీపంలో ఉండగా పట్టాలపై డిటోనేటర్లను గుర్తించారు. వాటిని గమనించిన డ్రైవర్ రైలును కొద్దిసేపు ఆపి, స్టేషన్ మాస్టర్‌కు సమాచారం ఇచ్చారు. ఈ ఘటన బుధవారం జరిగిందని రైల్వే అధికారులు తెలిపారు. ఆ డిటోనేటర్లు హానికరమైనవి కాదని, అయినా అవి పట్టాలపై ఎందుకు ఉంచారనే విషయమై దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. ఇదిలా ఉండగా.. ఉత్తరప్రదేశ్‌లోని ప్రేమ్‌పూర్ రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై ఆదివారం గ్యాస్ సిలిండర్‌ను గుర్తించారు. దాన్ని చూసిన గూడ్స్ రైలు డ్రైవర్ అత్యవసర బ్రేకులు వాడి, రైలును నిలిపివేశారు. రైలు కాన్పూర్ నుంచి ప్రయాగ్‌రాజ్ వెళ్తోంది. యూపీలో ఇలాంటి ఘటన జరగడం ఇది రెండోసారి. ఈ నెల 8న కళింది ఎక్స్‌ప్రెస్ వెళ్లే మార్గంలో పట్టాలపై గ్యాస్ సిలిండర్‌ను ఉంచిన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఇలాంటి ఘటనలు జరుగుతుండడంతో రైలు ప్రమాదాలకు ఉగ్రవాదులు కుట్ర పన్నారా? అన్న కోణంలోనూ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) విచారణ జరుపుతోంది.

తన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేసిన కర్ణాటక హైకోర్టు జడ్జి శ్రీశానంద



బెంగళూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీశానంద తన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేశారు. ఇటీవల ఓ కేసు విచారణ సందర్భంగా తాను చేసిన వ్యాఖ్యల పట్ల విచారం వ్యక్తం చేస్తున్నానని శనివారం బెంచ్‌కు హాజరు కాగానే ఆయన పేర్కొన్నారు. బెంగళూరులోని గోరిపాళ్య.. పాకిస్థాన్ లాంటిదని, మైసూరు ఫ్లైఓవర్‌పై వెళ్లే ఆటోల్లో నిత్యం పరిమితికి మించి ప్రయాణిస్తారని న్యాయమూర్తి గతంలో వ్యాఖ్యలు చేశారు. అదే తరహాలోనే ఓ మహిళా న్యాయవాది పట్ల అనుచితంగా మాట్లాడిన వీడియోలు వైరల్ కావడంతో సుప్రీంకోర్టు ధర్మాసనం సుమోటోగా తీసుకుని, రెండు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని కర్ణాటక హైకోర్టు రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. ఈ వివాదం తీవ్రమవుతుండడంతో జస్టిస్ శ్రీశానంద స్పందించారు.

అసంపూర్ణ 'మందిర్'లో పూజలు చేయలేను

» జ్యోతిర్మఠ్ శంకరాచార్య వ్యాఖ్య

అయోధ్య, సెప్టెంబరు 22: అయోధ్యలోని బాల రాముని మందిరంలో పూజలు చేసేందుకు ఉత్తరాఖండ్‌లోని జ్యోతిర్మఠ్ శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి ఆదివారం సుముఖత వ్యక్తం చేయలేదు. అసంపూర్ణంగా ఉన్న మందిరంలో పూజలు చేయకూడదని, అందువల్లనే తాను దూరంగా ఉంటున్నట్లు తెలిపారు. ఆలయ శిఖరం నిర్మాణం పూర్తయిన తరువాతే పూజలు చేస్తానని చెప్పారు. అయోధ్యలోని రామ మందిరాన్ని ఎందుకు దర్శించడం లేదంటూ విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ పై విధంగా తెలిపారు. అయితే రాంకోట్ ప్రాంతంలో ఉన్న రామజన్మభూమి ప్రాంగణం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. చినేశ్వర్‌నాథ్ మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గౌ ధ్వజ్ స్థాపన భారత యాత్రను శంకరాచార్య ప్రారంభించారు. అయోధ్య సాధువులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ గో సంరక్షణ నిబంధనలను ఎవరూ అతిక్రమించని విధంగా చట్టాలను రూపొందించాలని తెలిపారు. "దేశంలో ఆవులను గోమాతలుగా పూజిస్తారని, కానీ గోమాంసం ఎగుమతి చేసే దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉండడం దురదృష్టకరమ"ని అన్నారు.

ఇండియన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చిబ్



న్యూఢిల్లీ/కోల్‌కతా, సెప్టెంబరు 22: ఇండియన్ యూత్ కాంగ్రెస్ (ఐవైసీ) నూతన అధ్యక్షుడిగా ఉదయ్ భాను చిబ్‌ను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం నియమించారు. ఈయన నియామకం తక్షణమే అమల్లోకి వస్తుంది. ఐవైసీ అధ్యక్షుడిగా ఉన్న శ్రీనివాస్ బీవీ స్థానంలో ఉదయ్ భాను చిబ్ నియామకం జరిగినట్టు పార్టీ ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుతం ఐవైసీ జనరల్ సెక్రటరీగా ఉన్న చిబ్ ఇంతకు ముందు జమ్మూకశ్మీర్ ప్రదేశ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేశారు. జమ్మూకు చెందిన చిబ్.. కాంగ్రెస్ నేత హరి సింగ్ చిబ్ కుమారుడు. మరోవైపు పశ్చిమబెంగాల్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) నూతన అధ్యక్షుడిగా సుభాంకర్ సర్కార్‌ను ఖర్గే శనివారం నియమించారు.

కోచింగ్ సెంటర్లపై కేంద్రం కొరడా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22: సరైన బోధన, ఇతర సదుపాయాలు కల్పించకుండా విద్యార్థుల నుంచి ఇష్టారీతిన ఎన్‌రోల్‌మెంట్ ఫీజును వసూలు చేసిన కోచింగ్ సెంటర్లపై కేంద్రం కొరడా ఝళిపించింది. సివిల్స్, ఐఐటీతో పాటు వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఎన్‌రోల్‌మెంట్ ఫీజులో రూ.కోటిని ఆయా శిక్షణా కేంద్రాల నుంచి జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్ (ఎన్‌సీహెచ్) రీఫండ్ చేయించింది. దేశవ్యాప్తంగా విద్యార్థుల నుంచి అందిన ఫిర్యాదుల నేపథ్యంలో వినియోగదారుల మంత్రిత్వ శాఖ జోక్యం చేసుకోవడంతో ముందు దశలోనే రీఫండ్‌ను ప్రాసెస్ చేశారు. విద్యార్థులు తమ ఫిర్యాదులను 1915కు ఫోన్ చేసి లేదా www.consumerhelpline.gov.in పోర్టల్ ద్వారా తెలియజేయవచ్చు' అని సూచించారు. కాగా, విద్యార్థుల ఆత్మహత్యలపై ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపవర్ సంస్థ మెంటల్ హెల్త్‌కేర్ పేరుతో సర్వే నిర్వహించింది. ప్రతి వంద మంది విద్యార్థుల్లో 69మంది తమలో ఆత్మహత్య సంకేతాలను గుర్తించలేకపోతున్నారని ఈ సర్వే తెలిపింది.

నిలబడతాం.. బలపడతాం



క్వాడ్ సదస్సులో మోదీ, అల్బనీస్, కిషిడా, బ్లింకెన్, బైడెన్

(మొదటి పేజీ తరువాయి)

పూర్తయిన సందర్భంగా జరిగిన సదస్సులో మోదీ, బైడెన్‌తోపాటు.. ఆస్ట్రేలియా ప్రధాని అల్బనెస్, జపాన్ ప్రధాని కిషిదా పాల్గొన్నారు. క్వాడ్‌కు వ్యతిరేకంగా చైనా వ్యాఖ్యలు చేస్తున్న నేపథ్యంలో.. మోదీ ఆ దేశం పేరును ప్రస్తావించకుండా తాము అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవిస్తామని, ఎవరికీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. తమ సందేశం ఒక్కటేనని, బలంగా నిలబడి, సభ్యదేశాల సహకారానికి కృషిచేస్తామని పేర్కొన్నారు. "ప్రపంచంలో ఉద్రిక్తతలు, సంఘర్షణలు చోటుచేసుకుంటున్న సమయంలో క్వాడ్ కూటమి ఏర్పాటైంది. మానవాళి శ్రేయస్సుకు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కంకణబద్ధమైంది. క్వాడ్ సదస్సులో ఫలవంతమైన చర్చలు జరిగాయి. ప్రపంచానికి మేలు జరిగేలా ఇంకా సమర్థంగా పనిచేయాలని నిర్ణయించాం" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇండో-పసిఫిక్ రీజియన్‌లో స్వేచ్ఛాయుత వాణిజ్యానికి సహకరించేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. అంతకు ముందు ఆయన 'క్వాడ్ క్యాన్సర్ మూన్‌షాట్ ఈవెంట్'లో మాట్లాడుతూ.. ఇండో-పసిఫిక్ రీజియన్ దేశాల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు, గుర్తింపు, చికిత్సకు భారత్ తరఫున రూ.62.61 కోట్ల(7.5 మిలియన్ డాలర్ల)ను అందజేస్తామని ప్రకటిస్తూ.. తమ లక్ష్యం 'ఒక భూగోళం.. ఒక ఆరోగ్యం' అంటూ నినదించారు. ఈ రీజియన్‌లోని దేశాలకు 4 కోట్ల డోసుల క్యాన్సర్ టీకాలను అందజేస్తామన్నారు.

క్వాడ్ దేశాధినేతల సంయుక్త ప్రకటన

ఈ సదస్సులో క్వాడ్ దేశాధినేతలు ఈశాన్య, దక్షిణాసియా, పసిఫిక్ దీవుల్లో పరస్పర సహరాన్ని అందిపుచ్చుకోవాలని నిర్ణయించారు. మారిటైమ్ ఇనిషియేటివ్ ఫర్ ట్రైనింగ్ ఇన్ ఇండో-పసిఫిక్(మైత్రి)ని క్వాడ్ దేశాధినేతలు సంయుక్తంగా ప్రకటించారు. ఇకపై ఇండో-పసిఫిక్ ప్రాంతంలోని సముద్ర జలాల్లో భద్రత, అంతర్జాతీయ చట్టాల అమలు, చట్టవ్యతిరేక చర్యల నిర్మూలనకు చర్యలు తీసుకుంటారు. ఇందుకోసం భారత్, అమెరికా, జపాన్ కోస్ట్‌గార్డులు, ఆస్ట్రేలియా సరిహద్దు దళం సంయుక్తంగా పనిచేస్తాయి. 2025లో మైత్రి శిక్షణ కార్యక్రమాలను భారత్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. సముద్రాల్లో క్వాడ్ పోర్టులను ఏర్పాటు చేసి, పరస్పరం సహకరించుకోవాలని నలుగురు నేతలు సంకల్పించారు. దీనిపై ముంబైలో 'క్వాడ్ ప్రాంతీయ పోర్టులు-రవాణా సదస్సు'ను నిర్వహించాలని నిర్ణయించారు. క్వాడ్ ఇండో-పసిఫిక్ లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని నిర్ణయించారు. ఇండో-పసిఫిక్ ప్రాంత నిపుణులకు ఇస్తున్న ఫెలోషిప్‌ల సంఖ్యను 2,200కు పెంచాలని క్వాడ్ దేశాధినేతలు నిర్ణయించారు. ఇండో-పసిఫిక్ రీజియన్‌లో సెమీకండక్టర్ల సప్లయ్ చైన్ ఏర్పాటు తదితర అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు.


'విల్మింగ్టన్ డిక్లరేషన్'లో పాక్‌పై నిప్పులు

క్వాడ్ దేశాధినేతలు 'విల్మింగ్టన్ డిక్లరేషన్' పేరిట సీమాంతర ఉగ్రవాదాన్ని ముక్తకంఠంతో ఖండించారు. ఈ సందర్భంగా పరోక్షంగా పాకిస్థాన్ చర్యలపై నిప్పులు కురిపించారు. 26/11 ముంబై ఉగ్రదాడులు, పఠాన్‌కోట్ దాడి గురించి ప్రస్తావించారు. అదే సమయంలో చైనా, ఉత్తరకొరియాల తీరును కూడా పరోక్షంగా ఎండగట్టారు. రష్యాకు ఉత్తర కొరియా ఆయుధ సంపత్తిని అందజేస్తున్న విషయాన్ని ఆయా దేశాల పేర్లను ప్రస్తావించకుండా విమర్శించారు.

వచ్చే ఏడాది భారత్‌లో..

క్వాడ్ దేశాధినేతల తదుపరి సదస్సు వచ్చే ఏడాది భారత్‌లో జరగనుంది. నాలుగేళ్ల క్రితం ఈ సంస్థ ఆవిర్భవించగా.. అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, భారత్‌లలో సదస్సులు నిర్వహించాలని నిర్ణయించారు. నిజానికి ఈ సంవత్సరం భారత్ వంతు కాగా.. తన పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో తన స్వస్థలంలో సమ్మిట్‌కు అనుమతించాలని అమెరికా అధ్యక్షుడు బైడెన్ విజ్ఞప్తి చేశారు. దాంతో.. వచ్చే ఏడాది సదస్సును భారత్‌లో ఏర్పాటు చేయాలని తీర్మానించారు.

చైనా పరీక్ష పెడుతోంది



వాషింగ్టన్, సెప్టెంబరు 22 : ఇండో పసిపిక్ ప్రాంతంలో చైనా తమకు పరీక్ష పెడుతోందని క్వాడ్ దేశాల అధినేతల సదస్సులో బైడెన్ అన్నారు. అయితే ఆయనకు ఆ సమయంలో అక్కడున్న మైక్ ఆన్‌లో ఉందని తెలియదు. ఆర్థిక, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలతోపాటు అనేక విషయాల్లో ఇండో-పసిపిక్ ప్రాంతంలో చైనా దూకుడుగా వ్యవహరిస్తోందని ఆయన క్వాడ్ దేశాధినేతలతో చెప్పారు. ఇదిలా ఉండగా, మహారాష్ట్రకు చెందిన హస్త కళాకారులు తయారుచేసిన ఒక వెండి రైలు నమూనాను ప్రధాని మోదీ బైడెన్‌కు ఆదివారం బహూకరించారు. ఈ సందర్భంగా అమెరికా ప్రథమ మహిళ జిల్ బైడెన్‌కు జమ్ము, కశ్మీర్‌లో తయారుచేసిన పాష్మినా శాలువాను ప్రధాని బహూకరించడం విశేషం. మరోవైపు, భారత్ నుంచి అక్రమంగా అమెరికాకు తరలించిన 297 పురాతన కళాఖండాలను ఆ దేశం భారత్‌కు అప్పగించింది.



భారత్‌ను ఆపడం ఎవరితరం కాదు

నా ముందు మహోన్నత లక్ష్యాలున్నాయి

ప్రవాస భారతీయులతో ప్రధాని మోదీ

'పుష్ప'కు ప్రధాని కొత్త నిర్వచనం

న్యూయార్క్, సెప్టెంబరు 22: మూడో ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారత్‌ను ఆపడం ఎవరితరం కాదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. మూడో సారి ప్రధానిగా ఎన్నికైన తన ముందు మహోన్నత లక్ష్యాలున్నాయని వివరించారు. ఆదివారం ఆయన న్యూయార్క్‌లో ప్రవాస భారతీయులు ఏర్పాటు చేసిన 'మోదీ- యూఎస్- ప్రోగ్రెస్ టుగెదర్' కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో 15 వేల మంది భారతీయులు పాల్గొన్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ పుష్ప-1లోని 'శ్రీవల్లి' పాటతో ఆహూతులను ఉర్రూతలూగించగా.. ఆయన 'హర్ ఘర్ తిరంగా' పాటను ఆలపిస్తుండగా.. ప్రధాని మోదీ వేదికపైకి చేరుకున్నారు. మోదీ కూడా పుష్ప గురించి మాట్లాడారు. "పుష్ప అంటే.. ప్రోగ్రెసివ్ భారత్.. అన్‌స్టాపబుల్ భారత్, స్పిరిచ్యువల్ భారత్, డెడికేటెడ్ భారత్, హ్యుమానిటీ ఫస్ట్ భారత్, ప్రాస్పరస్ భారత్" అని వివరించారు. ప్రవాస భారతీయులను భారత్‌కు బలమైన అంబాసిడర్లుగా అభివర్ణించారు. "నా జీవితంలో నేను ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిని అవుతానని ఊహించలేదు. ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపడతానని అనుకోలేదు. మూడోసారి ప్రధానిగా ఎన్నికైన నా ముందు మహోన్నతమైన లక్ష్యాలున్నాయి. మూడో ఆర్థిక శక్తిగా భారత్‌ను తయారు చేస్తాం. 5జీ టెక్నాలజీలో అమెరికా కంటే ఎక్కువ నెట్‌వర్క్‌ను కవర్ చేస్తున్నాం" అని వివరించారు. కాగా.. సోమవారం ఐక్య రాజ్య సమితి(ఐరాస) సర్వసభ్య సమావేశంలో 'సమ్మిట్ ఆఫ్ ద ఫ్యూచర్' అనే అంశంపై మోదీ ప్రసంగించనున్నారు.

మోదీపై బైడెన్ పొగడ్తల వర్షం

విల్మింగ్టన్‌లో శనివారం బైడెన్-మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపిన విషయం తెలిసిందే.! ఈ చర్చల్లో భాగంగా మోదీపై బైడెన్ పొగడ్తల వర్షం కురిపించినట్లు విదేశాంగ శాఖ అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఉక్రెయిన్‌లో మోదీ పర్యటన.. శాంతికోసం ఆయన చేస్తున్న కృషిని అభినందించినట్లు వివరించారు. కొవిడ్ సమయంలో 'టీకా మైత్రి' మొదలు.. ఇటీవలి జీ20 సమ్మిట్ వరకు ప్రపంచ క్షేమం కోసం భారత్ చేస్తున్న కృషిని కొనియాడినట్లు పేర్కొన్నారు. ఇరువురు నేతల భేటీలో.. సెమీకండక్టర్లు మొదలు.. అంతరిక్షం దాకా పలు అంశాలపై చర్చలు జరిగినట్లు తెలిపారు. భారత్-అమెరికా మధ్య కీలకమైన రక్షణ, క్లీన్ ఎనర్జీ, గ్లోబల్ హెల్త్‌పై ఒప్పందాలు కుదిరినట్లు వెల్లడించారు. ఐక్య రాజ్య సమితి(ఐరాస)లో భారత్ శాశ్వత సభ్యత్వానికి కృషిచేస్తానని బైడెన్ పేర్కొన్నట్లు వివరించారు.



'మోదీ- యూఎస్- ప్రోగ్రెస్ టుగెదర్'కు హాజరైన ప్రవాస భారతీయులు

రైళ్లలో పోలీసులూ ఉల్లంఘనులే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22: రైళ్లలో టికెట్ లేకుండా ప్రయాణాలు చేసే వాళ్లలో పోలీసులు కూడా అధిక సంఖ్యలో ఉంటున్నారని అధికారులు చెబుతున్నారు. ఇటీవల ఘజియాబాద్-కాన్పూర్ సెక్షన్‌లో చేపట్టిన తనిఖీల్లో వందల మంది పోలీసులు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఏసీ బోగీలు, మెయిల్ రైళ్లలో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్నట్లు గుర్తించామని ఓ అధికారి పేర్కొన్నారు. వారిపై జరిమానా విధిస్తే చెల్లించేందుకు నిరాకరించారని, పైగా తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించినట్లు తెలిపారు. కాగా, పండుగ సీజన్ నేపథ్యంలో రైల్వే అధికారులు ప్రత్యేక తనిఖీలు(డ్రైవ్) నిర్వహించాలని నిర్ణయించారు. దీనిపై రైల్వే శాఖ ఈనెల 20న 17 రైల్వే జోన్ల జనరల్ మేనేజర్లకు లేఖ రాసింది. అక్టోబరు 1 నుంచి 15 వరకు, అదే విధంగా అక్టోబరు 25 నుంచి నవంబరు 10 వరకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించింది. కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో టికెట్ లేకుండా రైళ్లలో ప్రయాణాలు చేస్తున్న 3.61 కోట్ల మంది ఉల్లంఘనదారులను పట్టుకోగా, వారి నుంచి రూ.2,231.74 కోట్లు జరిమానా వసూలు చేశారు.

ఎస్టీలపై దాడుల్లో ఐదో స్థానంలో ఏపీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22: దేశంలో ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించి నమోదైన కేసుల్లో 98.35% వరకు 13 రాష్ట్రాల్లోనే ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. 2022లో నమోదైన కేసులపై తాజా గణాంకాలతో కూడిన నివేదికను విడుదల చేసింది. ఆ ఏడాది ఎస్టీలపై దాడుల కేసులు 9,735 నమోదు కాగా.. మధ్యప్రదేశ్ మొదటి స్థానం(2,979-30.61%)లో ఉండగా.. ఏపీ 499 కేసులతో ఐదో స్థానం(5.13%)లో నిలిచింది. ఎస్సీలపై దాడుల కేసులు 51,656 కాగా.. ఉత్తరప్రదేశ్ 12,287 కేసులతో ప్రథమ స్థానం(23.78%)లో నిలిచింది. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద మొత్తంగా 60,391 కేసులు నమోదయ్యాయి. అయితే ఈ చట్టం కింద నమోదైన కేసుల్లో శిక్షలు పడడం గణనీయంగా తగ్గిపోయింది.

మా నిజాయితీపై మోదీ దాడి!

కుట్రతో ఆప్ నేతలను జైలుకు పంపుతున్నారు.. నాకు సొంత ఇల్లు కూడా లేదు.. డబ్బు సంపాదించలేదు

» తోలుమందం నేతలపై అవినీతి ఆరోపణలు ప్రభావం చూపవు

» నాపై ప్రభావం చూపుతాయి.. అందుకే రాజీనామా చేశా: కేజ్రీ



న్యూఢిల్లీ, సెప్టెంబరు 22: ప్రధాని మోదీ కుట్రతో తన నిజాయితీపై దాడి చేస్తున్నారని, ఆమ్ ఆద్మీ పార్టీ నేతలను జైలుకు పంపుతున్నారని ఆ పార్టీ అధినేత కేజ్రీవాల్ ఆరోపించారు. ఢిల్లీ సీఎం పదవి నుంచి వైదొలగిన తర్వాత తొలిసారిగా ఆయన ప్రజల ముందుకు వచ్చారు. ఆదివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన సభలో కేజ్రీవాల్ మాట్లాడుతూ 'గత పదేళ్లుగా మేం ప్రభుత్వాన్ని నిజాయితీగా నడుపుతున్నాం. దీంతో మాపై గెలవాలంటే మా నిజాయితీపైనే దాడి చేయాలని మోదీ భావించారు. అందుకే కేజ్రీవాల్, సిసోడియా, ఇతర ఆప్ నేతలను అవినీతిపరులుగా నిరూపించేందుకు, వారందరినీ జైల్లో పెట్టేందుకు మోదీ కుట్ర పన్నారు. గత పదేళ్ల పాలనలో నేను డబ్బు సంపాదించలేదు. గౌరవాన్ని, ప్రజల ప్రేమను మాత్రమే సంపాదించాను. దేశ రాజకీయాలను మార్చడానికి, భారత మాత కోసం నేను రాజకీయాల్లోకి వచ్చాను. డబ్బు సంపాదించాలనుకుంటే.. ఐటీశాఖ ఉద్యోగంలో ఉన్నప్పుడే ఆ పని చేసేవాడిని. తోలుమందం నేతలు(ఇతర పార్టీల నాయకులు) అవినీతి ఆరోపణలను పట్టించుకోరు. కానీ, నేను పట్టించుకుంటాను. బీజేపీ నేతలు దొంగ, అవినీతిపరుడు అనడం నా హృదయాన్ని గాయపరిచింది. అందుకే బాధతో రాజీనామా చేశాను. నాకు సొంత ఇల్లు కూడా లేదు. తమ ఇల్లు తీసుకోవాలని ప్రజల నుంచి నాకు ఫోన్లు వస్తున్నాయి. దసరా నవరాత్రులు మొదలైనప్పుడు సీఎం బంగ్లాను ఖాళీ చేసి, వారి(ఢిల్లీ ప్రజలు)లో ఒకరి ఇంటికి వెళ్లి నివసిస్తాను' అన్నారు. త్వరలో జరుగనున్న ఢిల్లీ ఎన్నికలు తనకు అగ్ని పరీక్ష అని వ్యాఖ్యానించారు.

బీజేపీలో చేరకపోతే చంపేస్తామన్నారు

బీజేపీలో చేరకపోతే జైలులోనే చంపేస్తామంటూ తనకు బెదిరింపులు వచ్చాయని ఆప్ నేత సిసోడియా చెప్పారు. "జర్నలిస్టుగా ఉన్నప్పుడు 2002లో రూ.5 లక్షలతో ఫ్లాట్ కొన్నా. దాన్ని తీసేసుకున్నారు. నా బ్యాంకులోని రూ.10లక్షలను స్తంభింపజేశారు. కుమారుడి కాలేజీ ఫీజుల కోసం అడుక్కునేలా చేశారు" అంటూ ఆవేదన చెందారు. గత 26 ఏళ్లుగా అరవింద్ కేజ్రీవాల్‌ను అన్నగా భావిస్తున్నానని, ఈ రామ లక్ష్మణులను ఏ రావణుడూ విడదీయలేరని అన్నారు. ప్రజల తీర్పు పొందిన తరువాతే పదవులు చేపడుతామని చెప్పారు.

ఆడ్వాణీకి వర్తించిన రూల్ మోదీకి వర్తించదా?

ప్రతిపక్ష పార్టీలను విచ్ఛిన్నం చేయడం, అవినీతిపరులైన రాజకీయ నాయకులకు ఆశ్రయం కల్పించడం ద్వారా మోదీ అనుసరిస్తున్న విధానంపై ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు ఈ సందర్భంగా కేజ్రీవాల్ ఐదు ప్రశ్నలు సంధించారు. అత్యధికమంది అవినీతి నేతలను మోదీ తన పార్టీలో చేర్చుకున్నారని, ఆయనే ఒకప్పుడు వారందరినీ అవినీతిపరులన్నారని కేజ్రీవాల్ గుర్తుచేశారు. ఇలాంటి రాజకీయాలను ఆర్ఎస్ఎస్ ఆమోదిస్తుందా? అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. అలాగే, బీజేపీలో రిటైర్‌మెంట్ వయసు(75 ఏళ్లు) నిబంధన ఎల్‌కే ఆడ్వాణీకి వర్తించినట్టే, మోదీకీ వర్తిస్తుందా? అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. మోదీకి ఆ నిబంధన వర్తించదని అమిత్‌షా అంటున్నారని కేజ్రీవాల్ చెప్పారు. బీజేపీకి సైద్ధాంతిక గురువు అయిన ఆర్ఎస్ఎస్ అవసరం తమ పార్టీకి లేదని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా వ్యాఖ్యానించినప్పుడు భగవత్‌కు ఏమనిపించింది? అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. బీజేపీ ప్రస్తుత రాజకీయాల పట్ల భగవత్ సంతృప్తి చెందుతున్నారా? అని కూడా కేజ్రీవాల్ ప్రశ్నించారు.

వేర్పాటువాదం నుంచి ప్రజాస్వామ్యం వైపు!

జమ్మూకశ్మీర్ ఎన్నికల బరిలో 25 మంది వేర్పాటువాదులు

గతంలో ఎన్నికలు బహిష్కరించిన వారే ఇప్పుడు బరిలోకి



ఎన్నికల ప్రచారంలో భాగంగా దాల్ సరస్సులో ఒమర్ అబ్దుల్లా ర్యాలీ

శ్రీనగర్, సెప్టెంబరు 22: దశాబ్దాలపాటు తీవ్రవాదం, వేర్పాటువాదం, ఎన్నికల బహిష్కరణలు వంటి సమస్యలతో సతమతమైన జమ్మూకశ్మీర్‌లో గణనీయమైన మార్పు కనిపిస్తోంది. గతంలో ఎన్నికలు బహిష్కరించిన వారే ఇప్పుడు ప్రజాస్వామ్యం వైపు మొగ్గుచూపి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. సమస్యల పరిష్కారానికి ప్రజాస్వామ్య ప్రక్రియే మార్గమని తలంచి.. ప్రజలంతా ఎన్నికల్లో పాల్గొనాలని పిలుపునిస్తున్నారు. ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం 25 మందికిపైగా మాజీ మిలిటెంట్లు, వేర్పాటువాదులు, నిషేధిత జమాతే ఇస్లామీ సభ్యులు, వారి బంధువులు స్వతంత్ర అభ్యర్థులుగా, లేదా పార్టీ టికెట్లపై పోటీ చేస్తున్నారు. వారిలో మాజీ వేర్పాటువాదులు జాఫర్ హబీబ్ దార్, సయ్యద్ సలీం గిలానీ, జావిద్ హబ్బీ, ఆగా ముంతాజిర్ మెహ్దీ వంటి ప్రముఖులు కూడా ఉన్నారు. జమ్మూకశ్మీర్ అప్నీ పార్టీ అభ్యర్థిగా జాఫర్ హబీబ్ దార్ బరిలోకి దిగుతున్నారు. 2019లో కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ను రద్దు చేసి.. దీన్ని కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించినప్పటి నుంచి జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు మారాయి. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారానికి ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని జాఫర్ భావిస్తున్నారు. 'ఎన్నికల ప్రక్రియ ద్వారానే సమస్యలను పరిష్కరించగలం. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలి' అని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. జేకేఎల్ఎఫ్ మాజీ కమాండర్ ఫరూక్ అహ్మద్ దార్ కూడా ఈ ఎన్నికల బరిలో ఉన్నారు. సైఫుల్లా ఫరూక్‌గా కూడా పేరుపొందిన దార్.. హబ్బా కదల్ నియోజకవర్గం నుంచి సమాజ్‌వాదీ పార్టీ టికెట్‌పై పోటీ చేస్తున్నారు. 1989లో ఆయుధాల శిక్షణ కోసం దార్ పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు వెళ్లారు. కానీ, ఇప్పుడు ఆ నిర్ణయంపై పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నారు. "ఆ సమయంలో అందరం తుపాకీ పట్టుకున్నాం. కశ్మీర్‌లో పాకిస్థాన్ ఏజెంట్లు మమ్మల్ని తప్పుదోవ పట్టించారు" అని దార్ పేర్కొన్నారు. ఏడాదిపాటు తీవ్రవాద కార్యకలాపాలు నడిపిన దార్ ఆ తర్వాత పోలీసులకు లొంగిపోయి.. దాదాపు ఐదేళ్లు జైలు జీవితం గడిపారు. 2019లో మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై పోటీచేశారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కశ్మీర్‌లో పాకిస్థాన్ జోక్యాన్ని వ్యతిరేకిస్తూ ఓటర్లను ఆకర్షిస్తున్నారు. దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామా, కుల్గాం, బందిపొరా, బారాముల్లా, సోపోర్ సహా సుమారు 15 నియోజకవర్గాల్లో జమాత్ వ్యూహాత్మకంగా స్వతంత్ర అభ్యర్థులను బరిలోకి దింపింది. వారిలో తలాత్ మజీద్, సయార్ అహ్మద్, హఫీజ్ మొహమ్మద్ వంటి ప్రముఖులు కూడా ఉన్నారు. కాగా.. మాజీ మిలిటెంట్లు, వేర్పాటువాదులు కలిసి తహ్రీక్-ఇ-అవామ్ అనే రాజకీయ గ్రూపుగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.

హిజ్బుల్లా 7 ఇజ్రాయెల్

బీరుట్, టెల్ అవీవ్, సెప్టెంబరు 22: పశ్చిమాసియా మరింత ఉద్రిక్తంగా మారింది. నిన్నటివరకు హమాస్-ఇజ్రాయెల్ మధ్య సాగిన యుద్ధం ఇప్పుడు హిజ్బుల్లా- ఇజ్రాయెల్‌ల పూర్తిస్థాయి సమరంగా మారింది. గాజా యుద్ధం మొదలయ్యాక ఎన్నడూ లేనంతగా.. హిజ్బుల్లా ఆదివారం తెల్లవారుతుండగానే నాలుగు దశల్లో ఉత్తర ఇజ్రాయెల్‌పైకి 100కు పైగా రాకెట్లను ప్రయోగించింది. వీటిలో కొన్ని హైఫా, నజారెత్ నగరాల సమీపంలో పడ్డాయి. హైఫా, రమత్ డేవిడ్ వైమానిక స్థావరాలపైకి ఫాది 1, ఫాది 2 క్షిపణులను ప్రయోగించినట్లు ఉగ్ర సంస్థ తెలిపింది. బీరుట్‌పై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) దాడికి ఇది ప్రతీకారమని పేర్కొంది. చాలావరకు క్షిపణులను గాల్లోనే అడ్డుకున్నట్లు ప్రకటించిన ఇజ్రాయెల్.. ప్రతిగా లెబనాన్‌పై భారీఎత్తున దాడులకు దిగింది. 400 దాడులు చేసి రాకెట్ లాంచర్లను ధ్వంసం చేసినట్లు ప్రకటించింది. హిజ్బుల్లా దాడులతో ఉత్తర ఇజ్రాయెల్‌లోని పలు భవనాలు దెబ్బతిన్నాయి. హై అలర్ట్ ప్రకటించి వేలమందిని సురక్షిత ప్రదేశాలకు తరలించారు. సరిహద్దుల్లోని తమ పౌరుడు ఒకరు చనిపోయినట్లు లెబనాన్ తెలిపింది. ఇదిలా ఉండగానే వెస్ట్‌బ్యాంక్‌లోని అల్ జజీరా న్యూస్ చానెల్ కార్యాలయంలోకి వెళ్లిన ఇజ్రాయెల్ దళాలు దానిని సీజ్ చేశాయి. 45 రోజుల పాటు కార్యకలాపాలను నిలిపివేయాలని ఆదేశాలిచ్చాయి. హిజ్బుల్లాను చావుదెబ్బ కొట్టామని, ఇప్పటికీ వారికి పరిస్థితి అర్థం కాకపోతే, మరింత అర్థమయ్యేలా చెబుతామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ హెచ్చరించారు. అల్ షతీ శరణార్థి శిబిరంలోని కఫ్రి ఖాసిం స్కూల్‌పై ఇజ్రాయెల్ దాడిలో ఏడుగురు చనిపోయారు.

పసికూనపై క్యాన్సర్ ప్రతాపం

- ఇప్పటికే రెండుసార్లు సర్జరీ... మళ్లీ కీమో థెరపీ చేయాలన్న వైద్యులు
- సాయం కోసం తల్లిదండ్రుల వేడుకోలు



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇంకా పాలు తాగే వయసు కూడా దాటని ఓ పసికూనపై క్యాన్సర్ మహమ్మారి తన ప్రతాపాన్ని ప్రదర్శిస్తోంది. ఇప్పటికే రెండు సార్లు సర్జరీ చేసి కణతులు తొలగించినప్పటికీ మరల చికిత్స అవసరమవుతుండటంతో వైద్య ఖర్చులు భరించలేని స్థితిలో ఉన్న ఆ బిడ్డ తల్లిదండ్రులు దాతల సాయం కోసం అర్థిస్తున్నారు. తమ కూతురు ప్రాణాలు కాపాడాలని ప్రాధేయపడుతున్నారు. మునుగోడు మండలం కొరటికల్ గ్రామానికి చెందిన అయితగోని రవి, మమత దంపతుల ఏకైక కుమార్తె ఆరుషి. 20 నెలల వయసున్న ఆ శిశువుకి... వెన్నెముకలో కణతి ఉండటంతో ఏప్రిల్ 27న మెడికవర్ ఆస్పత్రి వైద్యులు సర్జరీ చేసి తొలగించారు. దురదృష్టవశాత్తు తిరిగి అదే చోట మరో కణతి ఏర్పడటంతో గత నెల 20న రెండోసారి సర్జరీ చేసి దాన్ని తొలగించారు. అయితే ఈ సర్జరీ తర్వాత మళ్లీ ఇటువంటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు కీమో థెరపీ చికిత్స చేయాలని వైద్యులు సూచించారు. రెండు సర్జరీలకు ఇప్పటికే రూ. 8 లక్షలు ఖర్చయ్యాయని, మరో ఎనిమిది లక్షల దాకా అవసరమవుతుందని రవి చెప్తున్నాడు. పాప కీమో థెరపీ ఒక్కసారి(ఒక సైకిల్)కి రూ. 1.50 లక్షల నుంచి 1.80 లక్షల వరకు వ్యయం కానుంది. ప్రైవేటు ఉద్యోగం చేసుకునే తాను ఖర్చు భరించలేకపోతున్నానని, దాతలు సాయం చేయాలని వేడుకుంటున్నాడు. దాతలు.. అకౌంట్ నంబర్ 39905920603, ఐఎఫ్ఎస్సీ-ఎస్‌బీఐ 011984 నంబరుకు లేదా 6300355536(అయితగోని రవి) నంబరుకు గూగుల్‌పే చేయవచ్చునన్నారు.

రేవంత్ నోరు కట్టేసిన అధిష్ఠానం

- వర్గీకరణకు ఆయన సానుకూలమే కానీ..
హైకమాండ్ నో: మంద కృష్ణ మాదిగ

తెనాలి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఎస్సీల వర్గీకరణకు సీఎం రేవంత్‌రెడ్డి అనుకూలంగా ఉన్నా కాంగ్రెస్ అధిష్ఠానం ఆయన నోరు కట్టేసిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఏపీలోని గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. శనివారం రాత్రి మొదలైన సభ.. ఆదివారం తెల్లవారుజాము వరకు సాగింది. ఏపీలో వర్గీకరణ కచ్చితంగా అమలవుతుందని నమ్ముతున్నానని, తెలంగాణ, కర్ణాటకలోనే అమలుపై అనుమానాలు ఉన్నాయన్నారు. 'ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు వల్లే ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతుందని నాకు తెలుసు. కానీ మనలో కొందరు వైసీపీని నమ్మి నన్ను అనుమానించారు. మనల్ని గొర్రెల్ని చేసిన జగన్ కసాయిగా మారి వర్గీకరణను చంపేశారు' అని అన్నారు. జగన్ మాదిగల ద్రోహి అని విమర్శించారు. వర్గీకరణ విషయంలో కాంగ్రెస్, వైసీపీ మినహా దేశంలోని అన్ని పార్టీలూ సహకరించాయన్నారు.

24 ఇళ్లు నేలమట్టం



ముందే సమాచారమిచ్చాం

నల్లచెరువు పక్కనున్న షెడ్ల యజమానులకు శనివారమే సమాచారమిచ్చాం. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణాలు ఉన్నాయని, యంత్రాలు, ఇతర సామగ్రి తొలగిస్తే కూల్చివేతలు చేపడతామని చెప్పాం. అయినా కొందరు పట్టించుకోలేదు. కూల్చివేతల సమయంలోనూ ఖాళీ చేయడం కంటే.. అడ్డుకోవడంపైనే వారు దృష్టి సారించారు. అందుకే కూల్చివేయాల్సి వచ్చింది. అవన్నీ నివాసేతర వినియోగాలు. భారీ స్థాయిలో కిచెన్‌లు ఏర్పాటుచేసి కేటరింగ్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఎక్కడైనా కూల్చివేతలు చేపట్టే ముందు ఖాళీ చేయాలని ముందే సమాచారం ఇస్తున్నాం. ఇక్కడ కూడా అదే చేశాం.

- ఎ.వి.రంగనాథ్, హైడ్రా కమిషనర్

(మొదటిపేజీ తరువాయి)

ఎకరంపైగా, పటేల్‌గూడలోని మూడు ఎకరాలకు పైగా విస్తీర్ణంలోని నిర్మాణాలను కూల్చివేసింది. రెవెన్యూ, నీటి పారుదల, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలిసి హైడ్రా బృందం కూల్చివేతలు చేపట్టింది. మూడు ప్రాంతాల్లోని 8ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆక్రమణలు, భవనాలు తొలగించినట్టు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. అయితే తమ సామాన్లను కూడా తీసుకునే సమయం ఇవ్వకుండా నిర్మాణాలు నేలమట్టం చేశారని బాధితులు లబోదిబోమన్నారు. అప్పులు చేసి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే తాము హైడ్రా చర్యతో రూ.లక్షల్లో నష్టపోయి రోడ్డున పడ్డాయని ఆవేదన చెందారు.

కూకట్‌పల్లిలో 16 షెడ్లు నేలమట్టం..

ఎప్పటిలానే ఉదయం 5గంటలకే యంత్రాలతో సహా వివిధ విభాగాల అధికారులు, హైడ్రా బృందాలు ఆయా ప్రాంతాలకు చేరుకున్నారు. భారీ పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేతలు ప్రారంభించారు. కూకట్‌పల్లి శాంతినగర్‌లోని నల్లచెరువు 27 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని దాదాపు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో కొందరు వ్యక్తులు షెడ్లు నిర్మించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. కేటరింగ్ కోసం కిచెన్‌లు ఏర్పాటు చేశారు. ఇతరత్రా వ్యాపారాలూ సాగుతున్నాయి. వాటిలో పనిచేసే కార్మికులు ఉండేందుకు తాత్కాలిక నివాసాలు నిర్మించారు. ఫిర్యాదుల నేపథ్యంలో పలుమార్లు చెరువును పరిశీలించిన హైడ్రా అధికారులు.. నిర్మాణాలు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నట్టు నిర్ధారణకు వచ్చారు. సర్వే నంబర్లు 66, 67, 68, 69లోని 16 వాణిజ్య షెడ్లు, ప్రహరీ గోడలను నేలమట్టం చేశారు. ఇందులో ఐదు కేటరింగ్ షెడ్లు, మూడు ఫ్లెక్సీ ప్రింటింగ్ నిర్మాణాలు, రెండు టెంట్ హౌస్‌లు, ఆరు గోడౌన్లు ఉన్నాయి. ఒక టెంట్‌హౌస్‌కు చెందిన గోడౌన్‌లో సామాను బయటకు తీయకుండానే నేలమట్టం చేశారు. కూల్చివేతలను ప్రారంభించగానే వ్యాపారులు, అక్కడ నివసించేవారు అడ్డుకునే ప్రయత్నం చేశారు. తమకు అన్యాయం చేయొద్దంటూ అధికారులకు మొర పెట్టుకున్నారు. అయితే అధికారులు వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నిస్తూనే కూల్చివేతలను కొనసాగించారు. కాగా, భారీ ఎత్తున కేటరింగ్ నిర్వహించే ఓ వ్యక్తి అక్కడే స్థిర నివాసం ఏర్పాటుచేసుకొని ఉంటున్నారు. కూల్చివేతల నేపథ్యంలో ఆయనతోపాటు కుటుంబ సభ్యులు రోదిస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. హైడ్రా అధికారులు మాత్రం.. నివాసేతర నిర్మాణాలను మాత్రమే కూల్చామని చెప్పారు. చెరువు స్థలాన్ని చెరబట్టిన కొందరు వ్యక్తులు.. అక్కడ షెడ్లు వేసుకొని వ్యాపారం చేస్తున్న పలువురి నుంచి అద్దె వసూలు చేస్తున్నారని తెలిపారు.

కిష్టారెడ్డిపేటలో భవనాలు..

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మునిసిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ గ్రామాల్లో ప్రభుత్వ భ హావ ౨౨ లను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను హైడ్రా ఆదివారం కూల్చివేసింది. కిష్టారెడ్డిపేట గ్రామ పరిధిలో సర్వే నంబర్ 164లోని ప్రభుత్వ భూమిలో మూడు బహుళ అంతస్తుల భవనాలను హైడ్రా నేలమట్టం చేసింది. వీటిలో ఒకటి ఐదంతస్తుల భవనం కాగా, మరో రెండు భవనాలు నాలుగు అంతస్తులుగా నిర్మించారు. ఇవన్నీ నివాసేతర నిర్మాణాలు కాగా.. వీటిలో ఓ భవనాన్ని ఆస్పత్రి కోసం నిర్మించారు. అమీన్‌పూర్ మునిసిపాలిటీలో ఇటీవలే విలీనమైన కిష్టారెడ్డిపేటలో గ్రామ పంచాయతీ అనుమతులతో ఈ భవనాల నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణాలపై గతంలోనే అనేకసార్లు ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వ సర్వే నంబర్‌లో నిర్మిస్తున్న భవనాలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు అందినా అధికారులు పట్టించుకోలేదు. రెవెన్యూ సిబ్బంది ఇక్కడ పలుమార్లు సర్వేలు నిర్వహించి మూడు భారీ భవనాలు ప్రభుత్వ భూమిలో ఉన్నాయని తేల్చడంతో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. భవన యజమానులు తమవద్ద ఉన్న పత్రాలను, పంచాయతీ ఇచ్చిన అనుమతులను చూపించి కూల్చొద్దంటూ అధికారులను వేడుకున్నారు. పోలీసులు వారికి నచ్చచెప్పి అక్కడి నుంచి పంపించి వేశారు. వీటి కూల్చివేత ద్వారా దాదాపు ఎకరం స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్టు హైడ్రా అధికారులు తెలిపారు. మరోవైపు ఇటీవలే మునిసిపాలిటీలో విలీనమైన పటేల్‌గూడ పంచాయతీ పరిధిలోని బీఎస్ఆర్ కాలనీ పక్కన ప్రభుత్వ భూమిలో నిర్మించిన 24 వరుస ఇళ్లను కూల్చివేశారు. ప్రభుత్వ సర్వే నంబర్ విస్తరించి ఉన్న 12 సర్వే నంబర్ భూమి పక్కనే ఉన్న సర్వే నంబర్ 6లోని పట్టా భూమిలో బిల్డర్లు ఇళ్లను నిర్మించారు. సర్వేలో ప్రభుత్వ భూమి కబ్జా వ్యవహారం తేలడంతో హైడ్రా కూల్చివేతలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో కొన్ని కుటుంబాలు నివాసం ఉంటుండగా వారికి హైడ్రా అధికారులు, పోలీసులు నచ్చజెప్పి ఖాళీ చేయించారు. కూల్చివేతల సమయంలో కొందరు భవనాల యజమానులు, బిల్డర్లు అధికారులతో వాగ్వాదానికి దిగారు.

కుటుంబమంతా రోడ్డున పడ్డాం

మహబూబ్‌నగర్ నుంచి ఏడాది క్రితం ఇక్కడకు వచ్చాం. స్థలాన్ని అద్దెకు తీసుకొని రూ.45 లక్షల పెట్టుబడితో షెడ్డు నిర్మించి కేటరింగ్ ప్రారంభించాం. స్వయం ఉపాధి పొందుతూ 50 మందికి ఉపాధి కల్పిస్తున్నాం. ఇప్పుడు నా కుటుంబంతో సహా అందరం రోడ్డున పడ్డాం. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? కనీసం నోటీసులిచ్చినా ఎక్కువ మొత్తంలో నష్టపోకుండా బయటపడేవాళ్లం. ఇప్పుడు భారీగా నష్టం చవిచూడాల్సి వచ్చింది.

- గాండ్ల రమేశ్

ఆత్మహత్యే శరణ్యం



సొంతంగా వ్యాపారం చేసి నిలదొక్కుకోవాలని వడ్డీకి తెచ్చిన రూ.కోటితో యంత్రం తీసుకువచ్చి ఫ్లెక్సీ ప్రింటింగ్ ప్రారంభించాం. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న విషయం మాకు తెలియదు. హైడ్రా అకస్మాత్తుగా వచ్చి నిర్మాణాన్ని నేలమట్టం చేసింది. ప్రింటింగ్ యంత్రం, కంప్యూటర్లను బయటకు తెచ్చుకునే సమయం కూడా ఇవ్వలేదు. ఈ స్థాయిలో నష్టం చేస్తారా? మాకు ఆత్మహత్యే శరణ్యం.

- రవికుమార్

ప్రైవేటు సర్వే నంబర్లతో ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు

అక్రమ అనుమతుల్లో ఇదే అసలు రహస్యం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, శివారు మునిసిపాలిటీ.. ఇలా ప్రాంతమేదైనా ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టేవారిది ఒకే విధానం. నిర్మాణాలకు అనుమతులు పొందడంలో, కొనుగోలుదారులను మోసం చేయడంలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ప్రైవేట్ పట్టా భూముల సర్వే నంబర్లతో నిర్మాణాలకు అనుమతులు తీసుకుంటూ చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు, ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడుతున్నారు. ఆ అనుమతి పత్రాలను చూపించి.. అక్రమ నిర్మాణాలను అమ్మకానికి పెడుతున్నారు. సొంతింటి కోసం కలలుగనే మధ్యతరగతి ప్రజల ఆశలను సొమ్ము చేసుకుంటున్నారు. రూ.లక్షలు, కోట్లు దోచుకొని బయటపడుతున్నారు. జేబులు నింపుకొని నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిస్తున్న అధికారులూ దర్జాగా ఉంటున్నారు. జీవిత కాలపు కష్టార్జితం, బ్యాంకు రుణాలు, బంగారం తనఖా పెట్టి అప్పు తీసుకున్న కొనుగోలుదారులు మాత్రం రోడ్డున పడుతున్నారు. అమీన్‌పూర్ మునిసిపాలిటీలోని పటేల్‌గూడలో అదే జరిగింది. గతంలో నిజాంపేట ఎర్రకుంట చెరువులోనూ ఇతర సర్వే నంబర్లతో అనుమతులు తీసుకొని ఇలాగే భవనాలు నిర్మించారు. హైడ్రా పరిశీలనలో ఆ నిర్మాణాలు చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నట్లు తేలడంతో నేలమట్టం చేశారు.

అధికారుల పాత్రపై ఆరా..

అమీన్‌పూర్ మునిసిపాలిటీ పరిధిలోని పటేల్‌గూడలో సర్వే నంబర్ 164లో 27 ఇళ్లను నిర్మించారు. వాస్తవంగా అది ప్రభుత్వ భూమి. కానీ, ప్రైవేట్ పట్టా భూముల సర్వే నంబర్ల పేరిట అనుమతులు తీసుకొని.. సర్కారు స్థలంలో నిర్మాణాలు చేపట్టారు. బిల్డర్లకు మునిసిపల్, ఇతర విభాగాల అధికారులు సహకరించారన్న ఆరోపణలున్నాయి. నిబంధనల ప్రకారం.. మునిసిపాలిటీలోని ప్రణాళికా విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, రెవెన్యూ విభాగం ఇచ్చిన యాక్సెస్ ఆధారంగా స్థలం ఎక్కడుందో ఆన్‌లైన్‌లో కూడా చూడాల్సి ఉంటుంది. పక్కన ప్రభుత్వ భూములున్నాయా? లేదా? అన్నదీ తెలుసుకోవాలి. కొన్ని పరిస్థితుల్లో రెవెన్యూ విభాగం నుంచి నిరభ్యంతర పత్రమూ సమర్పించేలా నిర్మాణదారులకు సూచించాలి. ఇక్కడ మాత్రం మునిసిపల్ అధికారులు గుడ్డిగా అనుమతులిచ్చారనే ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నేతలు అధికార అండతో అనుమతులు పొందినట్లు విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో అనుమతులు ఇచ్చిన తీరు, దరఖాస్తుతోపాటు నిర్మాణదారులు సమర్పించిన పత్రాలు, ఇతరత్రా వివరాలనూ హైడ్రా అధికారులు పరిశీలించనున్నారు. దాని ఆధారంగా అధికారుల పొరపాటు ఉందని తేలితే.. వారిపై క్రిమినల్ కేసుల నమోదుకు ఫిర్యాదు చేయనున్నారు. నిర్మాణదారులకు గతంలో రెవెన్యూ విభాగం నోటీసులు ఇవ్వగా.. మునిసిపల్ అధికారులు అనుమతులు రద్దు చేశారనే ప్రచారం కూడా జరుగుతోంది. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది.

నేడు, రేపు భారీ వర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): తెలంగాణలో సోమ, మంగళవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఒకటి రెండు మినహా అన్ని జిల్లాల్లో వానలు పడే అవకాశముందని పేర్కొంది. ఈ నెల 26 వరకు రాష్ట్రానికి యెల్లో అలెర్ట్ జారీ చేసింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. మిగిలిన అన్ని జిల్లాల్లోనూ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఒక ఆవర్తనం, మయన్మార్ దక్షిణ తీరం, దాని పరిసర ప్రాంతాల్లో రెండో ఆవర్తనం కొనసాగుతోందని వెల్లడించింది. ఈ రెండు ఆవర్తనాల ప్రభావం వల్ల సోమవారం పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో రాగల 4 రోజుల పాటు రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉంది.

కొత్తూర్‌లో భారీ వర్షం..



కొత్తూర్ అండర్‌పాస్‌లో నీట మునిగిన కారు

రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో కొత్తూర్ సమీపంలోని అండర్‌పాస్ నీటితో నిండిపోయింది. హైదరాబాద్ నుంచి కొత్తూర్ వైపు వస్తున్న ఓ కారు ఆ నీటిలో చిక్కుకుపోయింది. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని కారును బయటకు తీశారు. నీరు నిలిచిపోవడంతో అండర్‌పాస్ నుంచి రాకపోకలను నిలిపివేశారు.

పిడుగుపాటుకు ఇద్దరు బలి

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఆదివారం పిడుగుపాటుకు ఇద్దరు మహిళలు చనిపోయారు. వనపర్తి జిల్లా వనపర్తి మండలం చిమనగుంటపల్లికి చెందిన గౌనికాడి గొల్ల పద్మమ్మ(35), నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం మమ్మాయిపల్లికి చెందిన నక్క నీలమ్మ(38) పశువులను మేపేందుకు వెళ్లి.. పిడుగుపాటుతో చనిపోయారు.

మనీ ల్యాండరింగ్ కేసు అంటూ బెదిరింపు

- రూ. 1.45 కోట్లు లూటీ.. సైబర్ నేరస్థుడి అరెస్టు

కోల్‌సిటీ, సెప్టెంబరు 22: "మేము ముంబై పోలీసులం. మీ పేరు మనీ ల్యాండరింగ్ కేసులో ఉంది. మీరు ఈ కేసు నుంచి బయటపడాలంటే మేము చెప్పినంత డబ్బును చెప్పిన అకౌంట్‌కు పంపాలి" అని బెదిరిస్తూ.. డబ్బులు కాజేస్తున్న నిందితుడిని గోదావరిఖని సైబర్ క్రైమ్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. నిందితుడు మంచిర్యాల జిల్లాలోని ఒక ప్రైవేట్ పాఠశాల నిర్వాహకుడికి ఫోన్ చేసి బెదిరించగా అతడు భయపడి నిందితుడి అకౌంట్‌కు విడతల వారీగా రూ.1.45 కోట్లు పంపాడు. తర్వాత తాను మోసపోయానని గ్రహించి 1930 నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. గోదావరిఖని సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుడు మహారాష్ట్రలోని వాసిం జిల్లా దేవపేటకు చెందిన సంతోష్ శ్రీ కృష్ణగా గుర్తించి.. అక్కడకు వెళ్లి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడినిని విచారించగా తాను అసలు నేరస్థుడిని కాదని, తన అకౌంట్‌ను వేరే వ్యక్తి ఆపరేట్ చేస్తున్నాడని, తనకు కమిషన్ మాత్రమే ఇచ్చేవాడని తెలిపాడు. అతను తన బ్యాంక్ అకౌంట్‌ను సైబర్ నేరాలకు వాడుకున్నాడని వెల్లడించాడు. ఈ అకౌంట్‌తో పలు రాష్ట్రాల్లో 18 నేరాలకు పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. ఈ నేరంలో ఎంత మంది భాగస్వామ్యం ఉంది, దీని వెనుక ఎవరున్నారు అనే కోణంతో పాటు ఈ కేసు తాలూకా లింకులు విదేశాలలో ఉన్నట్టు తెలుసుకుని ఆ దిశగా కూడా పోలీసులు విచారణ చేపట్టారు.

ప్రైవేటు బస్సులో మహిళపై అత్యాచారం

- ప్రయాణికురాలిపై బస్సు హెల్పర్ అఘాయిత్యం

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో ప్రయాణికురాలిపై లైంగిక దాడికి పాల్పడిన ఆ బస్సు హెల్పర్‌ను కూకట్‌పల్లి పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. చౌటుప్పల్ పీఎస్ నుంచి 'జీరో ఎఫ్ఐఆర్' రావడంతో దర్యాప్తు చేపట్టి నిందితుడిని పట్టుకున్నారు. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు ఈ కేసు వివరాలు తెలిపారు. ఏపీకి చెందిన ఓ మహిళ(28) హైదరాబాద్‌లోని ఒకరింట్లో కేర్ టేకర్‌గా పనిచేస్తోంది. సొంతూరు వెళ్లేందుకు ఈ నెల 18న రాత్రి 10.40 గంటలకు కూకట్‌పల్లి వై జంక్షన్‌లో ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఎక్కింది. ఆమె అప్పర్ బెర్త్ బుక్ చేసుకోగా.. ఆమెపై కన్నేసిన బస్సు హెల్పర్ మాయమాటలు చెప్పి వెనకాల లోయర్ బెర్త్ ఖాళీగా ఉందని అక్కడ నిద్రపోయేలా చేశాడు. ఆ తర్వాత వాటర్ బాటిల్ ఇచ్చేందుకు వెళ్లి ఆమెతో మాటలు కలిపాడు. కొద్దిసేపటి తర్వాత ఆమె నోరు నొక్కి, కర్టన్లు మూసి అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం ఎవరికైనా చెబితే పోయేది నీ పరువేనంటూ ఆమెను భయపెట్టాడు. దాంతో ఆమె మౌనంగా ఉండిపోయింది. తర్వాత మరోసారి ఆమెపై లైంగిక దాడి చేశాడు. మరుసటి రోజు ఆమె ఇంటికెళ్లిన తర్వాత జరిగిన విషయాన్ని తన యజమానికి చెప్పింది. దాంతో వెంటనే ఆమెను హైదరాబాద్‌కు పిలిపించాడు. బస్సు బయలుదేరిన సుమారు 2 గంటల తర్వాత ఘటన జరగడంతో అది చౌటుప్పల్ పరిధి కావచ్చని భావించి.. అక్కడి పీఎస్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన చౌటుప్పల్ పోలీసులు కేసును కూకట్‌పల్లి పీఎస్‌కు బదిలీ చేశారు.

పాలమూరు జిల్లాలో బాలికపై అత్యాచారం


దేవరకద్ర, సెప్టెంబరు 22: కాలకృత్యాలు తీర్చుకునేందుకు రాత్రి వేళ బయటకు వచ్చిన బాలికపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. దేవరకద్ర మండలంలోని ఓ గ్రామానికి చెందిన పదిహేనేళ్ల బాలిక తొమ్మిదో తరగతి చదువుతోంది. శనివారం రాత్రి 11 గంటల సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వచ్చింది. అప్పటికే అక్కడ ఆటోలో మాటు వేసి ఉన్న అదే గ్రామానికి చెందిన యువకుడు.. ఆమె నోటికి చున్నీ చుట్టి ఆటోలోకి లాక్కెళ్లి అత్యాచారం చేశాడు. ఆ తర్వాత బాలిక ఏడుస్తూ ఇంటికెళ్లి కుటుంబసభ్యులకు జరిగిన ఘాతుకాన్ని చెప్పింది. బాలిక కుటుంబసభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


భారత దేశంలో పుస్తకమే కవిని రాస్తుంది!

"తెలుగునకున్న వ్యాకరణ దీపము చిన్నది" అని తిరుపతి వేంకట కవులు అన్నారు కానీ, తెలుగు ఒక్కదానికే కాదు, మొత్తంగా భారతదేశానికే దీపాల 'కొరత' బాగా ఉన్నట్టుంది. అందులో పెద్ద కొరత చరిత్రదీపం. మనకు చరిత్రలు రాసుకోలేదని, చారిత్రక దృష్టి లేదని, ఇంగ్లీషువాడు వచ్చే దాకా మన గురించి మనం తెలుసుకోనేలేదని బాధపడడం మన ఆధునిక ఆత్మవిమర్శలో ఒక అనివార్య అధ్యాయం. సాధారణ చరిత్ర రంగంలోనే అంతటి చీకటి ఉందనుకుని బాధపడితే, ఇక సాహిత్యచరిత్ర సంగతి చెప్ప నక్కరలేదు. కావలి వేంకట రామస్వామి, గురజాడ శ్రీరామ మూర్తి, కందుకూరి వీరేశలింగం కంటె ముందు మన కవుల గురించి 'కథలు' చెప్పుకోవడమే తప్ప, చరిత్రలే లేవు. పైన చెప్పిన ముగ్గురూ కూడా కవులజీవన రేఖలూ కవిజీవితాలూ కవుల చరిత్రలూ తప్ప సాహిత్య 'చరిత్ర' రాసినవారు కాదు. బ్రిటిష్ వారు రాకముందు "మనకు చరిత్ర అంటే బయోగ్రఫీయే" అంటారు వెల్చేరు నారాయణరావు. సాహిత్యచరిత్రరచన గురించి ఈ మధ్య ఆయనను (నేను, కరుసాల వెంకటేశ్ కలిసి) ఇంటర్వ్యూ చేసినపుడు వెల్చేరు కీలకమయిన, మౌలికమయిన కొన్ని వ్యాఖ్యలు చేశారు. వ్యక్తి కథ మాత్రమే అయిన చరిత్ర భావనను దేశానికి, ప్రాంతానికి, రంగానికి కూడా అన్వయించి విస్తరించారని ఆయన అన్నారు. "దేని చరిత్రను రాయాలో ముందు దాన్ని తెలుసుకోవాలి. ఏ వస్తువు చరిత్ర రాస్తారో ఆ వస్తువును తయారుచేయాలి." అని ఆయన అన్న మాట ఎంతో లోతైనది. బహుశా, ఆయన ఉద్దేశ్యంలో, వస్తువు అంటే, కథావస్తువు లాంటి చరిత్రవస్తువు. దేని చరిత్ర అయినా రాయడానికి ముందు దాన్ని 'భావించాలి'. భావించడం అంటే, కల్పించడం, ఊహించడం, పరికల్పన చేయడం, ఇమాజిన్ చేయడం. ఇప్పుడు మనం చూస్తున్న సాహిత్యచరిత్రల వంటివి రాయాలన్న ఊహ, భావన, 19వ శతాబ్దానికి ముందు రాలేదు. పరికల్పనలు అకాలంగా, కాలాతీతంగా ఉండవు.

తెలుగు సాహిత్యచరిత్రల పరిణామం, రచనాపద్ధతి గురించి తెలుసుకోవాలన్న నా కొత్త ఆసక్తి తగినట్టుగా, ఎంతో అనువుగా ఈ మధ్య తారసపడినవి వెల్చేరు నారాయణరావు రెండు కొత్త పుస్తకాలు. "తెలుగు సాహిత్యం-కొత్తకోణాలు", "సంస్కృతి, భాష, చరిత్ర". ఈ పుస్తకాలను "ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా)" ప్రచురించింది. ఇందులో మొదటి పుస్తకంలో కేవలం నారాయణరావు ఒక్కరే రాసినవి, రెండోదానిలో ఆయన డేవిడ్ షుల్మాన్, సంజయ్ సుబ్రహ్మణ్యం, పరుచూరి శ్రీనివాస్, పప్పు నాగరాజుల భాగస్వామ్యంతో రాసినవి వ్యాసాలు ఉన్నాయి. వివిధ సాహిత్య సందర్భాలలో రాసిన ఈ వ్యాసాలలో అన్నిటిలో కాదు కానీ, ఎక్కువ వాటిలో సాహిత్యచరిత్ర మీద, సాహిత్య చరిత్ర గురించి చేసిన వ్యాఖ్యలు, ప్రతిపాదనలు ఉన్నాయి. నిజానికి "తెలుగులో కవితా విప్లవాల స్వరూపం" దగ్గర నుంచి వెల్చేరు చేస్తూ వచ్చిన సాహిత్య ప్రయత్నం అంతా ఏదో ఒక రకంగా "ప్రధాన స్రవంతి సాహిత్యచరిత్ర"ను విమర్శనాత్మకంగా చూస్తూ, ఒక ప్రత్యామ్నాయ చరిత్రను నిర్మించడమే.

"భారతీయులకు చారిత్రక స్పృహ లేదనీ, మంచికో, చెడుకో వలస పాలకుల వల్ల చరిత్ర రచన మనకు అబ్బిన కొత్త లక్షణమనీ





రచయిత పుస్తకం రాస్తాడు, పాఠకుడు చదువుతాడు, ఈ పుస్తకానుభవ క్రమమే ఆధునికులు చాలా మంది ఆలోచనలో ఉందని, కానీ భారతదేశంలో పుస్తకమే కవిని రచిస్తుందని వెల్చేరు సూత్రీకరిస్తారు.

వున్న అపోహను తొలగించడమే" తమ ఉద్దేశ్యమని వెల్చేరు, ఆయన సహరచయితలు చెబుతారు. అట్లాగని, వలసపాలకుల చరిత్రదృక్పథం, రచనాపద్ధతి భారతీయులకు ఎప్పటి నుంచో తెలుసుననే చెప్పే బాపతు ధోరణి కాదు ఇది. వీరి ప్రకారం, పాశ్చాత్య చరిత్ర రచన ప్రమాణాలతో మనకు ఉన్న మౌలికమైన వ్యత్యాసాలను గుర్తించగలిగితే, దక్షిణ భారత చారిత్రక రచనలను గుర్తించగలం. దక్షిణ భారతంలో చరిత్ర ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన సాహిత్య ప్రక్రియ కాదు. దేశకాల పరిస్థితులకు అనుగుణంగా ఆ కాలంలో ఏ సాహిత్య ప్రక్రియ ప్రాచుర్యంలో ఉంటే ఆ ప్రక్రియలోనే చరిత్ర రచనలు కూడా సాగాయి.

మరి సాహిత్యచరిత్ర? మనం అనుకుంటున్న సాహిత్య చరిత్ర కూడా "వలసపాలన ద్వారా వచ్చిన పాశ్చాత్య విద్య". ఆ కోవలో కవులు, రచయితల స్థలకాలాలు, వారి పోషకుల వివరాలు తెలుసుకోవడానికి పండితులు పడిన కష్టం మీద వెల్చేరుకు గౌరవం లేకపోలేదు. కానీ, సాహిత్యచరిత్ర అంటే అది కాదు. "ఏ పుస్తకం ముందు వచ్చిందో, ఏ పుస్తకం తరువాత వచ్చిందో చెప్పుకుంటూ కూర్చోవడం సాహిత్యచరిత్ర కాదు. అలాంటి చరిత్ర మనకి లేకపోయినందుకు మనం విచారించ క్కర్లేదు" అంటారాయన. కవి, గ్రంథం, పాఠకులు, ఈ మూడు అంశాల మధ్య సంబంధాన్ని తెలుసుకోవడం సాహిత్యచరిత్రకు ముఖ్యం. రచయిత పుస్తకం రాస్తాడు, పాఠకుడు చదువుతాడు, ఈ పుస్తకానుభవ క్రమమే ఆధునికులు చాలా మంది ఆలోచనలో ఉందని, కానీ భారతదేశంలో పుస్తకమే కవిని రచిస్తుందని వెల్చేరు సూత్రీకరిస్తారు. పుస్తక స్వభావం బట్టి, కవులను ఊహించుకోవడం మన పద్ధతి. వాస్తవం ఉండవచ్చు, లేకపోవచ్చు, కానీ, కవుల కథలన్నీ వారి రచనల్లో కనిపించే వ్యక్తిత్వానికి అనుగుణంగా కల్పితమవుతాయి. కవులను, ఆర్షకవులు, కావ్యకవులు, భక్తికవులు, చాటుకవులు అని నాలుగురకాలుగా వర్గీకరించి, వారి పుస్తకాల ఆధారంగా పాఠకుల ఊహల్లో కవి ఎట్లా రూపొందుతాడో వివరిస్తారు.

బ్రిటిష్ వలసపాలన భారతీయ భావప్రపంచం మీద వేసిన మార్పు మీద విమర్శలో భాగంగా వెల్చేరు సాహిత్యచరిత్ర ప్రతిపాదనలు చేస్తారు. వలసపాలన తెచ్చిన ఆధునికత వల్ల వివిధ భావరంగాలలో ప్రధాన కథనాలు రూపొందాయి. ఆధునిక చరిత్ర వలసవాద ఆధునికత ఫలితమే కాబట్టి, భారతీయులు తమ గతాన్ని చూసే పద్ధతి అదే దారిలో తయారయింది. అయితే, వలసపాలనకు ముందే ఆధునికత మన దగ్గర రూపొందడం మొదలయిందన్న ప్రతిపాదనను వెల్చేరు బలపరుస్తారు. వలసవాద ఆధునికత అలవరచిన చూపును విదిలించుకుని, వలస పూర్వ భారతదేశాన్ని వలసపూర్వ దృష్టితోనే చూడడానికి ఉన్న అవకాశాలను చర్చిస్తారు. మన పూర్వ సాహిత్యాన్ని, నాటి దృష్టితోనే అర్థం చేసుకోవాలని అంటారు. కొన్ని బాహ్య పరిస్థితులను ప్రభావాలను పరిగణనలోకి తీసుకుంటూనే, సాహిత్యంలో అంతర్గత సాక్ష్యాల ద్వారా, వాచక పరీక్ష ద్వారా కొత్త వ్యాఖ్యానాలను అందిస్తారు. 15, 16 శతాబ్దాల కాలం నుంచి, తెలుగు ప్రాంతాలలో వచ్చిన రాజకీయాలలో, పాలకశ్రేణులలో వచ్చిన మార్పులు, కొత్త జీవనవిధానాన్ని తెచ్చాయని, అది సాహిత్యంలో ప్రతిఫలించిందని ఆయన ప్రతిపాదించారు. మునుపు అధికారానికి, సంపదకు ఎడంగా ఉన్న 'ఎడమచేతి' కులాలు ఆ కాలంలో ప్రాబల్యం సంపాదించుకున్నాయని, అప్పటి నుంచే మనదైన ఒక ఆధునికత రూపొందుతూ వస్తోందని ఆయన చెబుతారు. అందులో కరణాలు ముఖ్య పాత్ర నిర్వహించారని, ఆధునిక తెలుగుకు వారి లేఖనంలోనే పునాదులున్నాయని ఆయన అంటారు. ఆయన దృష్టిలో, ఆస్థానాల నుంచి స్వేచ్ఛా ప్రపంచంలోకి వచ్చిన పద్యమే చాటువు, అది తక్కువ రకం సాహిత్యం కాదు. గురజాడ అప్పారావులో కనిపించిన ఆధునికత తాను చెబుతున్న దేశీయ ఆధునికత కొనసాగింపేనని, కందుకూరి వీరేశలింగం లాగా గురజాడ వలసవాద ఆధునికుడు కాదని వెల్చేరు వాదన. 'కన్యాశుల్కం' నాటకంలో ఆయన దేశీయ ఆధునిత వైపు నుంచి వలసవాద ఆధునికతను హేళన చేశాడని లేదా విమర్శించారని ఆయన ఉద్దేశ్యం. క్షీణ యుగంగా పరిగణించే నాయకరాజుల కాలాన్ని సాహిత్యం వైవిధ్యంతో వికసించిన కాలంగా ఆయన అంటారు.



తెలుగుకు సేవ చేశాడని చెప్పే బ్రౌన్ గ్రంథ పరిష్కరణల పేరుతో అనేక ప్రాచీన గ్రంథాలను సవరించాడని, ఇక్కడి పుస్తక సంస్కృతి బ్రౌన్‌కు అర్థం కాలేదని వెల్చేరు అంటారు. అచ్చుయంత్రం వచ్చే దాకా, పుస్తకానికి తప్పనిసరిగా ఒకే కర్త ఉండవలసిన అవసరం లేదని, మౌఖికంగా మాత్రమే ఉనికిలో ఉండే సాహిత్యానికి స్థిర రూపం ఉండదని, నిరంతరం రూపొందుతూనే ఉంటుందని ఆయన చెబుతారు. సుమతిశతకం బ్రౌన్ ప్రతితో, వావిళ్ల వారి ప్రతిని పోలుస్తూ వెల్చేరు, పరిష్కరణలో భాషా సాంస్కృతిక సవరణలు ఎట్లా ఉంటాయో, ఎక్కువ మంది నోళ్లలో ప్రాచుర్యం పొందే పద్యం ఎట్లా సరళం అవుతుందో ఉదాహరణలతో సహా వెల్చేరు వివరించారు. నీతిశతకాలను వాటిలో చెబుతున్న సాంఘిక నీతిని చర్చించి, దేశకాలాదులను అన్వయించిన తీరు ఆసక్తికరంగా ఉంది. గిడుగు రామమూర్తి, చిన్నయసూరి, కావలి రామస్వామి, బ్రౌన్ వీళ్లందరి గురించీ మనకు తెలిసిందాన్ని వదిలించుకుని, కొత్తగా అర్థం చేసుకోవడానికి ఈ వ్యాసాలు ప్రేరేపిస్తాయి. ఆధునిక కవుల గురించి కూడా ఈ పుస్తకాలలో వ్యాసాలు ఉన్నాయి. ఎవరూ చూడని కోణాలను వెల్చేరు చూపిస్తారు.

ప్రస్తుతం సాహిత్యచరిత్రల మీద వస్తున్న విస్మరణ విమర్శలు కూడా వెల్చేరు చర్చించకుండా పోలేదు. ప్రాబల్య శ్రేణుల నుంచి వచ్చిన రచనలతోనే సాహిత్య చరిత్రలు ఏర్పడుతున్నాయని ఆయన అంగీకరిస్తారు. "సాహిత్యచరిత్ర కారులందరూ ఉన్న పుస్తకాల కథలు రాశారు.. కానీ, అణచివేయబడ్డ వర్గాలకు ఏ రకమైన సాహిత్యం వుంది, ఆ సాహిత్యం ఎన్ని రూపాలుగా, ఏయే కాలాలలో అణచివేయబడింది అనే విషయం బయటకు వచ్చే పద్ధతిలో సాహిత్యపు ప్రశ్న ఎవరూ వేసుకోలేదు", ఈ మాట ఆయన 1990లో అన్నారు కానీ, ఆ తరువాత ఆ ప్రశ్న చాలా మంది వేసుకున్నారు. విషయం ఎంత బయటకు వచ్చిందనేది వేరే విషయం.

కాలక్రమానుగత పద్ధతిలో రాసిన వ్యాసాలు కావు కాబట్టి, సాహిత్యచరిత్రలు చదివిన అలవాటున్నవారికి, ఈ పుస్తకాలు చదివాక, సమాధానపడలేని చాలా ప్రశ్నలు మిగిలి ఉంటాయి. వెల్చేరు ఆలోచనలను ఎంత వరకు స్వీకరించాలో తేల్చుకోలేనంతగా, ఆయన ప్రత్యేకమైన పరిశీలనాదృష్టి పాఠకులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ఆ దృష్టిని అలవరచుకోవాలన్న కుతూహలం కలుగుతుంది. కానీ, ఆ చూపు కేవలం అభిరుచి కాదు, ఎంతో అధ్యయనం, పరిశ్రమ కలగలసిన విద్య?

■ కె. శ్రీనివాస్

సోమవారం 23 సెప్టెంబరు 2024

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

'సబ్బని సాహిత్య వ్యాసములు'

సబ్బని లక్ష్మీనారాయణ రాసిన సాహిత్య వ్యాసాల పుస్తకం ఆవిష్కరణ సభ సెప్టెంబర్ 23 సా.5.30నిమిషాలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో కె.వి. రమణాచారి, బైస దేవదాస్, మామిడి హరికృష్ణ, ఏనుగు నరసింహారెడ్డి, దార్ల వెంకటేశ్వరరావు, సంకెనపల్లి నాగేంద్ర శర్మ తదితరులు పాల్గొంటారు.

మానస ఆర్ట్ థియేటర్స్

ఉడాలి నరసింహశాస్త్రి వైదుష్యం

'డా. ఉడాలి నరసింహశాస్త్రి వైదుష్యం' గ్రంథావిష్కరణ సభ సెప్టెంబర్ 29 ఉ.10.30నిమిషాలకు శ్రీరేబాల లక్ష్మీనరసారెడ్డి (జూ.) స్మారక భవనం, ట్రంక్ రోడ్, నెల్లూరులో జరుగుతుంది. సభలో ఉడాలి వెంకట నరసింహ రవి, విశపు బాలసుబ్రహ్మణ్యం, చింతలపాటి పూర్ణానంద శాస్త్రి, ఉడాలి మహాలక్ష్మి తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 99890 05369.

పొన్నాల రామసుబ్బారెడ్డి

'లోపలి వాన' కవితా సంపుటి

కుడికాల వంశీధర్ 'లోపలి వాన' కవితా సంపుటి ఆవిష్కరణ సభ సెప్టెంబర్ 29 ఉ.10గం.లకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో ఎన్. గోపి, సూర్యా ధనుంజయ్, ఎస్. రఘు, గిన్నారపు ఆది నారాయణ తదితరులు పాల్గొంటారు.

మద్దాళి రఘురాం

విమలా శాంతి కవితా పురస్కారం

విమలా శాంతి కవితా పురస్కారానికి 2024కి గాను 'అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి' కవితా సంపుటి రాసిన లేదాళ్ల రాజేశ్వరరావు ఎంపికయ్యారు. అక్టోబర్ 20న అనంతపురంలో జరిగే సభలో ఆయన పురస్కారంతో పాటు రూ.10వేల నగదు బహుమతిని స్వీకరిస్తారు.

శాంతి నారాయణ

సాంఘిక నవలల పోటీ

పిడపర్తి వెంకటరమణ శర్మ జ్ఞాపకార్థం కౌముది వెబ్ మాస పత్రిక నిర్వహిస్తున్న 2025 ఉగాది సాంఘిక నవలల పోటీలో మూడు ఉత్తమ నవలలకు ఒక్కొక్క నవలకూ రూ.25వేలు, మూడు సాధారణ నవలలకు ఒక్కొక్క నవలకు రూ.15వేలు బహుమతులు అందిస్తారు. నవలలను తెలుగులో టైప్ చేసి (యూనికోడ్ లేదా అనుఫాంట్స్) లేదా స్కాన్ చేసి ఈమెయిల్లో మాత్రమే పంపాలి. నిడివి, మరిన్ని వివరాల కోసం www.koumudi.net వెబ్‌సైట్ చూడవచ్చు. నవలలను డిసెంబర్ 31లోగా novels2025@koumudi.netకు ఈమెయిల్ చేయాలి. ఫలితాలు మార్చి 2025లో వెబ్‌సైటులో ప్రకటిస్తారు.

కిరణ్ ప్రభ

శిశువు చిత్రనిద్ర

సముచిత హింస అహింసేనా?
ధర్మ మీమాంస ఎప్పుడూ చేతిలోని జిగురు చర్మపు చేపే
fish out.. తప్పించుకుని నీటిలోకి అంతర్ధానమైపోవడం
ఆత్మ రక్షణే.. తా మించిన ధర్మం లేదు...
శిరోఖండనే గణరాజ్య సిద్ధాంతం
గుర్రపు డెక్కల ఎర్రని ధూళి, మహోగ్రారణ్యాలు
విస్ఫోటించే రక్తపు నదులు
చరిత్ర ఎప్పుడూ నెత్తుటితడిని అద్దుకుంటూ
లిఖించబడ్తూంటుంది
శత్రువును జయించి అంతఃపురకాంతలతోసహా
సకలసంపదలనూ గుంజుకుని అనుభవించడమే
'రాజధర్మ'మౌతున్న వేళ
నిర్వచనాలను మార్చుకుంటూ మార్చుకుంటూ
న్యాయం, ధర్మం, శాస్త్రం, ఆక్రందనలు... అన్నీ నిశ్శబ్దిస్తూ
ఆస్థానాల్లో మేధావులు తలలు వంచుకుని
సిగ్గుతో కుంచించుకుపోతున్నపుడు
కేవలం శారీరక మరణాలే కాదు
సౌప్తిక పర్వంలో శూన్యహత్యలు కూడా జరుగుతాయి
అన్నీ కరవాలదంష్ట్రలే.. హరోంహరహర

2
ఆదిమయుగంనాటి మనిషి
ఒక సారించిన ధనువు.. ఒకటే బాణం ఒకటే లక్ష్యం
జీవితం సరళ సమీకరణం
రణమో.. మరణమో
ట్రిగ్గర్‌పై వేలును
ఒక 'జి కోడ్' ఉగ్రావేశం శాసిస్తుంది..
లక్ష్యం మాత్రం విధ్వంసమే
అన్నీ ముఖాలపై నవ్వులను చిందే రాజకీయ పాచికలే
ఎప్పుడు ఎక్కడ ఆకాశాన్ని చించుకుని
మహాసముద్రాలు కురుస్తాయో తెలియదు
కన్నుతెరిచే రెప్పపాటులోనే
ద్వారక సముద్రగర్భంలోకి కూరుకుపోతుంది
గాంధారిశాపం యుగాంతంకోసం వ్యూహించబడ్డ
కృష్ణుని రిక్తాదేశం
ఒకరు ఇంకొకరై ప్రత్యయిస్తారు
ఎప్పుడు ఎవరికోసం ఎవరు
కాలుతున్న కాగితంపై రాయబడ్డ
అక్షరాయుధాలౌతారో తెలియదు
కాలం గర్జిస్తూ ప్రవహించే అనంతాకాశమేనని.. ఉవాచ

3
మనుషుల వేషభాషలుమారుతాయి
వ్యూహాలు పొటమరిస్తున్నపుడు
అనుభూతులూ ప్రత్యనుభూతులూ మారుతూ
విందుల్లో విషాన్ని తినిపిస్తాయి
రహస్యప్రపంచాలు నిరాకారంగానే రాజకీయాలను కప్పుకుని
నిన్నటి రణభూమిని ఇవ్వాళ్టి ఆరోవేలుగా మారుస్తాయి
అంతిమంగా
'ఒక్కడు చచ్చు... మరియొకడుచంపుననుమాట పొరపాటు
ఆ భ్రాంతి విడువు' గీతా ప్రవచనంతో
శాంతి పర్వంలో.. అనంత అశాంతి విస్తరిస్తూంటుంది
చివరికి come and go అంతే... అదే జీవితం

■ రామా చంద్రమౌళి
✆ 93901 09993







మూడు ప్రశ్నలు

■ సోలోమోన్ విజయ్ కుమార్

ఉనికి చాటే రాతలు నావి!



ఇటీవల తెచ్చిన మీ మొదటి నవల 'సన్ ఆఫ్ జోజప్ప' గురించి చెప్పండి? మొదటిసారి నవల రాసిన అనుభవం ఎలా వుంది?


నవలలోని 'పిల్లోడు' నా ఈడువాడు. ఇద్దరం ఒకే వీధివాళ్లం. మగపిల్లల్తో కలవకుండా ఆడపిల్లల్తో ఆడుతూ కనబడేవాడు. చిన్నతనం నుంచి కూడా పరధ్యానంగా, భయం భయంగా ఉండేవాడు. టీనేజీకి వచ్చాక అందరికీ వాడేంటో పూర్తిగా తెలిసింది. ఎవరూ వాడిని వాడిలాగా స్వీకరించలేదు. వాడి మానాన వాడ్ని బతకనివ్వనూ లేదు. రోజూ ముఖాన నవ్వడాలు, అవమానాలూ వాడ్ని మరింతగా ముడుచుకుపోయేలా చేశాయి. తన ఇరవయ్యో ఏట ఉరి వేసుకుని చనిపోయాడు. నేను ఈనాటికీ బాధపడి దుఃఖపడే నా ఊరి మనుషుల్లో వాడొకడు. ఆ బాధ, దుఃఖాలే 'సన్ ఆఫ్ జోజప్ప' నవలకు నేపథ్యం అయ్యాయి. అయితే నవలలో వాడు చనిపోయాడని నేను డైరెక్ట్‌గా చెప్పలేదు. వాడు ఎప్పుడు కన్నీరుపెడితే అప్పుడు వచ్చి చేతులు చాచి వాడ్ని చంకనెత్తుకొనే ఊహాలోకపు తండ్రి 'జోజప్ప' నవల ఆఖరులో చీకటి రాత్రి వీధి చివరన నిలుచుకొని చేతులు చాపుతాడు. వాకిట నిలుచుకొని చూసిన పిల్లోడు ఆయన కనపడిన ప్రతిసారిలాగానే (ఆయన చంకన ఎక్కేందుకు) అడుగు ముందుకు వేస్తాడు. అక్కడితో నవల ముగుస్తుంది. అలాగ వాడు 'శాశ్వతంగా జోజప్ప చంక నెక్కాడని' చెప్పకనే చెప్పాను. మరొక ముఖ్యమైన విషయం ఏమిటంటే వాడిని కొందరు పాఠకులు ట్రాన్స్ జెండర్‌గా పొరబడ్డారు. కాదు వాడు 'గే' అని అతికొద్దిమంది పాఠకులే గ్రహించగలిగారు. వాడు చనిపోయినప్పటికీ నవల "అ సమాప్తం" అన్నాను. ఎందుకంటే మీలోనో నాలోనో మన ఇళ్లల్లోని ఎవరోఒకరిలోనో 'పిల్లోడు' దాగి లేడని, ఉండబోడని కచ్చితంగా చెప్పగలమా? ఇక మొదటి నవల రాసిన అనుభవం గురించి అడిగారు కదా, "The only book that is worth writing is the one we don't have the courage or strength to write. The book that hurts us (we who are writing), that makes us tremble, redden, bleed" అన్నారు ప్రముఖ ఫ్రెంచ్ రచయిత్రి Helene Cixous. కత రాయడం ద్వారా రెండు మూడు పేజీల్లో అనుభవించే Trembling, Reddening, bleeding నవల రాయడం ద్వారా వంద పేజీల్లో అనుభవించినట్టయ్యింది.

హోమోసెక్సువల్ ఇతివృత్తంతో సాగే ఈ నవలలోని కథనం ప్రధాన పాత్ర అనుభవాలను ఉన్నదున్నట్టు నిస్సంకోచంగా చెబుతుంది. రాస్తున్నప్పుడు ఇతివృత్తాన్ని, భాషనీ పాఠకులు స్వీకరిస్తారా లేదా అనే ఆలోచనలు ఏమైనా కలిగేవా?

హోమోసెక్సువల్ అనే కాదు అది ఏదైనా కానీయండి ఉన్నది ఉన్నట్టు నిస్సంకోచంగా ఎందుకు చెప్పకూడదు? బతుక్కి ముసుగేసి, సోకాల్డ్ సాహిత్యానికీ ముసుగేసి మనం సాధించే ప్రయోజనం ఏముంటుంది? ముసుగేసింది సాహిత్యం ఎట్లా అవుతుంది? మోసం అవుతుంది కానీ! ఏదైనా ఆకాశం నుంచి ఊడిపడిన అద్భుతం ఉందనుకోండి, దాన్ని చెప్పడానికైనా ఉపయోగించాల్సింది మనం ఎరిగిన భాషనే కదా? ఆకాశం నుంచి పడింది కాబట్టి 'ఆకాశ భాష' అంటూ ప్రత్యేకంగా తయారు కావాలంటే కుదురుతుందా? ఒకవేళ తయారు చేసినా పొసగుతుందా? ఒకటి చెప్పగలను, నా రాతల్లో మేధావినో సంస్కారినో నీతి బోధకుడినో వెతకబూనడం వృథా ప్రయాస. ఎందుకంటే రాసే ప్రక్రియ ఏదైనా నోరులేనివాళ్లు చెప్పుకోలేనివి, నోరున్నవాళ్లు చెప్పేందుకు అసహ్యపడేవే విధిగా ఎంచుకుంటాను. నా రచనలకి కేంద్రం అటువంటి చీకటి లోకమే. అక్కడి భాషని, ఇతివృత్తాలని సోకాల్డ్ వెలుతురి ప్రపంచం తట్టుకోలేకపోవచ్చును. కానీ ఆ చీకటిలోకం ఎక్కడో లేదనీ, మీ మధ్యనే చాలాసార్లు మీ లోపలనే- కోరలు చాస్తూ ఉంటుందనే పచ్చి నిజాన్ని 'ముసుగుబుద్ధితో' మీరు అంగీకరించక అందుకు గింజుకుని నన్ను తప్పుపట్టడం ఏమి న్యాయం? పాఠకుల స్వీకారం గురించి అడిగారు కదా, వెలుగుచూడని జీవితాలను రాయడం ద్వారా వాటి ఉనికిని చాటాలి అనే ఉద్దేశం తప్ప మరొక యావ నాలో లేనప్పుడు 'తరువాత ఏమిటి రాయడం' అనే ఆలోచన ఉంటుంది కాని రాసి బైటకు వెళ్లిపోయిన రచనను పట్టుకొని వేలాడడం ఉండదు. దాని మీద మీరు దుమ్మెత్తిపోయండి గాక! దానికి విలువ అనేది ఉంటే మట్టిపొరల కింద ఎన్నాళ్లైనా నిక్షేపం లాగా నిలిచి ఉంటుంది కనుక 'రేపటివాడు' ఎవడో తవ్వి తీసి చదువుకుంటాడు. విలువ అనేదే లేదా? ఆ మట్టిలోనే చివికి మట్టైపోతుంది. ఇప్పటివరకూ ఏ రచయిత అయినా వాస్తవంలో అంతకుమించి మూట కట్టుకున్నది ఏమైనా ఉందా?

మీ మొదటి పుస్తకం 'మునికాంతపల్లి కత'ల్ని కొందరు కథలుగా చూడలేదు దీనిపై మీ స్పందన? మీ తర్వాతి రచన ఏమిటి, అది కూడా మొదటి రెండు పుస్తకాల్లాగే సువర్ణముఖి నది ఒడ్డునే జరుగుతుందా?

అవును 'మునికాంతపల్లి కత'ల్ని లంజ కతలు, లంజల భాష అన్నాడొక ప్రముఖ రచయిత. 'సన్ ఆఫ్ జోజప్ప' నవలని యాక్ థూ అన్నాడొక పెద్దమనిషి. పచ్చి బూతుల నవల చదివాను తల తిరిగిపోయింది అన్నది ఒక అమ్మ. ఎవరి నోరైనా వారి అవగాహనా స్థాయిని బట్టే మాట్లాడుతుంది. ఐరిష్ రచయిత Samuel Beckett "ఎప్పుడైనా ప్రయత్నించావా? ప్రయత్నించి విఫలమయ్యావా? పర్లేదు, మళ్లీ ప్రయత్నించి మళ్లీ విఫలమవ్వు. మరింత బాగా విఫలమవ్వు (Fail Better)" అన్నాడు. నా వరకూ రచయితగా పటం కట్టించి పెట్టుకోదగిన మాటలవి. నా రాతలు కూడా అలాంటివే అని చెబుతాను. ఒకదానికంటే మరొకటి మరింత బాగా విఫలమవుతూ ఎటువంటి సాహిత్యపు రీతి రివాజుల్ని పాటించవు నా రాతలు. అవసరాన్ని బట్టి 'ఎంత చెత్తగానైనా' విషయాన్ని చెప్పడమే ముఖ్యంగా భావిస్తాయి కానీ నా రాతల్లోని అట్టడుగు బతుకులు సాహిత్యపు కొలతల్ని, ప్రమాణాలని, భాషా కౌశలాన్ని, వాక్య నిర్మాణాన్ని, ఘనమైన విశేషణాలనీ, సోకాల్డ్ కీర్తి కిరీటాలనీ నమ్మవు, అసలు లెక్కే చేయవు. కాబట్టి మేధావులు నా రాతల్ని దూరం పెట్టడంలో ఆశ్చర్యం లేదు. వాళ్లు దూరం పెట్టారు కాబట్టే "నాకు నేను మిగిలాను". అయితే చదువుకున్న యువత నా రాతల్ని గుండెలకు హత్తుకుంటోంది. అట్టడుగు బతుకుల దైన్యాన్ని, యాసల విలువని ఎరిగిన పెద్దలు కొందరు మనసారా ప్రోత్సహిస్తున్నారు. యూనివర్సిటీ విద్యార్థులు తమ పుస్తకాల అరల్లో ఆంగ్ల సాహిత్యంతో పాటూ నా రెండు పుస్తకాలను సంబరంగా చేర్చుకున్నారు. వాళ్లందరూ 'గే'లు కాకపోయినా 'సన్ ఆఫ్ జోజప్ప' గురించి ఆప్యాయంగా తడిగా ఎంతోసేపు మాట్లాడారు. ఇలా ద్వేషంతో పాటుగా ప్రేమని కూడా అధికంగా సంపాదించుకుంటోన్న 'Fail better' రాతలు నావి. ఇక నా తర్వాత రచన గురించి అడిగారు- కుటుంబసభ్యుల వల్లనే వ్యభిచారంలోకి దించబడిన మైనర్ అమ్మాయి, మొగుడు వదిలేస్తే దిక్కులేక ముష్టెత్తేందుకు తన ఇద్దరు చిన్నపిల్లల్ని రోజూ బస్టాండుకు పంపుకున్న తల్లి, మతపిచ్చితో కాపురాన్ని నరకం చేసుకున్న ఇల్లాలు... ఇలా రాస్తే మా ఊరివాళ్ల కతలే నవలికలు కాగలవు. 'ప్యార్థనలు' పేరిట నేను రాస్తున్న క్రైస్తవ జీవనానికి సంబంధించిన కవితలు సగంలో ఉన్నాయి. అవును ఇవన్నీ మొగిలేరు (సువర్ణముఖి నదికి అసలు పేరు) ఒడ్డుకు చెందిన బతుకు కతలు. వీటిలో ఏది తర్వాతి రచనగా వస్తుందో కానీ చివరగా ఒక మాట చెబుతాను, మీ రెండవ ప్రశ్నకు జవాబులో 'ఉనికి చాటాలి అనే ఉద్దేశం నాది' అన్నాను. అదే నేను నా రాతల ద్వారా చేస్తోంది. ఉనికిని తెలియజేయాలనే తపనని నాగరికతకు పై మెట్టు అన్నారు చరిత్రకారులు. గుహ గోడలపైన వేలఏళ్లకి ముందరి చేతి ముద్రలు, జంతువుల్ని వేటాడే బొమ్మలు అందుకు ఉదాహరణలు. అలాగ, "దిగువ పంట నాడు" (తిరుపతి జిల్లా పరిధిలో నేను పుట్టి పెరిగిన నాయుడుపేట మండలంలోని మొగిలేటి ఒడ్డున చిగురుపాడు గ్రామం దాని చుట్టుపక్కల మండలాలు) బతుకుల ఉనికిని మా యాసలోని పదసంపదతో కతలుగా చెప్పడమే నా 'విఫల' రాతల లక్ష్యం. రూట్స్ ద్వారా అలెక్స్ హేలీ, చెదిరిన సమాజం ద్వారా చినువా అచబే చేసింది అక్షరాలా అదే. ■



సృజనకారుల్లో విధ్వంస వాంఛ ఎందుకు?

"ఇంకెన్ని రాసినా నేను డార్కర్ సైడ్ అఫ్ లైఫ్ గురించే రాస్తాను.... నేను చచ్చిపోయిం తర్వాత ఏమవుతానన్నది అస్తిత్వవాదం ప్రకారం నాకు సంబంధం లేదు. నా రచనలన్నీ నేను బతికుండగానే తగలబెట్టి ఎవడన్నా దాని మీద ఒంటేలుకు పోయినా కూడా నాకేం ప్రాబ్లమ్ లేదు. I wanted to speak out my inner self" - కొద్దిరోజుల క్రితం చనిపోయిన రచయిత కాశీభట్ల వేణుగోపాల్ గురించి మెహెర్ రాసిన వ్యాసం, 'ముసుగుల్ని సహించని అక్షరం' (ఆంధ్రజ్యోతి, 26 ఆగష్టు 2024)లో పేర్కొన్న కాశీభట్ల మాటలు ఇవి. వేణుగోపాల్ మాటల్లో కనిపించేంత అసహనం అసాధారణంగా అనిపించవచ్చేమో గానీ, మైకెలాంజిలో నుంచి, కాఫ్కా, జాయిస్, సిల్వియా ప్లాత్.. ఇంకా ఈ మధ్య మరణించిన జయంత మహాపాత్ర వరకూ ఎందరో సృజనకారులను పరిశీలించినప్పుడు- వారు కూడా తమ సృష్టిని తామే ధ్వంసం చేసిన లేదా మరణానంతరం ధ్వంసం చేయమని ఆదేశించినవారే. ఇంతకూ సృష్టికర్తలు తమ సృజనల్ని ఎందుకు ధ్వంసం చేయాలనుకుంటారు? సృష్టించే, విధ్వంసం చేసే ప్రక్రియలకు అవినాభావ సంబంధం ఉన్నదా?

ఒకప్పుడు సృజనకారులు తమను తాము దేవుళ్లుగానో, దైవశక్తి కలవారి గానో భావించే వారు. అందువల్ల సృష్టించడం లేదా సృష్టికి ప్రతిసృష్టి చేయడం తమకు మాత్రమే వీలవుతుందని భావించేవారు. కొంతమంది ఇంకాస్త ముందుకెళ్లి తమను తాము సృష్టి కారకులు గానే గాక, లయకారులుగా కూడా భావించి తమ సృజనలను ధ్వంసం చేసే అధికారం తమకే ఉందనుకున్నారేమో అనిపిస్తుంది. లేదా తమ సృజనలు తమ జీవితంతోనే, తమ మానసిక ప్రపంచంతోనే, ఇంకా తమ భౌతిక శరీరంతోనే ముడిపడినవనీ, తమ మరణానంతరం మరెవరికీ వాటితో సంబంధం లేదని భావించారా? తమ సృజనలను చాలామంది సృష్టికర్తలూ, రచయితలూ తమ సంతానంగా భావించినట్లు కూడా మనం గమనించవచ్చు.


కళాకారులు తమ సృష్టికి తాము సొంతదారులు గానూ, సృజనలను ఆస్తిగానూ భావించడం కాలక్రమంలో జరిగింది. పెట్టుబడిదారీ వ్యవస్థ దాన్ని పటిష్టం చేసింది. పర్యవసానంగా తమ సృజనలకు సంబంధించిన కాపీరైట్ హక్కులు ముందుగా తమకూ, తమ మరణానంతరం ఆ హక్కుల్ని వారు సంక్రమింప చేసిన వారికి రావటం జరిగింది.



సాహిత్య, కళా రంగాలలోని సృజనకారులు తమ సృజనలను ఎందుకు ధ్వంసం చేయాలనుకుంటారు అన్న ప్రశ్నతో మొదలెడదాం. కొన్నిసార్లు తాము చేసిన సృజనలపై తమకే కలిగిన అయిష్టత కావొచ్చు, సృజన చేసేటప్పుడే వాటిని చింపేసే ప్రవృత్తి చాలా మంది సృజనకారులలో గమనించవచ్చు. తాము చేస్తున్న సృజనలు తామనుకున్నంత గొప్పగా కుదరడం లేదని విసుగూ, కోపం కూడా దీనికి కారణమై ఉండవచ్చు. కొంతమంది తమ కొన్ని సృజనలను వద్దనుకున్న శిశువులుగా భావించి వాటిని ధ్వంసం చేయాలనుకోవచ్చు. ఐతే ప్రచురింపబడి, బహుళ ప్రాచుర్యం పొందిన తర్వాత కూడా వాటిని ధ్వంసం చేయాలనుకోవడం; ప్రచురణ కాని, ప్రకటింపబడని తమ రచనలను, సృజనలను తగలబెట్టమని తమ వారసులను ఆదేశించడం కూడా అక్కడక్కడా చూస్తున్నాం. తాము చేసిన రచనల చివరి డ్రాఫ్టులను అవి ప్రచురణ కావడానికి ముందు చూడలేకపోతామనే ఆలోచనే ఇందుకు కారణమేమో! లేదా తాము చేసిన రచనలకు మార్పులూ చేర్పులూ చేసి కాపీరైట్ హక్కుదారులు తమ మరణానంతరం ప్రచురిస్తారేమోననే అనుమానమేమో!

అయినా తమ రచనలపై, సృజనలపై వీళ్లకు ఎందుకంత వ్యామోహం? అసలు రచనలపై రచయితలకు యాజమాన్యపు హక్కులు ఎంతవరకు సమంజసం? ఏ రచనైనా, సృజన అయినా ఒక చోట, ఒక వ్యక్తిలో, ఒక వ్యక్తితో పుడుతుందా? ఒక రచయిత, సృజనకారుని మరణంతో అది అంతమొందుతుందా? రచయితలు, సృజనకారులు భాషలో, కళలో పుడతారు కదా? మరి భాషకు, కళకు పుట్టుక ఎప్పటిది, ఎవరితో జరిగింది? భాషకంటూ, కళకంటూ మరణం ఉంటుందా?

■ ఎమ్. శ్రీధర్



ఆశల పల్లకీలో..

- ఇందిరమ్మ ఇళ్లపై పది రోజుల్లో విధి విధానాలు
- ఆ వెంటనే దరఖాస్తుల పరిశీలన
- కొత్త దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు
- స్థలం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత
- లేనివారికి రెండో విడతలో స్థలంతో పాటు ఆర్థిక సాయం
- ఉమ్మడి వరంగల్ జిల్లాకు 42వేల ఇళ్లు మంజూరు
- ఎమ్మెల్యేల చేతిలోనే లబ్ధిదారుల ఎంపిక
- మహిళలపేరుపైనే ఇళ్లు
- వివరాల నమోదుకు ప్రత్యేక యాప్

సొంత ఇంటిపై ఫలించనున్న కలలు

హనుమకొండ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సంబంధించి పది రోజుల్లో విధానపరమైన విధి విధానాలు ప్రకటించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్న గూడు లేని నిరుపేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సొంతింటి కల నరవేరబోతున్నందుకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో సొంత స్థలం ఉన్నవారికి మొదట ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు ప్రభుత్వం ప్రకటించడంతో అటువంటి వారిలో సంతోషం మరింతగా వ్యక్తం అవుతోంది.

ఆరు గ్యారంటీల్లో భాగంగా..

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వనున్నట్టు ప్రకటించింది. అధికారంలోకి వచ్చాక ఆరుగ్యారంటీల్లో ఇందిరమ్మ ఇల్లు మినహా మిగతావాటన్నింటినీ అమలు చేసింది. ఇందిరమ్మ ఇళ్ల విషయంలోనే వెంటనే ఒక నిర్ణయానికి రాలేకపోయింది. 8 నెలలు అయినా ఒక స్పష్టమైన విధానాన్ని రూపొందించలేకపోయింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల విషయంలో చేసిన తప్పులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో పునరావృతం కాకుండద న్న కారణంతో ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. ప్రస్తుతం నిర్మాణమైన, అసంపూర్తిగా నిలిచిపోయిన డబుల్‌బెడ్ ఇళ్లను ఏం చేయాలనే విషయంలో ప్రభుత్వం ఏటూ తేల్చేకోలేకపో తోంది. అవి పంపిణీకి అనువుగా లేవన్న కారణంతో పాటు బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యేలు చాలా ఇళ్లను తమ కార్యకర్తలకే ఇచ్చినందువల్ల అవి ఇప్పుడు వివాదాస్పందంగా మారాయి. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మంజూరులన్నిటినీ రద్దు చేయాలనే ఆలోచనలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉంది. తేనెతుట్టెలాంటి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ప్రస్తుతం పక్కన పెట్టి తాజాగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపైనే ప్రధానంగా దృష్టిసారించాలని నిర్ణయించుకున్నది. ఇందులో భాగంగా రానున్న పదిరోజుల్లో విధివిధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించింది. మార్గదర్శకాలు జారీ అయిన తర్వాత గతంలో ప్రజాపాలన గ్రామ, పట్టణ సభల్లో ఆరుగ్యారంటీ లో భాగంగా స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి అందులో అర్హులైన వారికి మంజూరు ఇవ్వాలని యోచిస్తోంది.

42వేల ఇళ్లు మంజూరు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇళ్లు లేనివారి సంఖ్య లక్షల్లోనే ఉంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 12అసెంబ్లీ నియోజకవర్గాలు న్నాయి. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలకు మొత్తం 42వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానున్నాయి. వీటికి తోడు రిజర్వుడు కోటా కింద మరో 3వేల ఇళ్లను కూడా మంజూరు చేయనున్నారు. ఇవి సంబంధిత జిల్లా కలెక్టర్లు, ఇన్‌చార్జి మంత్రి ఆధీనంలో ఉంటాయి. అత్యవసరాన్ని బట్టి అర్హులైనవారికి వీటిని అప్పటికప్పుడు మంజూరు చేస్తారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులకు నిర్మాణ సమయంలో ఇచ్చే ఆర్థికసాయానికి రూ.2 వేల కోట్లకుపైగా నిధులు అవసరం కానున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఇళ్ల నిర్మాణానికి 6.50లక్షల దరఖాస్తులు రాగా, ఇంటి స్థలాలు లేని వారి నుంచి 8.33 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీరిలో అర్హులను ఎంపిక చేయడం ఇప్పుడు ప్రధాన సమస్య.

మహిళలపేరుపైనే..

మహిళల పేరుతో వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటారు. తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉండి అందులో దరఖాస్తుదారు పేరు ఉండాలి. దివ్యాంగులకు 5 శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీ మైనారిటీలకు 50 శాతం, జనరల్ కోటాలో 15 శాతం కేటాయిస్తారు. గతంలో ఇళ్లు మంజూరైనా, దళితబంధు పథకం పొందిన దరఖాస్తులను తిరస్కరిస్తారు. పాత, శిథిలావస్థలో ఇళ్లు ఉంటే సర్వేసమయంలో ఇంటి పన్ను రశీదు, విద్యుత్ బిల్లు చూపించాల్సి ఉంటుంది. సొంత స్థలం కనీసం ఒక గుంట భూమి పట్టా ఉండాలి. మంజూరుపత్రాలు అందిన తర్వాత ఇళ్ల నిర్మాణం ప్రారంభించవచ్చు. వివిధ దశల్లో బేస్‌మెంట్ లెవల్ నుంచి ఇళ్లు పూర్తయ్యే వరకు ఐదు దశల్లో సొమ్ము ఇవ్వనున్నారు.

క్షేతస్థాయిలో పరిశీలన

ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారు అర్హులా? కాదా? అనే విషయాన్ని ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించి ఖరారు చేయనున్నది. ఇందు కోసం క్షేత్ర స్థాయి పరిశీలన, తనిఖీ చేయాలని నిర్ణయిం చింది. గ్రామం, పట్టణం, మున్సిపాలిటీ, వార్డుల వరకు ప్రత్యేక పరిశీలన అధికారి, పలు టీములతో కలిసి వెళ్లి దరఖాస్తులను ధ్రువీకరించనున్నారు. లబ్ధిదారులు అర్హులా? కాదా? అనే విషయాలను తేల్చేందుకు సర్కారు ఒక ప్రత్యేక ప్రొఫార్మాను తయారు చేసినట్టు తెలి సింది. దాని ప్రకారం అధార్ కార్డు, తెల్ల రేషన్‌కార్డులను పరిశీలి స్తారు. గ్రామంలో ఎప్ప టి నుంచి నివాసం ఉం టున్నారు? ప్రస్తుతం ఏ ఇంట్లో ఉంటున్నారనే వివరాలను సేకరిస్తారు. ఆ తరువాత దరఖాస్తుదారు అర్హులు అయి, ఇంటి స్థలం ఉన్నవారైతే సదరు స్థలం సొంత మేనా? డి-ఫారమ్ పట్టానా? లేదా పూర్వీకుల ఆస్తి నుంచి సంక్రమించిందా? అనే వివరాలను తీసుకుంటారు. ఇంటి స్థలం లేని వారైతే వారికి ఇంటి స్థలం ఇవ్వాలని ప్రొఫార్మాలో నమోదు చేయనున్నారు. ఈ ప్రక్రియ నిర్వహణకు గ్రామస్థాయి సిబ్బందితో పాటు రెవెన్యూ సిబ్బందిని కూడా వినియోగించనున్నట్టు తెలిసింది.

ఎమ్మెల్యే చేతుల్లోనే..

ఇందిరమ్మ ఇంటి నిర్మాణం అంటే మొదట గుర్తొచ్చేది లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఎవరి చేతుల్లో ఉంటుందనేది. గత ప్రభుత్వం దీనిని కలెక్టర్ల చేతిలో పెట్టింది. తాజాగా ప్రతీ నియోజకవర్గంలో ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే ఎంపిక ప్రక్రియలో ప్రాధాన్యత ఉంటుందని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ క్రమంలో ఆయా గ్రామాల్లో నేతలు వారికి అనుకూలంగా ఉన్నవారికి ఇప్పటించుకోవటానికి ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకోవలసి ఉంటుంది. అర్హులైన లబ్ధిదారులు గ్రామ నేతలను ప్రసన్నం చేసుకోవలసి ఉంటుంది.

ప్రత్యేక యాప్

ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు ఒక యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం. అర్హుల గుర్తింపు, ఇళ్ల నిర్మాణం, అందించే ఆర్థిక సాయం మంజూరు వరకు మొత్తం ప్రక్రియను ఆ యాప్ ద్వారానే నిర్వహించాలనే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. అయితే వీటికి సంబంధించిన కేంద్రం కూడా ఒక యాప్, పోర్టల్‌ను సూచిస్తోంది. ఈ నేపథ్యంలో వాటి ద్వారానే పథకాన్ని అమలు చేద్దామా? లేక రాష్ట్రానికి సంబంధించిన ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెద్దామా? అనే అంశంపై ప్రభుత్వం సమాచాలోచనలు చేస్తున్నట్టు తెలుస్తోంది.



పాలు, నీళ్లతో గణనాథుడి నిమజ్జనం చేస్తున్న దృశ్యం

నేత్రపర్వంగా నిమజ్జనం

- ఎల్లంబజార్ మహాగణపతికి మండపంలోనే పాలు, నీళ్లతో నిమజ్జనం
- రూ.2.26 లక్షలు పలికిన లడ్డూ వేలం పాట

మట్టెవాడ, సెప్టెంబరు 22: వరంగల్ ఎల్లంబజార్‌లోని మహా గణపతి నిమజ్జనం అంగరంగ వైభవంగా సాగింది. శ్రీ భద్రకాళి హిందూ ఉత్సవ సమితి నిర్వాహకుడు ఆకుతోట సంజు ఏర్పాటు చేసిన 40అడుగుల భారీ మట్టి గణనాథుడి విగ్రహం ఆదివారం మండపంలోనే పాలు, నీళ్లతో కలిపి నిమజ్జనం చేశారు. కమలంపై నిల్చొన్న ఆకారంలో ఉన్న మట్టితో తయారుచేసిన దుర్గా గణపతికి 15 రోజుల పాటు ఘనంగా పూజలందుకున్నారు. ఆదివారం ఫైర్‌ఇంజన్ ట్యాంకర్లు, పాల ట్యాంకర్లతో పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తుల సమక్షంలో విగ్రహం మీదకు పాలు, నీళ్లను పైప్‌తో చిమ్ముతూ మండపంలోనే నిమజ్జనాన్ని పూర్తి చేశారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిమజ్జన ప్రక్రియ సాగింది. ఇందుకోసం మూడు వేల లీటర్ల పాలు, 10వేల లీటర్ల నీళ్ల అవసరం కాగా, పాల ట్యాంకర్, ఫైర్ ఇంజన్‌సాయం తీసుకున్నారు.



ఫైర్ ఇంజన్ ట్యాంకర్‌తో నిమజ్జనం చేస్తున్న దృశ్యం

అంతకుముందు వినాయక లడ్డూ వేలం నిర్వహించారు. రూ.2.26లక్షలకు రామన్నపేటకు చెందిన సురాజ్‌గౌడ్ దక్కించుకున్నారు. మరో లడ్డును రంగశాయిపేట విశ్వనాథ కాలనీకి చెందిన గద్దె గోపి రూ.56 వేలకు దక్కించుకున్నాడు. మరో లడ్డును ఎల్లంబజార్‌కు చెందిన గుమ్మడి రాజ్‌కుమార్ రూ.36వేలకు దక్కించుకున్నారు.



మానుకోట బీజేపీ పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై మాట్లాడుతున్న జార్జ్ కురియన్

అవినీతి రహిత పాలనే మోదీ లక్ష్యం

- సభ్యత్వ నమోదులో తెలంగాణను ప్రథమస్థానంలో నిలపాలి
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లండి..
- కేంద్ర మత్స్య, పశుసంపద, మైనారిటీ వెల్ఫేర్‌శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్

మహబూబాబాద్, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): దేశంలో అవినీతి రహిత పాలన అందించడమే ప్రధాని మోదీ లక్ష్యమని బీజేపీ కేంద్ర మత్స్య, పశుసంపద, మైనారిటీ వెల్ఫేర్‌శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ సభ్యత్వ నమోదుపై పార్లమెంటరీ పరిధిలోని నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లందు అసెంబ్లీ సెగ్మెంట్ల ముఖ్యకార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీ రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల సభ్యత్వ నమోదును పూర్తిచేసి, దేశంలోనే తెలంగాణను ప్రథమస్థానంలో నిలపాలన్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను ఇంటింటికీ తీసుకువెళ్లి వివరించాలన్నారు. రాష్ట్రానికి గిరిజన యూనివర్సిటీ, కేంద్రీయ విశ్వవిద్యాలయాలను మంజూరు చేసినట్లు చెప్పారు. ముద్ర రుణాలు, మత్స్య శాఖ సభ్యులను సభ్యత్వం తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్కొక్క బూత్‌లో 200 సభ్యత్వాలు చేసే విధంగా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. ప్రధాని మోదీ భారతదేశాన్ని 5వ ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దేశంలోనే ఏ పార్టీకి లేని సభ్యత్వాల నమోదు బీజేపీకి ఉందన్నారు. కేంద్ర పార్టీ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో పది జిల్లాలో సభ్యత్వ నమోదును పరిశీలించేందుకు తాను వచ్చానని, పదిరోజుల పాటు తెలంగాణ రాష్ట్రంలోనే ఉంటానని స్పష్టం చేశారు. మరోమారు మహబూబాబాద్ జిల్లాకు వస్తానని, అప్పటి వరకు సభ్యత్వాల నమోదు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు, మాజీ ఎంపీ, ప్రొఫెసర్ అజ్మీర సీతారాంనాయక్, యాప సీతయ్య, సురేందర్‌రెడ్డి, భూక్య సంగీత, గాదె రాంబాబు, ధర్మారపు వెంకన్న, మోసంగి మురళి, సురేందర్, సింగారపు సతీష్, దార ఇందుభారతి, సిరికొండ సంపత్, శ్రీనివాస్, రేష్మా, శీనునాయక్ పాల్గొన్నారు.

సమాజాన్ని కథలు ఉత్తేజపరుస్తాయి..

- ప్రజా గ్రంథాలయం గౌరవ సలహాదారుడు, సీఎం ఓఎస్‌డీ శ్రీనివాసులు
- వైభవంగా ముల్కనూర్ ప్రజాగ్రంథాలయం దశాబ్ది ఉత్సవాలు



ప్రజాగ్రంథాలయం కథల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌లు, ప్రవీణ్‌రెడ్డి తదితరులు

భీమదేవరపల్లి, సెప్టెంబరు 22: కథలు, పాటలు, సాహిత్యం సమాజాన్ని ఉత్తేజపరుస్తాయని ముల్కనూర్ ప్రజాగ్రంథాలయం గౌరవ సలహాదారుడు, సీఎం ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్‌లు అన్నారు. ఆదివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో ప్రజా గ్రథాలయం దశాబ్ది ఉత్సవాలు వైభవంగా జరిగాయి. తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు డప్పుచప్పుళ్ల, మహిళల కోలాట నృత్యాలు, డోలు వాయిద్యాలతో అతిథులను ఆకట్టుకున్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలకు చెందిన పలువురు కవులు వేడుకలకు హాజరయ్యారు.

ఈ సందర్భంగా వేముల శ్రీనివాసులు మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న రుగ్మతలను కథలు, నాటికల ద్వారా ప్రజలకు వివరిస్తే త్వరితగతిన ప్రజలకు చేరువవుతాయన్నారు. ప్రజాగ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అందించిన పుస్తకాలు, కంప్యూటర్లతో 30మంది నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం గర్వకారణమన్నారు. అలాగే ఈ సంవత్సరం కూడా మరో 30 మంది విద్యార్థులు ప్రభుత్వ కొలువులు సాధించే అవకాశం ఉందన్నారు. గతంలో కాలేజీలు, పాఠశాలల్లో సంవత్సరం చివరిలో వార్షికోత్సవాలను పది పదిహేను రోజులు నాటికలు, పాటల పోటీలు నిర్వహించేవారన్నారు. కానీ రాను రాను ఆ పరిస్థితి మొత్తం మారిపోయి వార్షికోత్సవాలు ఒకటి రెండు రోజుల్లోనే ముగుస్తున్నాయన్నారు.

అనంతరం ముల్కనూర్ బ్యాంకు అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు ఇతర దేశాలు, అమెరికాలాంటి దేశాల్లో కూడా మన సంస్కృతి గొప్పతనాన్ని ఆచరిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు సమాజ విలువలు, సాహిత్య విలువలు తెలియజేయాలన్నారు. కంప్యూటరీకరణ మోజులో పడి సాహిత్యం, తెలుగు భాష వెనుకబడిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు ముల్కనూర్ ప్రజాగ్రంథాలయం వారు నిర్వహిస్తున్న కథల పోటీలు ఎంతగానో దోహదపడుతున్నాయని నిర్వాహకులను అభినందించారు. రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణగౌడ్ ముల్కనూర్ ప్రజాగ్రంథాలయానికి విలువైన పోటీ పరీక్షల పుస్తకాలను అందించారు. ముల్కనూర్ ప్రజాగ్రంథాలయంపైన అసంపూర్తిగా ఉన్న భవనాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడి పూర్తి చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అనంతరం కోడూరి రాజయ్య స్మారకార్థం నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన, పాటల పోటీల్లో గెలుపొందిన వారికి రాష్ట్ర గ్రంథాలయ సంస్థల చైర్మన్ రియాజ్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు గొల్లపల్లి లక్ష్మయ్య, మూల శ్రీనివాస్, మాడ్గుల కొంరయ్య, పల్లా ప్రమోద్‌రెడ్డి, తాళ్లపల్లి వీరేశం, ఎదులాపురం తిరుపతి, కిషన్ ప్రసాద్, ప్రొఫెసర్ తిరుపతి, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గుడెల్లి రాజిరెడ్డి, కొత్తకొండ దేవస్థానం మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, రమేష్‌గుప్తా పాల్గొన్నారు.

‘కౌన్సిల్’పై సందిగ్ధం

- బల్దియా సర్వసభ్య సమావేశంపై నీలినీడలు
- ఈనెల 24న జరిగే మీటింగ్ జరిగేనా?
- మేయర్ తీరును వ్యతిరేకిస్తున్న పలువురు కార్పొరేటర్లు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 22: చాలా రోజుల తర్వాత బల్దియాలో సర్వసభ్య సమావేశానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ నెల 24న బల్దియా కౌన్సిల్‌హాల్‌లో జరిగే సమావేశానికి 6మంది కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో మెంబర్లు హాజరవుతారు. అయితే ఇటీవల బల్దియాలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో సమావేశం జరిగేనా? అనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. మేయర్ తీరుపై కొందరు కార్పొరేటర్లు బహిరంగంగానే విమర్శలు చేయడం.. ఏకంగా సొంత పార్టీ కార్పొరేటర్లే అవిశ్వాస తీర్మానం పెట్టే యత్నం చేయడంతో రాష్ట్ర నాయకత్వం నుంచి ఒత్తిడి రావడంతో వెనక్కితగ్గారు. అయినా కొందరు కార్పొరేటర్లు మేయర్ తీరుపై బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ఏకంగా ధర్నాకు దిగిన సందర్భాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఈనెల 24న జరిగే సాధారణ సర్వసభ్య సమావేశం (కౌన్సిల్) జరిగేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు హాజరైనా హాలులో నిరసన తెలుపుతామని చెబుతున్నారు.

250 మంది నియమకానికి ప్రతిపాదనలు

ఒక వేళ బల్దియా సాధారణ సర్వసభ్య సమావేశం జరిగితే మరో 250మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించేందుకు రంగం సిద్ధం చేసినట్టు తెలిసింది. 15 ఏళ్ల కిందటే అన్ని విభాగాలను కలుపుకుని 2,440 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పని చేసేవారు. అయినా సిబ్బంది సరిపోవడంలేదని 2021లో అప్పటి మేయర్ కౌన్సిల్ తీర్మానం మేరకు 452 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని బల్దియాలో నియమించారు. కానీ 452 సిబ్బందిలో ఇప్పటి వరకు చాలామంది విధులకు హాజరు కాకుండానే అడ్డదారిలో జీతాలు తీసుకుంటున్నట్టు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో మళ్లీ నియమించే 250 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఎంపికలో ఎలాంటి అక్రమాలు జరుగుతాయోననే అనుమానాలు ఉన్నాయి.

మలేరియా సిబ్బందికి జీతాలు

బల్దియా పరిధిలోని 66 డివిజన్‌ల పరిధిలో పని చేస్తున్న మలేరియా విభాగం సిబ్బందికి ఆరు మాసాలుగా జీతాలు రావడం లేదనే గగ్గోలు పెడుతున్నారు. 90 మంది ఔట్ సోర్సింగ్ మలేరియా సిబ్బందికి జీతాలు ఇవ్వనున్నట్టు కౌన్సిల్ తీర్మానంలో వెల్లడించనున్నట్టు తెలిసింది. ఒక్కో కార్మికుడికి రోజుకు రూ.47చొప్పున ఈ యేడు డిసెంబరు వరకు జీతాల డబ్బులు మంజూరు చేయనున్నారు. 15వ ఆర్థిక సంఘం మిగులు నిధుల నుంచి రూ.1.38కోట్ల నిధులు విడుదల చేయనున్నారు. అదే విధంగా మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో మెంబర్లు, ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులు స్టడీ టూర్‌లో భాగంగా బల్దియా అభివృద్ధి కోసం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్, కేరళ రాష్ట్రంలోని కొచ్చికి స్టడీ టూర్‌కు వెళ్లనున్నారు. ఈ టూర్‌పై కౌన్సిల్ సమావేశంలో అమోదం కోసం బల్దియా పరిధిలోని 66 మంది కార్పొరేటర్లకు సప్లమెంటరీ ఎజెండా నోటీసులు సెక్రెటరీ వి జయలక్ష్మి జారీ చేశారు.





సమావేశంలో మాట్లాడుతున్న వినయభాస్కర్

నేటి చలో హైదరాబాద్‌కు తరలిరావాలి

- భవన నిర్మాణ కార్మికులకు వినయభాస్కర్ పిలుపు

రాంనగర్, సెప్టెంబరు 22: భవన నిర్మాణ కార్మికులు సోమవారం హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నా కార్యక్రమానికి తరలిరావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం వడ్డెపల్లిలో తన నివాసంలో వినయభాస్కర్ భవన నిర్మాణ రంగ కార్మికులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వినయభాస్కర్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల డిమాండ్లు న్యాయమైనవన్నారు. ప్రభుత్వమే వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలన్నారు. వెల్ఫేర్ బోర్డు అడ్వయిజరీ కమిటీని కార్మిక సంఘాల ప్రతినిధులతో ఏర్పాటు చేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో కార్మిక భవనాలు నిర్మించాలని వినయభాస్కర్ డిమాండ్ చేశారు. ప్రమాద మరణాలకు రూ.10లక్షలు, సహజ మరణానికి రూ.5లక్షలు, దహన సంస్కారాల ఖర్చు అందించాలన్నారు. కేంద్ర చట్టంలో ఉన్న పెన్షన్, పిల్లలకు స్కాలర్ షిప్‌లు, గృహవసతి, కార్మిక అడ్డాలో మౌలిక వసతులు కల్పించాలని వినయభాస్కర్ అన్నారు. ఈ సమావేశంలో భవన కార్మిక రంగ నాయకులు మల్లేశం, నాయిని రవి, సారంగపాణి, శివకుమార్, బిక్షపతి, కొండన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను దోచుకున్న చరిత్ర బీఆర్ఎస్‌దే..

- టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్



మాట్లాడుతున్న బండి సుధాకర్‌గౌడ్

వడ్డెపల్లి, సెప్టెంబరు 22: ప్రజలను దోచుకున్న చరిత్ర బీఆర్ఎస్ పార్టీదేనని, రాష్ట్రంలో ఆ పార్టీ భవిష్యత్ ప్రశ్నార్థకమేనని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూడలేకే బీఆర్ఎస్ నేత కేటీఆర్ చౌకబారు విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర పథకమైన అమృత్ టెండర్లలో అక్రమాలు జరిగాయని కేటీఆర్, సీఎం రేవంత్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కసీటు కూడా గెలవకుండా ప్రజలు తగిన తీర్పునిచ్చినా బీఆర్ఎస్ నేతలకు బుద్ధిరాలేదని బండి సుధాకర్ గౌడ్ అన్నారు. రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో పరిష్కరిస్తూ ప్రజలకు చేరువవుతూ వారి ఆదరాభిమానాలను చూరగొంటున్నదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేసిన కాలంలో హెచ్‌ఎండీఏ పరిధిలో ఎన్ని భూములను కన్వర్షన్ చేశారని ప్రశ్నించారు. ఎన్ని బహుళ అంతస్థుల భవనాలకు అనుమతులు ఇచ్చారో సమాజానికి తెలుసునని బండి సుధాకర్ గౌడ్ తెలిపారు. అనుమతుల్లో జరిగిన అక్రమాల పై సీబీసీఐడీతో విచారణ జరిపించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ పాలనలో దేవుళ్లను కూడా వదిలిపెట్టలేదని అన్నారు. యాదాద్రి దేవాలయ పనుల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నేతలు బాషగళ్ల విజయ్, గుర్రపు నిఖిల్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



దందాలకు కేంద్రంగా 'వరంగల్'

● విచ్చలవిడిగా గంజాయి, గుట్కా విక్రయాలు ● చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు ● యథేచ్ఛగా సాగుతున్న దందా

వరంగల్ క్రైం, సెప్టెంబరు 22: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని వరంగల్ నగరం కేంద్రంగా పలు దందాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. వరంగల్ నగర ప్రాంతంలో మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్, మట్టెవాడ పోలీస్ స్టేషన్ల పరిధిలో జరగని దందా అంటూ లేదు. ప్రతీ స్టేషన్ పరిధిలో భూ దందాలు సాధారణంగా మారినప్పటికీ వరంగల్ నగరంలో గంజాయి, గుట్కా, మట్కా దందాల జోరు ఎక్కువైంది. అత్యంత ప్రమాదకరంగా మారిన గంజాయి, గుట్కా, మట్కా.. వరంగల్ నగరంలో విచ్చలవిడిగా సాగుతోంది. మూడు పోలీసు స్టేషన్ పరిధిలోని రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, ఎంజీఎం సెంటర్, పోచమ్మమైదాన్, అండర్ బ్రిడ్జి, శివనగర్, పోచమ్మమైదాన్ ప్రాంతాల్లో గంజాయి, గుట్కా విక్రయాలు ఎక్కువగా సాగుతున్నాయి. మట్కా విషయానికి వస్తే.. నగరంలో కొంతమంది వ్యక్తులు సిండికేట్‌గా ఏర్పడి కార్మికులు, చిరువ్యాపారులను మోసం చేస్తూ ఒక నంబర్‌పై పెట్టిన డబ్బులకు డబుల్ వస్తుందని మోసం చేస్తున్నారు. వరంగల్ నగరంలో మట్కా ఇటీవల ఎక్కువైంది. ఈ దందాలు పోలీసుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి.

మహారాష్ట్ర నుంచి దిగుమతి

వరంగల్ నగరంలోని పిన్నవారివీధికి చెందిన కొంతమంది వ్యాపారులు గుట్కాను మహారాష్ట్ర, హైదరాబాద్ నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు సమాచారం. కొంతమంది వ్యాపారులు ట్రాన్స్‌పోర్టుల్లో గుట్కాను వరంగల్ నగరానికి తీసుకువస్తున్నట్లు తెలిసింది. పిన్నవారివీధి కేంద్రంగా పలు షాపులకు గుట్కా విక్రయాలు సాగుతున్నట్లు సమాచారం. పాన్ మసాలా మాటున గుట్కాను విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఈ వ్యాపారులు పలు సెంటర్లలోని పాన్ డబ్బాలకు, జనరల్ స్టోర్స్‌కు సరఫరా చేస్తూ పెద్ద మొత్తంలోనే మూటగట్టుకుంటున్నట్లు సమాచారం. వరంగల్ నుంచి హనుమకొండ, కాజీపేట నగరాలకు సైతం


మట్టెవాడ స్టేషన్ పరిధిలో పటుకున్న గుట్కా(ఫైల్)

గుట్కా చేరుతున్నట్లు తెలిసింది. రెండు, మూడు మాసాల్లో పట్టుకున్న గుట్కా, గంజాయి విలువ లక్షల్లో ఉండటాన్ని గమనిస్తే ఏ మేరకు దందా సాగుతుందో గమనించవచ్చు.

మందలించి వదిలేసిన పోలీసులు

నగరంలో గుట్కా విక్రయాలు ఎక్కువ కావడం, విక్రయాలకు అనుమతి ఇవ్వాలని వరంగల్ నగరానికి చెందిన పలువురు గుట్కా వ్యాపారులు కోర్టుకు వెళ్లడం తెలిసిందే. గుట్కా అమ్మకాలకు అవకాశం కల్పించాలని వరంగల్ నగరానికి చెందిన పలువురు వ్యాపారులు వరంగల్ పోలీస్ బాస్‌ను కలిసినట్లు సమాచారం. గుట్కా, గంజాయిని పూర్తి స్థాయిలో నిర్మూలించాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను అమలు చేస్తున్న సీపీ.. గుట్కా విక్రయదారులపై చర్య తీసుకోవాలని మట్టెవాడ పోలీసులను ఆదేశించినట్లు తెలిసింది. వరంగల్ నగరానికి చెందిన పదిమంది గుట్కా వ్యాపారులను మట్టెవాడ పోలీసులు ఇటీవల స్టేషన్‌కు పిలిపించి మందలించి వదిలేసినట్లు సమాచారం. పోలీసులతో ఉన్న సాన్నిహిత్యంతో ఇలా వెళ్లి అలా వచ్చిన వ్యాపారులు దందాను కొనసాగిస్తున్నారని తెలిసింది. నగరంలో రెండు చోట్ల గోదాములను ఏర్పాటు చేసుకుని ఈ దందాను సాగిస్తున్నట్లు సమాచారం. వీరి దందా పోలీసుల కనుసన్నల్లోనే జరుగుతుందనే ఆరోపణలు సైతం ఉన్నాయి. గుట్కా విక్ర యదారులు నెలవారీగా ఎవరికి ఇచ్చే మామూళ్లు వారికి ఇస్తుంటారనే ప్రచారం సైతం ఉంది.

మచ్చుకు కొన్ని..

- సెప్టెంబరు 5వ తేదీన మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్‌లో మట్కా నిర్వహిస్తున్న బండి రాజు అనే నిందితుడిని అదుపులోకి తీసుకుని రూ.32వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.
- జూలై 19న మట్టెవాడ ప్రాంతంలో రాజ్‌పురోహిత్, ధీరజ్ అనే ఇద్దరు వ్యక్తులు గుట్కా విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని రూ.8 లక్షల 79 వేల విలువైన గుట్కా, సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు.
- ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేబీహెచ్ఎస్ కాలనీలో శివరాజ్‌కుమార్ అనే వ్యక్తి గుట్కా నిల్వలు కలిగి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు జూలై 13న దాడులు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని రూ.2 లక్షల విలువైన నిషేధిత గుట్కాను స్వాధీనం చేసుకున్నారు.
- వరంగల్ శివనగర్‌కు చెందిన యువకుడు కిలో గంజాయి భద్రాచలం నుంచి తీసుకువచ్చి నగరంలో విక్రయించినట్లు సమాచారం రావడంతో ఇంతేజార్‌గంజ్ పోలీసులు ఆగస్టు 10న యువకుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.
- నగరానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి ఆగస్టు 17న గంజాయి విక్రయిస్తూ ఇంతేజార్‌గంజ్ పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రూ.33 వేల విలువైన 1350 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

రైలులో గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాజీపేట, సెప్టెంబరు 21 : రైలులో గుర్తుతెలియని వ్యక్తిమృతి చెందాడు. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సికింద్రాబాద్ నుంచి గుంటూర్ వెళ్లే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలు జనరల్ బోగీలో ఆదివారం ఓ గుర్తుతెలియని మృతదేహాన్ని ప్రయాణీకులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి వయస్సు 60 సంవత్సరాలు ఉంటాయి. ఎత్తు 5.5 ఛాయనఛాయ రంగు, తెల్లగడ్డం, పొట్టపై పుట్టుమచ్చ, పింక్ చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. గుర్తించడానికి అతడి వద్ద ఎలాంటి ఆనవాళ్లు లేవు. మతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్‌స్టేషన్ ఫోన్ 87126 58609, 87125 68496 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు తెలిపారు.

మక్కలకు తగ్గుతున్న మద్దతు

ఆందోళనలో అన్నదాత


ధర తగ్గిన తప్పని పరిస్థితుల్లో వ్యాపారులకు విక్రయిస్తున్నరైతులు

ఐనవోలు, సెప్టెంబరు 22: నిన్న, మొన్నటి వరకు మక్కల మద్దతు ధరను చూసి రైతులు మురిసిపోయారు. ఎప్పుడూ లేనంతగా యాసంగి మక్కలకు ఏనుమాముల మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.3070/- ధర పెట్టి కొనుగోలు చేసింది తెలిసిందే. పెరిగిన ధర ఈ వానకాలం పంట దిగుబడికి లభిస్తుందని రైతులు ఆశించారు. వానకాలం పంట ఇప్పుడిప్పుడే చేతికి అందడం, ఇంతలోనే ధర పతనంకావడం రైతులు జీర్ణించుకోవడం లేదు. ఇప్పుడు మక్కల మార్కెట్ ధర క్వింటాల్‌కు రూ.2640/- పలకడం, ఇలా వారం వ్యవధిలోనే క్వింటాల్‌కు రూ.430ల ధర తగ్గడం పట్ల రైతులు దిగాలు చెందుతున్నారు. అసలే వానకాలం దిగుబడి ఎకరానికి 6 నుంచి 10 క్వింటాళ్ల వరకు తగ్గి ఆర్థికంగా నష్టపోతే దానికితోడు మద్దతు ధరను తగ్గించడం మరింత ఇబ్బందిగా మారిందని రైతులు వాపోయారు.








జాతీయ స్థాయిలో మొదటి బహుమతి అందుకున్న కోటేశ్వర్‌రావును సన్మానిస్తున్న నిర్వాహకులు

జాతీయ స్థాయి కథల పోటీల విజేతలకు బహుమతులు

భీమదేవరపల్లి, సెప్టెంబరు 22: జాతీయస్థాయిలో 2023-24 సంవత్సరానికి నిర్వహించిన కథల పోటీల్లో విజేతలను ఎంపిక చేసి, నగదు బహుమతిని అందజేసినట్లు ముల్కనూర్ సాహితీ పీఠం గౌరవ సలహాదారు, సీఎం ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్‌లు తెలిపారు. ఆదివారం ముల్కనూర్‌లో జాతీయ స్థాయి 2023లో నిర్వహించిన కథల పోటీల్లో గెలుపొందిన విజేతలను ప్రకటించి, నగదు బహుమతి అందజేశారు. 2023-24 సంవత్సరానికి కథల పోటీలను ముల్కనూర్ సాహితీ పీఠం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కథల పోటీలకు 600 కథలు వచ్చాయి. ఈ సందర్భంగా ముల్కనూర్ ప్రజాగ్రంథాలయం గౌరవ సలహాదారు, సీఎం ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్‌లు, ముల్కనూర్ ప్రజాగ్రంథాలయం చైర్మన్ వంగ రవిలు మాట్లాడుతూ.. ఉత్తమ కథలను ఎంపిక చేసేందుకు ఆరుగురు జడ్జిలను నియమించామన్నారు. 68 మందిని విజేతలుగా గుర్తించి ప్రకటించామన్నారు. తెలుగు సాహిత్యాన్ని మరింత మెరుగు పరిచి పదును పెట్టేందుకు ఈ కథల పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మొదటి బహుమతికి ఒకరికి రూ.50వేల చొప్పున, రెండో బహుమతి ఇద్దరికి రూ.20వేల చొప్పున, తృతీయ బహుమతి ముగ్గురికి రూ.10వేల చొప్పున అందజేస్తున్నట్లు తెలిపారు. రూ.5వేల బహుమతి 10మందికి, రూ.3వేల బహుమతి 20మందికి, రూ.2వేల బహుమతి 24మందికి నగదు బహుమతి, షీల్డ్‌లు, శాలువాలతో సన్మానించారు. ప్రథమ బహుమతి ఎం.కోటేశ్వర్‌రావు రచించిన అమ్మ చిరునామా, ద్వితీయ బహుమతులు సమ్మెట ఉమాదేవి రచించిన ఇసుక తైలం, మల్లీపురం జగదీష్ రచించిన ఒక మిలంతికళ, తృతీయ బహుమతులు ఒడ్డెడ బలరామస్వామి రచించిన డేగ, సయ్యద్ గఫార్ రచించిన రిక్షే, గుమ్మడి రవీంద్రనాథ్ రంచించిన చేజారి పోనీకు కథలను 2023-24 సంవత్సరానికి విజేతలుగా గుర్తించామన్నారు. రూ. 5వేలు, రూ.3వేలు, రూ.2వేలు బహుమతులు గెలుచుకున్న విజేతలను సైతం గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, గ్రంథాలయ నిర్వాహకులు గొల్లపల్లి లక్ష్మయ్య, మూల శ్రీనివాస్, మాడ్గుల కొంరయ్య, పల్లా ప్రమోద్‌రెడ్డి, తాళ్లపల్లి వీరేశం, ఎదులాపురం తిరుపతి, కిషన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





విద్యుదాఘాతంతో యువకుడు మృతి


గుగులోత్ నితిన్ (ఫైల్)

గార్ల, సెప్టెంబరు 22 : మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రం సమీపంలోని వరి పొలంలో పురుగుల మందు పిచికారి చేస్తూ.. విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. పూమ్యాతండాకు చెందిన గుగులోత్ నితిన్ (19), గార్లకు చెందిన కౌలురైతు తోడెటి శ్రీను వరి పొలంలో పురుగుల మందు పిచికారి చేయడానికి కూలీ పనికి వచ్చాడు. శనివారం రాత్రి వీచిన గాలి దుమారానికి విద్యుత్ వైరుతెగి పొలంలో పడిపోయింది. దీనిని కౌలు రైతు గమనించక పోవడంతో పురుగులమందు పిచికారి చేసే సమయంలో కూలీ పనులకు వచ్చిన నితిన్ కాలుకు కరెంట్ తీగ తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురైన నితిన్ అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబికుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, నితిన్‌కు వివాహం కాలేదు.

పేకాట శిబిరంపై దాడి


వరంగల్ క్రైం, సెప్టెంబరు 22: హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అలంకార్ జంక్షన్ సమీపంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం పేకాట శిబిరంపై దాడి చేశారు. సురేష్ అనే వ్యక్తి నివాసంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. రూ.40వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం ఆరుగురిని హనుమకొండ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్.రాజు ధ్రువీకరించారు.

గడ్డిమందు తాగి వివాహిత ఆత్మహత్య


సరిత (ఫైల్)

ఐనవోలు, సెప్టెంబరు 22: వివాహిత గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన లింగమోరిగూడెంలో చోటుచేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బుర్ర సరిత(42) కొంతకాలం కిందట అనారోగ్యానికి గురైంది. ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మనస్థాపానికి గురై మూడు రోజుల కిందట గడ్డిమందు తాగింది. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందింది. మృతురాలుకు భర్త, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. తన కూతురు అనారోగ్య కారణాల వలన ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలు తండ్రి వడ్లకొండ కొంరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతోపాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు భౌతికకాయాన్ని సందర్శించి మృతురాలు భర్త మాజీ ఉప సర్పంచ్ శ్రీహరి ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

వర్సిటీలో పాఠాలు చెప్పే వారేరి?



- ఏడేళ్లుగా పార్టుటైమ్ అధ్యాపకుల నియామకల్లేవు
- తరగతులు సక్రమంగా జరుగక విద్యార్థుల అవస్థలు
- పార్టుటైమ్ నోటిఫికేషన్‌కు ఆశావహుల ఎదురుచూపులు
- అధ్యాపకుల్లేక గతంలో బీఈడీ, ఎంఈడీ కళాశాల అనుమతి రద్దు
- ఎన్నిమార్లు వినతిపత్రాలిచ్చినా పట్టించుకునే నాథుడు లేడు..

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18: తెలంగాణ రాష్ట్రంలో రెండో అతిపెద్ద వర్సిటీగా పేరొందిన కాకతీయ యూనివర్సిటీలో పాఠాలు చేప్పేవారు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గతంలో ఓ దఫా అధ్యాపకులు లేక వర్సిటీ క్యాంపస్‌లోని బీఈడీ, ఎంఈడీ కళాశాలల గుర్తింపును సైతం రద్దు కావడం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనంగా మారింది. తర్వాత మళ్లీ అధ్యాపకులను నియమించి అనుమతులను పొందారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గంపెడాశతో కష్టపడి డిగ్రీ పూర్తి చేసుకుని పీజీ ఎంట్రెన్స్‌కు సిద్ధమై చదివి వర్సిటీ క్యాంపస్‌లో సీట్లు సాధించిన ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీతో పాటు ఇతర కోర్సుల విద్యార్థులు పాఠాలు జరగక ఏటేటా తీవ్రంగా నష్టపోతున్నారు. డిపార్టుమెంట్‌లలో తరగతులకు పోయిన విద్యార్థులకు రోజులో ఒక్కటి, రెండు క్లాస్‌లు జరుగగానే పాఠాలు చేప్పేందుకు మిగతా అధ్యాపకులు లేరని విభాగాధితులు చెప్పడంతో బిక్కముఖాలతో తిరిగి వస్తున్నారు. ప్రతీ రోజు ప్రతీ విభాగంలో టైంటేబుల్ మేరకు ఐదుక్లాసుల థియరీతో పాటు ప్రాక్టికల్స్ తరగతులు పకడ్బందీగా నిర్వ హించాల్సి ఉంటోంది. అయితే ఏడేళ్లుగా వర్సిటీతో పాటు ఇతర అనుబంధ కళాశాలల్లో రిటైర్డు పొందుతున్న ప్రొఫెసర్లు, కాంట్రాక్టు పార్టుటైమ్ అధ్యాపకుల సంఖ్య పెరు గుతున్నప్పటికీ వారి స్థానంలో మళ్లీ పార్టుటైమ్ పద్ధతిలో సరైన అధ్యాపకులను నియమించకపోవడంతో విద్యార్థులకు పాఠాలు సక్రమంగా జరుగని దుస్థితి నెలకొంది. పేరుకే వర్సి టీ కానీ పాఠాల బోధనలో మారుమూల కళాశాలల కంటే అధ్వాన్నంగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నారు. వర్సిటీ ఉన్నతాధికారులకు వివిధ విభాగాల అధిపతులు తమ విభాగంలో వర్క్‌లోడ్ ఉందని పార్టుటైమ్ అధ్యాపకు లు కావాలని ఎన్నిమార్లు లేఖలు రాసినప్పటికీ పట్టించుకునే పరిస్థితి లేదని తెలుస్తోంది. పాఠాలు కాక విద్యార్థులు, తమకు పార్టుటైమ్ అధ్యాపకులు కావాలని విభాగాధిపతులు ఎన్నిమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా ప్రయోజనం ఉండడం లేదు.

మరో వర్సిటీకి విద్యార్థులు జంప్

వర్సిటీ పరిధిలో పార్టుటైమ్ అధ్యాపకుల్లేక సక్రమంగా టైంటేబుల్ మేరకు తరగతులు జరుగకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా పీజీ సెట్-2024లో అత్యున్నత ప్రతిభ కలిగిన విద్యార్థులు వర్సిటీలో అడ్మిషన్ పొందకుండా మరో వర్సిటీకి వలస వెళ్లిపోతున్నట్లు తెలుస్తోంది. ఈఏడాది వర్సిటీ క్యాంపస్‌తో పాటు మరికొన్ని అనుబంధ కళాశాలల్లోనూ ప్రతిభ కలిగిన విద్యార్థులు మొదటి విడత పీజీ అడ్మిషన్లకు దూరంగా ఉంటున్నారని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. వర్సిటీ క్యాంపస్‌లోనూ కొన్ని విభాగాల్లో అడ్మిషన్లు పొందేందుకు వచ్చిన విద్యార్థులు ఇక్కడి పాఠాలు కాని విషయాన్ని తెలుసుకుని ఇంకా మంచి కళాశాలను ఎంపిక చేసుకుని వెళుతున్నారని వర్సిటీ విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు. అడ్మిషన్లు పడిపోతే వర్సిటీ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బయోమెట్రిక్‌లను నిరుపయోగం మార్చారు..

వర్సిటీతోపాటు ఇతర కళాశాల్లోనూ రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖాధికారులు రోజూ పకడ్బందీగా తరగతులు నిర్వహించాలని బయోమెట్రిక్ అటెండెన్స్‌ను షురూ చేశారు. అయితే వర్సిటీలో అవి మూలకు పడ్డాయి. వర్సిటీ క్యాంపస్‌తో పాటు ఇతర అనుబంధ కళాశాలల్లో పాఠాలు జరుగక విద్యార్థులు మథనపడుతున్నారు. రోజుకు 5 క్లాస్‌లు పకడ్బందీగా ఎందుకు జరుగడం లేదు అని ప్రశ్నించే సాహసం చేయలేకపోతున్నారు. పాఠాలు సక్రమంగా జరకపోవడంతో విద్యార్థులు సక్రమంగా కళాశాలలకు వచ్చే పరి స్థితి లేదు. దీంతో వర్సిటీలో అటెండెన్స్ బయోమెట్రిక్ హాజ రును అటకెక్కించారు. విద్యార్థులు తరగతులకు రానని అధ్యాపకులు.. మేం వస్తే పాఠాలు చేప్పే వారు లేరని అధ్యాపకులు.. పరస్పరం ఎదురు చెబుతున్నారు. లక్షలు వెచ్చించి వర్సిటీ కొనుగోలు చేసిన బయోమెట్రిక్ హాజరును సక్ర మంగా అమలు చేస్తే విద్యార్థులు క్లాస్‌లకు హాజరవుతారని వాటిని నిరూపయోగంగా మార్చారు. వర్సిటీలో పాఠాలు చేప్పే వారు లేకపోవడంతో విద్యార్థులు బయటికి చేప్పలేక.. లోలోన ఇబ్బందులు పడుతున్నారు.

తక్కువ సంఖ్యలో అధ్యాపకులు

వర్సిటీ పరిధిలో ఏడేళ్లుగా పార్టుటైమ్ అధ్యాపక నియామకల్లేవు. ఏటేటా వర్సిటీ విభాగాధిపతులు పంపే వర్క్‌లోడ్ ఆధారంగా వర్సిటీ ఉన్నతాధికారులు పార్టుటైమ్ అధ్యాపకుల నియామకాలను చేపట్టేవారు. అయితే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వర్సిటీల్లో పార్టుటైమ్ అధ్యాపకుల నియామకాలకు అడ్డుకున్నారు. దీంతో ఏటేటా రిటైర్డు అధ్యాపకుల సంఖ్య పెరిగినప్పటికీ గతంతో వీసీలుగా పనిచేసిన వారు పార్టుటైమ్ నియామకాలను చేపట్టలేదు. దీంతో పాఠాలు చేప్పే వారు కరువయ్యారు. వర్సిటీలో 425 మంది రెగ్యులర్ ప్రొఫెసర్‌లు ఉండాల్సిన ఉండగా, అందరూ రిటైర్డు కాగా, ఇప్పుడు వారి సంఖ్య 88కి పడిపోయింది. వీరితోపాటు మరో 178మంది కాంట్రాక్టు, మరో 200మంది పార్టుటైమ్ అధ్యాపకులు వరంగల్, ఖమ్మం జిల్లాల్లో పనిచేస్తున్నారు.

ప్రొఫెషనల్ కోర్సుల్లోనూ దారుణం

వర్సిటీ పరిధిలోని ఇంజనీరింగ్‌లో రెగ్యులర్ 5 అసిస్టెంట్ ప్రొఫెసర్లతోపాటు మరో 60 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారు. ఏడు డిపార్టుమెంట్లలో సరైన బోధన సిబ్బంది లేకపోవడంతో గతంలోనూ ఇంజనీరింగ్ కళాశాలకు అనుమతులను నిరాకరించడం వివాదాస్పదంగా మారింది.



గతంలో ఎడ్యుకేషన్ కళాశాలల అనుమతిలు రద్దు

వర్సిటీ క్యాంపస్‌లోని ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలల్లో సరైన సిబ్బందిలేరని జాతీయ ఉన్నత విద్యా మండలి అధికారులు బీఈడీ, ఎంఈడీ కోర్సుల అనుమతిని రద్దుచేశారు. తర్వాత తాత్కాలిక అధ్యాపకుల నియామకాలు చేపట్టడంతో అనుమతిని పునరుద్ధరించింది. ఇప్పుడు అయా కళాశాలలు పరిస్థితి మళ్లీమొదటికి వచ్చాయని తెలుస్తోంది.

బీఏ ఆనర్స్ కోర్సుకు సైతం..

గతంలో రాష్ట్రవ్యాప్తంగా బీఏ అనర్స్ కోర్సులను ప్రతిష్ఠాత్మకంగా సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రారంభించారు. ఓయూతోపాటు కేయూలో బీఏ అనర్స్ సోషియాలజీ కోర్సులను ప్రవేశపెట్టారు. అయితే మూడేళ్లయినప్పటికీ ఇప్పటివరకు ఆయా కోర్సులకు అధ్యాపకులను నియమించకపోవడంతో ఉన్న తాత్కాలిక అధ్యాపకులతో పాఠాలు మమ అనిపిస్తున్నారు. మూడేళ్ల బ్యాచ్ విద్యార్థులు మూడు పాఠాలు కాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్

వినతి పత్రాల అందజేత

వర్సిటీలోని వివిధ విభాగాలల్లో పీహెచ్‌డీతో పాటు జాతీయ స్థాయి సీఎస్ఐఆర్, నెట్, స్లెట్ తదితర పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగ అభ్యర్థులు తమకు పార్టుటైమ్ ఉద్యోగ అవకాశాల కోసం ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఓయూ. శాతవాహన, మహాత్మాగాంధీ, పాలమూరుతో ఇతర అన్ని వర్సిటీల్లో తమ అవసరాలకు అనుగుణంగా విడుదల చేసిన పార్టుటైమ్ నోటిఫికేషన్లను జతచేసి కేయూ ఉన్నతాధికారులకు ఏటేటా అనేక మార్లు వినతిపత్రాలను అందచేసి ఇక్కడ కూడా నోటిఫికేషన్లను విడుదల చేయాలని చెప్పినప్పటికీ ఫలితం లేదు. దీంతో విద్యార్థులకు పాఠాలు చేప్పే వారు లేక తీవ్రంగా వర్సిటీలో నష్టం జరుగుతోంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిలను కలిసి తమ డిమాండ్‌లను చెబుతున్నామని పార్టుటైమ్ ఆశావహులు వెల్లడించారు. పాఠాలు చేప్పే వారు లేక విద్యార్థులు జాతీయస్థాయి పోటీపరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం లేదనే ఆరోపణలున్నాయి. విద్యార్థులకు, నిరుద్యోగ అభ్యర్థులకు వర్సిటీ ఉన్నతాధికారులు న్యాయం చేయాల్సిన అవసరం ఉందని పలువురు విద్యావేత్తలు చెబుతున్నారు.


మాట్లాడుతున్న అధ్యక్షుడు నాగరాజారావు

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

రెడ్డికాలనీ, సెప్టెంబరు 22: ప్రతిభా పురస్కారాలకు విశ్వబ్రాహ్మణ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్, ప్రొఫెషనల్ అసోసియేషన్ (వోపా) అధ్యక్షుడు శ్రీరామోజు నాగరాజారావు తెలిపారు. ఆదివారం రెడ్డికాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజారావు మాట్లాడుతూ.. 2024 సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తీర్ణులైన విశ్వబ్రాహ్మణ విద్యార్థులు ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కొంత మంది విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 9440313745, 9390121399, 9550151292లలో సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో డాక్టర్ పొడిశెట్టి విష్ణువర్ధన్, మహేశ్వరం భిక్షపతి, శ్రీరామోజు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీలో కొనసాగుతున్న ఉత్కర్ష ఉత్సవాలు



వరంగల్ మెడికల్, సెప్టెంబరు 22: కాకతీయ మెడికల్ కాలేజీ వార్షిక ఉత్సవం ఉత్కర్ష రెండోరోజు ఆదివారం కూడా కొనసాగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మట్టికూల్పన, సూక్ష్మకళ, బొకే తయారీ, క్విజ్, ఇతర సాహిత్య కార్యక్రమాలను నిర్వహించారు. అన్ని కార్యక్రమంల్లో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారు. ఫైనల్స్‌లో కూడా స్పోర్ట్స్ నిర్వహించారు. ఉత్కర్ష మూడో రోజు అయిన సోమవారం ఇంపల్స్, షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు నిర్వాహకు లు ప్రకటించారు. ఈ ఫెస్టివల్‌లో మెడికోస్ సామాజి క అవగాహన రూపొందించిన షార్ట్ ఫిలిమ్‌లను ప్రదర్శిస్తారు.


సీసాలో 'జస్టిస్ ఫర్ అభయ' అనే సూక్ష్మ కళ

సుదర్శనాచార్యులకు ప్రతిష్ఠాత్మక గౌరవం

టీటీడీ వైదిక జ్యోతిష సమ్మేళనంలో డాక్టరేట్, స్వర్ణకంకణం బహుకరణ


తిరుమలలో డాక్టరేట్, స్వర్ణకంకణం అందుకుంటున్న సుదర్శనాచార్యులు

సంగెం, సెప్టెంబరు 22: జ్యోతిషంలో ప్రతిభ కనబర్చినందుకు వరంగల్ జిల్లా సంగెం మండలం చింతలపల్లికి చెందిన ఊకల్ నాగేంద్ర స్వామి ఆలయ అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు డాక్టరేట్, స్వర్ణకంకణం అందుకున్నారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుమల, తిరుపతి దేవస్థానంలో దేవస్థాన పండితులు ఏర్పాటు చేసిన మూడు రోజుల వైదిక జ్యోతిష సమ్మేళనంలో ఆయనకు ఈ గౌరవం దక్కింది. మూడు రాష్ట్రాలకు చెందిన వేద పండితులు పాల్గొన్న ఈ సమ్మేళనంలో జ్యోతిషంలో సుదర్శనాచార్యుల ప్రతిభకు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా తిరుపతి దేవస్థాన పండితులతోపాటు శ్రీకాళహస్తీశ్వర ఆలయ పండితులు చక్రధరశర్మ, కంచికామకోటి పీఠాధిపతులు లక్కవఝ్ఝా విజయబాల సుబ్రమణ్యశర్మ చేత గౌరవం అందుకున్నారు. సుదర్శనాచార్యుల ప్రసంగం అనంతరం డాక్టరేట్ అందించి, స్వర్ణకంకణం తొడిగి సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వర ఆలయ ప్రధాన అర్చకుడు సంబంధం కురుకులం, టీటీడీ ఆలయ అర్చకుడు వేణుగోపాల దీక్షతులు, పలువురు వేద పండితులు, టీటీడీ ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజనీతిశాస్త్రం మంచి జీవితాన్ని నేర్పుతుంది..

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ రియాజ్ ● కన్నుల పండువగా రాజనీతిశాస్త్రం అలుమ్నీ మీట్



మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ రియాజ్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 22: రాజనీతిశాస్త్రం ప్రతీ ఒక్కరికి మంచి జీవితాన్ని నేర్పుతుందని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ రియాజ్ ఉద్బోధించారు. రాజనీతిశాస్త్ర సిద్ధాంతాలు సైద్ధాంతికంగా గొప్పగా ఉంటాయని, వాటిని సమాజంలో ఆచరణాత్మకంగా అమలు చేసే దిశగా ప్రయత్నాలు జరుగాలని అన్నారు. ఆదివారం కాకతీయ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగం విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ అధ్యక్షతన అలూమ్నీ మీట్ కన్నుల పండువగా జరిగింది.

ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న మహ్మద్ రియాజ్ మాట్లాడుతూ.. కేయూ రాజనీతిశాస్త్రం విభాగానికి పూర్వ విద్యార్థులందరూ రుణపడి ఉన్నాయని చెప్పారు. కేయూ రాజనీతిశాస్త్ర విభాగంలో నూతన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసేందుకు తన వంతుగా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. రాజనీతిశాస్త్రంలో విలువైన, అరుదైన పుస్తకాలను అందచేస్తామని అన్నారు. రాజనీతి శాస్త్రాన్ని సైద్ధాంతిక అచరణ చేయడంతో పాటు.. ప్రభుత్వ వ్యవస్థల పట్ల అవగాహన పెంచుకునేందుకు దోహదపడుతోందని అన్నారు. రాజనీతిశాస్త్ర విద్యార్థులు సమాజంలో మంచి రాజకీయ కార్యక్రమాలు రూపొందిస్తారని అన్నారు. అలాగే ప్రభుత్వ విధాన రూపకల్పలోనూ మంచి భాగస్వామ్యం వహిస్తారని ఉద్బోధించారు సమాజ శాస్త్రాలతోనే మానవ వికాసం జరుగుతోందని అన్నారు. కేయూ రాజనీతిశాస్త్ర విభాగంలో రిసెర్చ్ డెవలప్ కోసం అవసరమైన సహకారం అందచేస్తామని హామీ ఇచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మాట్లాడుతూ.. వర్సిటీ రాజనీతిశాస్త్రం విభాగంలో విలువైన మంచి పరిశోధనలు జరిగాయని అన్నారు. వర్సిటీకి మంచి పరిపాలన అధికారులను అందించిన కీర్తి రాజనీతిశాస్త్ర విభాగానికి ఉందన్నారు. రాజనీతి శాస్త్ర సిలబస్‌లో నూతన అంశాలను జోడించాలని, మంచి పరిశోధనలు రావాలని చెప్పారు. ఓటర్స్ పోల్స్, పీపుల్స్ పల్స్, పీపుల్ బిహేవియర్, ఎంపాయీబులిటీ పెంచే విధంగా చూడాలని అన్నారు. విభాగంలో ఐటీసీ క్లాస్ రూమ్‌ను అభివృద్ధి చేసుకోవాలని కోరారు.

ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. రాజనీతిశాస్త్ర విభాగం ఎందరికో మార్గదర్శనం చేసిందన్నారు. నాణ్యమైన పరిశోధనలు రావాలని అకాంక్షించారు. విద్యార్థులు సామాజిక రుగ్మతలను పారదోలడంతో ముందుండాలని పిలుపునిచ్చారు. ఏసీపీ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సబ్జెక్టుపై శ్రద్ధ వహిస్తే పట్టు లభిస్తుందని, దీంతో జీవితంలో స్థిరపడవచ్చునని పేర్కొన్నారు. రాజనీతిశాస్త్ర విభాగంలో సెమినార్ హాల్‌లతో పాటు, జాతీయ యువత నిరాశ దృక్పథాన్ని వీడి ముందుకు సాగాలని చెప్పారు. రాజనీతిశాస్త్ర విభాగం రిటైర్డు ప్రొఫెసర్ జి.వీరన్ననాయక్ మాట్లాడుతూ.. యువత పేటూ సొసైటీ మోటోతో పనిచేయడం అభినందనీయమని చెప్పారు. రాజనీతిశాస్త్ర విభాగాభివృద్ధికి రూ.50వేలు విరాళం ప్రకటించారు. రిటైర్డు ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ సీహెచ్ దినేశ్‌కుమార్ మాట్లాడుతూ.. రాజనీతి శాస్త్ర విభాగంలో పరిశోధనల్లో నాణ్యత పెరగాలని, మంచి దృక్పథంలో పనిచేయాలని చెప్పారు. రిటైర్డు ప్రొఫెసర్ పి.హరిప్రసాద్ మాట్లాడుతూ.. రాజనీతిశాస్త్ర విభాగంలో మరిన్ని సమావేశాలను నిర్మాణాత్మకంగా ఏర్పాటు చేయాలని అన్నారు. రాజనీతిశాస్త్ర విభాగం పూర్వ విద్యార్థులైన కార్పొరేటర్ డాక్టర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, డాక్టర్ బానోతు సారంగపాణి, డోలి సత్యనారాయణ విభాగాభివృద్ధికి విరాళాలు ప్రకటించారు.

ఈ సందర్భంగా అతిథులైన రియాజ్, మల్లారెడ్డి, రిటైర్డు ప్రొఫెసర్ రఘురాంరెడ్డి, వీరన్ననాయక్, దినేశ్‌కుమార్, రామచంద్రం, విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్‌లను శాలువా, పుష్పగుచ్ఛంతో విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో రాజనీతిశాస్త్ర విభాగం బీవోఎస్ చైర్మన్ డాక్టర్ జి.కృష్ణయ్య, అధ్యాపకులు డాక్టర్ వడ్డెపల్లి నాగరాజు, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ సోమలింగం, డాక్టర్ తాళ్లపల్లి సంజీవ్, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ భాగ్యమ్మ, డాక్టర్ ఆకుపల్లి మధు, మాధవి, డాక్టర్ అడెపు రమేశ్‌తో పాటు రాజకీయ ప్రముఖులు, డాక్టర్ శ్రీరామ్ శ్యామ్, రాజనీతిశాస్త్ర విభాగం అలుమ్నీ 1986-2024 బ్యాచ్‌ల విద్యార్థులు పాల్గొన్నారు.


పాల్గొన్న రాజనీతి శాస్త్ర పూర్వ విద్యార్థులు

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి..

మానవ హక్కుల వేదిక నేతల డిమాండ్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 22: ఇటీవల అత్యున్నత సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు రాష్ట్రంలో వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేసి ఫలాలను అందేలా చూడాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.హరికృష్ణ, జిల్లా జనరల్ సెక్రటరీ దిలీప్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం కేయూ దూరవిద్య కేంద్రంలోని ప్రొఫెసర్ జాఫర్ నిజాం సెమినార్ హాల్‌లో మానవ హక్కుల వేదిక వరంగల్ జిల్లా కమిటీ నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మానవ హక్కుల వేదిక నాయకులు హరికృష్ణ, దిలీప్, ఎమ్మార్పీఎస్ నేత మంద కుమార్, ప్రజా సంఘాల నేతలు డాక్టర్ తిరుణహరి శేషు, డాక్టర్ జిలుకర శ్రీనివాస్‌లు హాజరై మాట్లాడారు. 30 ఏళ్ల ఎస్సీ వర్గీకరణ పోరాటంలో సుప్రీం కోర్టు విస్పష్టమైన తీర్పు ఇచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలపై పెట్టిందన్నారు. ఎస్సీ వర్గీకరణ తీర్పును స్వాగతించారు. అనంతరం సమావేశంలో పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎస్సీ వర్గీకరణను కాలపరిమితితో చేపట్టేందుకు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్‌ను ప్రకటించాలని, కుల గణన చేపట్టాలని, 50 శాతం రిజర్వేషన్ల కోటాను ఎత్తివేసి జనాభా ప్రతిపాతికగా అమలు చేయాలని డిమాండ్‌లు పెట్టారు. ప్రమోషన్లతో రిజర్వేషన్లు ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీలకు అమలు చేయాలని, ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని, క్రిమిలేయర్‌ను నిబంధనలను రద్దు చేయాలని తీర్మాణించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాదావత్ రాజు, హరికృష్ణ, అద్దునూరి యాదగిరి, వి.దిలీప్, రిటైర్డు ప్రొఫెసర్ ఎర్రగుట్టు స్వామి, వీసీకే పార్టీ అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శులు సంఘం నాయకులు సురేశ్, వెంకటనారాయణ జి.పద్మజ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రియాంక, ఉపాధ్యాయ సంఘం నేత నన్నెబోయిన తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టి.హరికృష్ణ

బాలికపై అత్యాచారం

పోక్సో కేసు నమోదు


బచ్చన్నపేట, సెప్టెంబరు 22: జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న శివారు గ్రామంలో మైనర్ (14) బాలికపై అదే గ్రామానికి చెందిన పి.ప్రవీణ్ అనే యువకుడు అత్యాచారం జరిపినట్టు బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాలికను జనగామ సఖీ సెంటర్‌కు పంపి, అత్యాచారానికి కారణమైన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్టు తెలిసింది. కాగా, అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాల నాయకురాళ్లు కోరుతున్నారు.

రామప్ప ఉపాలయంలో తవ్వకాలు


● శివలింగాన్ని పాక్షికంగా ధ్వంసం చేసిన దుండగులు ● గుప్తనిధుల కోసమే అనే అనుమానాలు


ధ్వంసమైన గొల్లాలగుడి పైకప్పు

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 22: యునెస్కో గుర్తింపు పొందిన ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప ఆలయం సమీప ఉపాలయం గొల్లాలగుడిలో తవ్వకాలు జరిగాయి. ఈ సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. గుర్తుతెలియని వ్యక్తులు గుడి గోపురం పైభాగంలో ఉన్న కట్టడం కొంతభాగాన్ని తొలగించి లోపలికి దిగారు. శివలింగం చుట్టూ తవ్వకాలు చేపట్టారు. దీంతో శివలింగం పాక్షికంగా ధ్వంసమైంది. ఆదివారం ఉదయం పురావస్తుశాఖ సిబ్బంది ఆలయాన్ని శుభ్రం చేస్తుండగా ఇది వెలుగులోకి వచ్చింది. గుప్త నిధుల కోసమే దుండగులు ఈ తవ్వకాలు జరిపినట్టు అనుమనాలు వ్యక్తమవుతున్నాయి. శివలింగం చుట్టూ గొయ్యి తీసి ఉండటం, పైకి ఎక్కి బయటకు రావడానికి దుండగులు నిచ్చెనను ఉపయో గించడాన్ని ఆలయ సిబ్బంది గుర్తించారు. రామప్ప ప్రధాన ఆలయానికి 20 ఉపాలయాలు ఉన్నాయి. సరస్సుకు వెళ్లే దారిలో ఎడమవైపు ఉన్న గొల్లాలగుడి వీటిలో ప్రధానమైంది. దీని 500 మీటర్ల దూరంలో ఈ గుడి ఉంది. ఈ తవ్వకాల ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపడు తున్నామని వెంకటాపూర్ ఎస్సై జక్కుల సతీష్ తెలిపారు.


రామప్ప ఉపాలయం గొల్లాలగుడిలో తవ్వకాలు జరిగిన ప్రదేశంలో ఉన్న శివలింగం

ఫాతిమా చర్చిలో కేంద్ర మంత్రి ప్రార్థనలు



హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 22: కేంద్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, ఫిషరిస్, మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్ ఆదివారం కాజీపేట ఫాతిమానగర్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా భారతీయ రోమన్ కాథలిక్ పీఠాధిపతి ఉడుముల బాల, చర్చి ఫాదర్ కాసు మారెడ్డి, చర్చ్ కౌన్సిల్ ప్రెసిడెంట్ దయాసాగర్, సెక్రెటరీ టామీ, కౌన్సిల్ సభ్యులు కేంద్ర మంత్రిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, బీజేపీ జిల్లా నాయకులు అమర్నాథ్‌రెడ్డి, సత్యనారాయణ, మధుసూదన్‌రావు, గాదె రాంబాబు, మామిడాల నరేందర్, బండి భాస్కర్, బత్తుల వినయ్, జన్ను మధు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్తకొండకు ఎమ్మెల్సీ కోదండరామ్ రాక

భీమదేవరపల్లి, సెప్టెంబరు 22: మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయానికి ఎమ్మెల్సీ కోదండరాం సోమవారం రానున్నట్లు మండల జేఏసీ చైర్మన్ డ్యాగల సారయ్య తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇనుపరాతి గుట్టల పరిరక్షణ యాత్ర సందర్భంగా వీరభద్రస్వామి ఆలయానికి వచ్చి ప్రత్యేక రాష్ట్రం సిద్ధించాలని వీరభద్రస్వామికి మొక్కు కట్టారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత వీరభద్రస్వామికి కట్టిన ముడుపును విప్పేందుకు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం వస్తున్నట్లు పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ ఉద్యమకారులు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి, కో-ఆర్డినేటర్ నేతల వీరన్నయాదవ్, కో-కన్వీనర్లు చెప్యాల ప్రభాకర్, చెప్యాల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బన్న ఐలయ్య

ఎస్సీ వర్గీకరణను పునఃపరిశీలించాలి

» ఒక వర్గంవైపే మొగ్గు చూపుతున్న బీజేపీ » ప్రొఫెసర్ ఐలయ్య

కాజీపేట, సెప్టెంబరు 22: ఎస్సీ వర్గీకరణను బీజేపీ ఒక వర్గంవైపే మొగ్గు చూపుతున్న తీరు బాధాకరణమని, ఈ వర్గీకరణను కేంద్ర ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలని ప్రొఫెసర్ బన్న ఐలయ్య డిమాండ్ చేశారు. వర్గీకరణకు వ్యతిరేకంగా వచ్చేనెల 20న హనుమకొండలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కాజీపేట శివాలయ హాల్‌లో ఆదివారం తేజోమై మాలకుల సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో సభ సన్నాహక సమావేశం జరిగింది. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రొఫెసర్ బన్న ఐలయ్య, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య మాట్లాడారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, కానీ కుల ప్రతిపాదికన పూర్తిపరిశీలన జరిపిన తర్వాతనే తుది తీర్పు ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. ఈ తీర్పు మాలల మనోభావాలను దెబ్బతీసే విధంగా, మాలలకు హానికలిగించే విధంగా ఉందన్నారు. సంఘం అధ్యక్షుడు మర్యాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి బండి విజయ్ కుమార్, ఆధ్వర్యంలో జరిగిన ఈ సన్నాహక సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోంద్ర నర్సింగరావు, నక్క సుదర్శన్, సీహెచ్ కొమ్మాలు, సత్యనారాయణ, జి. కుమారస్వామి, జంగం బాబురావు, పప్పుల గోవర్ధన్, బొట్టు రాజు, ఏ. రామ్ చందర్, డి. రాజేశ్వర్ రావు, ఏ. అనిల్ కుమార్, వేణు పాల్గొన్నారు.

వాగ్దేవి ఫార్మసీలో గ్రాడ్యుయేషన్ డే

హనుమకొండ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ రాంనగర్‌లోని వాగ్దేవి విద్యా సంస్థల ఆధ్వర్యంలోని వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాల స్నాతకోత్సవం గ్రాడ్యుయేషన్ డే -2024 ఆదివారం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చల్లా శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫార్మసిస్టులు, ఫార్మా ఇండస్ట్రీ, క్లినికల్ ఫార్మసీ విభాగాల్లో పని చేసేవారు అప్రమత్తంగా, బాధ్యతగా విధులు నిర్వహించాలని, అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాక్షించారు. కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ డాక్టర్ సీహెచ్ దేవేందర్ రెడ్డి, అకాడమీ డైరెక్టర్ డాక్టర్ వాహినీదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరెడ్డి, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, డాక్టర్ వై.శ్రవణ్ కుమార్, డాక్టర్ ఈ.వెంకటేశ్వర్లు, డాక్టర్ బీఎస్ శరవణ భవ, డాక్టర్ డి.కుమారస్వామి, డాక్టర్ సీహెచ్ మహేష్, ప్రొఫెసర్లు డాక్టర్ ఎస్.పావని, డాక్టర్ పి. గిరిజ, డాక్టర్ ఎం.మాధవి, డాక్టర్ లక్ష్మీ కల్యాణి, టి. రజనీ, కె.రాగిణి, ఎం.శృతి, సుమలత తదితరులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డేలో పట్టాలు అందుకున్న విద్యార్థులతో అతిథులు

భౌభౌలతో భయం.. భయం..

» 9వ డివిజన్‌లో గర్జిస్తున్న గ్రామసింహాలు
» బెంబేలెత్తుతున్న స్థానికులు, వాహనదారులు
» పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబరు 22: హనుమకొండ 9వ డివిజన్ పరిధిలోని గణేషనగర్‌కాలనీ రోడ్-1, 2, ఓంసాయికాలనీ, ఇందిరానగర్, రాయపుర ప్రాంతాలలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో చిన్నా, పెద్ద, వృద్ధులు ఇంటి నుంచి కాలు బయట పెట్టాలంటే జంకుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా కాలనీలోని కుక్క కాట్లు పెరిగిపోతున్నాయి. చిన్న పిల్లలను పాఠశాలలకు తీసుకెళ్లాలంటే ఎక్కడి నుంచి కుక్కలు వచ్చి దాడిచేస్తాయోనని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన, అంతర్గత రోడ్ల వెంట వెళ్లే బాటసారులు, వాహనాదారులను శునకాలు కాపు కాచి మరీ వెంబడిస్తూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. సాయంత్రం వేళల్లో కుక్కలు పలు కాలనీలో గుంపులు గుంపులుగా సంచరిస్తూ పెద్దఎత్తున మొరగడంతో నిద్రలేని రాత్రులు గడపుతున్నామని వాపోతున్నారు. దాడులు జరిగిన సమయంలో తూతూ మంత్రంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు వచ్చి.. కుక్కలను పట్టిస్తామని చెప్పడం తప్ప. అది పూర్తి స్థాయిలో అచరణలో పెట్టడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధింత అధికారులు, సిబ్బంది కుక్కల బెడదను నియంత్రించి కాలనీ వాసులకు ఉపశమనం కల్పించాలని వేడుకుంటున్నారు.

పిల్లలను బయటకు పంపాలంటే భయమేస్తోంది..



వీధి కుక్కల భయానికి కాలు బయట పెట్టడానికి జంకుతున్నాం. కాలనీలో కుక్కలు పెద్ద ఎత్తున గుంపులు గుంపులుగా తిరగడంతో అటుగా వెళ్లాలంటే ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నాం. గతంలో ప్రధాన రోడ్డు మార్గంలో వెళుతున్న వాహనాల వెంట కుక్కలు పరుగులు పెడుతున్న కారణంతో వాహనాదారులు అదుపుతప్పి ప్రమాదాలు బారిన పడిన సందర్భాలున్నాయి. ఒక్కోసారి ఇళ్లలోకి చొరబడి దాడులకు తెగబడుతున్నాయి. దీనిపై ప్రజాప్రతినిధులకు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతోంది.

రావుల కుమారస్వామి, స్థానికుడు

కుక్కల బెడద నుంచి కాపాడాలి..



కాలనీల్లో ఎక్కడికి వెళ్లినా గుంపులు గుంపులుగా కుక్కలు కనిపించడంతో భయపడాల్సి వస్తోంది. ప్రధాన రోడ్డు గుండా ప్రయాణించే వారి వాహనాల వెనుకాల శునకాలు పరుగెత్తుతూ భయ భ్రాంతులకు గురి చేస్తున్నాయి. పిల్లలు, మహిళలు వృద్ధులు బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. కుక్కల బెడదపై గతంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేయడంతో జీడబ్ల్యూఎంసీ సిబ్బంది వచ్చి ఒకట్రెండు కుక్కలను పట్టుకున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలి.

ఆలేటి శంకర్, గణేష్‌నగర్ కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి



9వ డివిజన్‌లో రోడ్లపై గుంపులుగా తిరుగుతున్న శునకాలు

నిరుపయోగంగా టెలిఫోన్ భవనం

» ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు
» పందులకు ఆవాసం.. మందుబాబులకు అడ్డా
» వినియోగంలోకి తేవాలని ప్రజల విజ్ఞప్తి



గోపాల్‌పూర్‌లో చెట్ల పొదల్లో నిరుపయోగంగా ఉన్న టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ భవనం

వడ్డెపల్లి, సెప్టెంబరు 22: గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వెనుక ఉన్న టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ భవనం దశాబ్దంన్నర కాలంగా నిరుపయోగంగా ఉంటోంది. భవనం ఆవరణ ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందనే విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. గోపాల్‌పూర్‌లో 1984లో అప్పటి సర్పంచ్ కందుకూరి కాంతయ్య భవనం నిర్మించి టెలిఫోన్ అధికారులకు అప్పగించారు. టెలిఫోన్ శాఖ అధికారులు భవనంలో టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌ని ఏర్పాటు చేశారు. మూడు దశాబ్దాల పాటు ప్రజలకు నిర్విరామంగా సేవలందించిన ఈ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ భవనం 15ఏళ్లుగా మూత పడి ఉంటోంది. అప్పటి నుంచి నిరుపయోగంగానే భవనం ఉంటోంది. దీని ఆవరణలో పిచ్చి మొక్కలు, కంప చెట్లు ఏపుగా పెరిగి పందులకు విడిదిగా మారింది. కంపచెట్లతో భవనం పూర్తిగా కనిపించడం లేదు. దీంతో రాత్రి వేళల్లో భవనం ఆవరణ మందుబాబులకు నిల యంగా మారుతోంది. తాగిపడేసిన మద్యం బాటిళ్లు అక్కడ దర్శనమిస్తున్నాయి. ఈ భవనాన్ని నగర పాలకసంస్థ అధికా రులు స్వాధీనపర్చుకొని కమ్యూనిటీహాల్ కోసం కేటాయిం చాలని గోపాల్‌పూర్‌తోపాటు పరిసర కాలనీల ప్రజలు కోరుతున్నారు.

ఉపయోగంలోకి తేవాలి..



15 ఏళ్లుగా నిరుపయోగంగా ఉంటున్న టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ భవనాన్ని ఉపయోగంలోకి తేవాలి. భవనం ఆవరణంలోని పిచ్చి మొక్కలు, కంపచెట్లను వెంటనే తొలగించాలి. సమాజ హిత కార్యక్రమాలకు ఈ భవనం దోహదపడే విధంగా నగర పాల క సంస్థ అధికారులు చర్యలు చేపట్టాలి.

కందుకూరి రజనీకాంత్, గోపాల్‌పూర్

నిందితులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 22: దళితుల శ్మశానవాటికను కూల్చిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. పెద్దమ్మగడ్డలో గోరిలను కూల్చిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. ఆదివారం శ్మశానవాటికలోని సమాధులను సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా బొట్ల చక్రపాణి మాట్లాడుతూ.. రోజు రోజుకూ నగరంలో భూ కబ్జాదారులు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారని అన్నారు. దళితులు ఎవరు మరణించినా ఈ స్థలంలో సమాధులు కట్టుకునేవారని, దీనిపై కబ్జాదారుల కన్నుపడి కబ్జాకు యత్నిస్తున్నారని, వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గాదె రమేశ్, మంద మల్లేశం, బొట్ల కుమారస్వామి, స్వయంకృషి మహిళా సంఘం నాయకులు తీగల శుభ భాగ్యమ్మ, రాధ, సుచరిత, అనిత, స్వప్న, తార, నవీన్, రవి, శ్యాం, సుమారు 50మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పెన్షన్ స్కీమ్‌పై ఓరియంటేషన్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 22: కాకతీయ యూనివర్సిటీలో జాతీయ పెన్షన్ స్కీమ్‌పై కేయూ అకూట్, ఎన్జీవోఎస్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం సంయుక్తంగా ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయా సంఘాల జనరల్ సెక్రటరీలు డాక్టర్ మామిడాల ఇస్తారి, వల్లాల తిరుపతి, పోలేపాక కోర్నేల్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేయూ క్యాంపస్‌లోని సెనెట్ హాల్‌లో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఓరియంటేషన్ ప్రోగ్రాంలో రిసోర్స్ పర్సన్‌గా ఏపీలోని రాజమండ్రికి చెందిన ఆదికవి నన్నయ్య వర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ ఎన్ ఉదయభాస్కర్ హాజరై కీలక ప్రసంగం చేస్తారని పేర్కొన్నారు. ఓరియంటేషన్ ప్రోగ్రాంకు కన్వీనర్లుగా అకూట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి, వల్లాల తిరుపతి, పోలేపాక కోర్నేల్‌లు వ్యవహరిస్తారు. ప్రోగ్రామ్‌కు అందరూ హాజరై విజయవంతం చేయాలని డాక్టర్ ఇస్తారి కోరారు.

నేడు కేయూ సెనెట్‌హాల్‌లో సింపోజియం

కేయూ ఎకానమిక్స్ విభాగం నేతృత్వంలో సెప్టెంబరు 23న సోమవారం ఉదయం 10 గంటలకు 'డెకోడల్ డెవలప్‌మెంట్ ఆఫ్ తెలంగాణ స్టేట్- ఇష్యూష్ అండ్ చాలెంజెస్' అనే అంశంపై సింపోజియం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలోఆర్థశాస్త్ర విభాగాధిపతి, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ అధ్యక్షత వహి స్తారు. సింపోజియంలో ముఖ్యఅతిథిగా ప్రముఖ సామాజిక వేత్త, సెంట్రల్ వర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్ జి.హరగోపాల్, స్పెషల్ గెస్టుగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.కోదండరామ్, కీలక ఉపన్యాసకులుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సి టీ అర్థికశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డి.నర్సింహరెడ్డి, కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డిలు పాల్గొననున్నారు.

వాయుపుత్ర పరపతి సంఘం అధ్యక్షుడిగా సందీప్



హసన్‌పర్తి, సెప్టెంబరు 22: హసన్‌పర్తి పద్మశాలి పరపతి సంఘం అధ్యక్షుడిగా కోడం సందీప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం వాయుపుత్ర పద్మశాలి భవన్‌లో 9వ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోడం సందీప్, ఉపాధ్యక్షులుగా చెన్నూరి శ్రీనివాస్, దుంపటి నరేంద్రబాబు, ప్రధాన కార్యదర్శులుగా కోడం నాగరాజు, గుండా యుగంధర్, కోశాధికారిగా నల్ల గోపి, కోడం శ్రీధర్, గౌరవ అధ్యక్షుడిగా నల్లసత్యనారాయణ, సలహాదారులుగా నల్ల సుదర్శన్, కందకట్ల కుమారస్వామి, నల్ల రాజు, డైరెక్టర్లుగా రాజేశ్వర్ రావు, చంద్రమోహన్, శివకుమార్, ఉమామహేష్‌లు ఎన్నికైనట్లు కమిటీ ప్రకటించింది.

నేడు బల్దియాలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 22: నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం నేడు జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే తెలిపారు.

కేయూ ఆకట్టుకుంటున్న గ్రీనరీ



పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఆహ్లాదంగా ఉన్న గ్రీనరీ

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 22: కేయూలోని మానవీయ శాస్త్ర భవనం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, మానవ వనరుల నిర్వహణ విభాగం అహ్లాదాన్ని పంచుతోంది. కేయూపబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంహెచ్‌ఆర్ఎం విభాగాధిపతి పెదమల్ల శ్రీనివా సరావు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులందరూ కలిసి సొంత డబ్బులతో గ్రినరీ చుట్టూ గ్రిల్స్, ఇనుప కంచెను నిర్మించారు. వాకర్స్‌తో పాటు పశువులు, ఇతరుల నుంచి మొక్కలకు రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశారు. సమాజ శాస్త్ర అధ్యాపకులు, విద్యా ర్థులు ప్రకృతి ప్రేమికులుగా మారి అదర్శంగా నిలుస్తున్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గ్రహణం

» 244 గజాల ప్రభుత్వ భూమి కేటాయింపు
» గతంలో రూ.15 లక్షల నిధులూ మంజూరు
» ఆధిపత్య పోరుతో ఆగిపోయిన నిర్మాణం

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 22: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 54వ డివిజన్ ప్రజల కోసం పోచమ్మకుంటలోని సర్వే నెంబర్ 71లో ఉన్న ప్రభుత్వ భూమిలో 2017 సంవత్సరంలో తలపెట్టిన కమ్యూనిటీ హాల్‌నిర్మాణానికి రాజకీయ గ్రహణం పట్టింది. 7 యేళ్లు అయినప్పటికీ నిరుపయోగంగా స్లాబ్‌తోనే దర్శనమిస్తోంది. డివిజన్ ప్రజల ఆకాంక్ష మేరకు గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ సర్వే నెంబర్ 71లో ఉన్న ప్రభుత్వ భూమిని కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించాలని అప్పటి జిల్లా కలెక్టర్‌కు లేఖరాయగా, పోచమ్మకుంటలోని పోచమ్మదేవాలయం వెనుకాల 244 గజాల స్థలాన్ని కలెక్టర్ కేటాయించారు. స్థల కేటాయింపు తర్వాత ఎమ్మెల్యే తన నిధులు కింద రూ.5లక్షలు కేటాయించగా పనులు ప్రారంభించే సమయంలో డివిజన్‌లోని కొంతమంది రాజకీయ నాయకుల అధిపత్య పోరుతో నిర్మాణం ఆగిపోయింది. స్థానికుల చొరవతో అప్పటి స్థానిక ప్రజాప్రతినిధి తనకు అనుకూలంగా ఉన్న వ్యక్తితో స్లాబ్ వేయించాడు. తర్వాత ఫస్ట్‌ఫ్లోర్ గోడల నిర్మాణంతోపాటు రెండో అంతస్థు స్లాబ్ నిర్మాణానికి రూ.10 లక్షల నిధులతో పనులు ప్రారంభించడానికి సిద్ధమవుతుండగా తిరిగి అదే తరహాలో రాజకీయ అధిపత్యం కోసం కొంత మంది రంగప్రవేశం చేసి పనులను అడ్డుకోవడంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం స్లాబ్‌తోనే నిలిచిపోయింది. దీంతో రెండో అంతస్థు కోసం వచ్చిన నిధులు వెనక్కి వెళ్లిపోయినట్లు డివిజన్‌వాసులు పేర్కొంటున్నారు.

కాగా, ప్రస్తుత కార్పొరేటర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణంపై దృష్టి సారించకపోవడంతో ఓ కుటుంబం బోరు వేసుకొని స్లాబ్ వేసిన స్థలాన్ని సొంత పనులకు వినియోగించుకుంటోందని డివిజన్‌వాసులు ఆరోపిస్తున్నారు.. డివిజన్‌లోని మహిళ సంఘాలు నెలనెలా సమావేశాలు నిర్వహించుకోవడంతోపాటు ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడానికి అనుకూలంగా ఉండే కమ్యూనిటీ హాల్ నిర్మాణం పునరుద్ధరణ జరిగేలా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి కమ్యూనిటీ హాల్‌ను డివిజన్‌వాసులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.




స్లాబ్ వరకు నిర్మించి వదిలేసిన కమ్యూనిటీ హాల్

టీచర్ల సర్దుబాటు జీవోను ఉపసంహరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ తిరుపతి

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 22: టీచర్ల సర్దుబాటు జీవో విద్యా ప్రైవేటీకరణ కుట్రలో భాగమేనని, ప్రభుత్వం ఆ జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని జిల్లా కార్యాలయంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. ప్రభుత్వం టీచర్ల సర్దుబాటు చేయాలంటూ కలెక్టర్లకు ఇచ్చిన ఉత్తర్వులు అశాస్త్రీయంగా, అసంబద్ధంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామంటున్న ప్రభుత్వం.. ప్రైవేటీకరణ కోసం అడుగులు వేస్తుందని ఆరోపించారు. జీవో నెంబరు 25ను హేతుబద్ధీకరణ జీవోగా ఆయన అభివర్ణించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యరంగాలైన విద్య, వైద్యాన్ని విస్మరిస్తున్నాయని విమర్శించారు. ప్రపంచ బ్యాంకు విధానాలను అమలు చేస్తూ మెప్పు పొందడానికి ప్రభుత్వం జీవోను తెరపైకి తెచ్చిందన్నారు. ప్రాథమిక పాఠశాలలో ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా నిబంధనలను సవరించాలన్నారు. విద్యాశాఖలో పేరుకుపోయిన ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. జీవోనెం. 25ను ఉపసంహరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శిగా ముత్యాల రఘుపతి, గోడిశాల సత్యనారాయణ, నాయకులు సుబ్బారావు, జయప్రకాశ్, రమేష్, లక్ష్మయ్య, కుమారస్వామి, భాస్కర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ధర్మసాగర్, సెప్టెంబరు 22: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ధర్మసాగర్ మండల నారాయణగిరి హైస్కూల్‌లో ఆదివారం జరిగింది. పాఠశాలలో 1982-1983 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు పూర్వ గురువులైన నర్సింహారెడ్డి, మధుసూదన్‌రావు, జనార్దన్‌రెడ్డి, రమాజ్యోతి, కృష్ణ, రామచంద్రం, శ్రీనివాస్‌రెడ్డిలను శాలువాలు, పూలమాలలతో పూర్వ విద్యార్థులు సన్మానించారు. 41 సంవత్సరాలు తర్వాత ఒకే వేదిక పై కలుసుకొని పాఠశాలలో చదివిన రోజుల్లో జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకుని సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యా ర్థులు రాజేశ్వర్‌రెడ్డి, వెంకటస్వామి, రవి, రమేష్ ప్రకాష్‌రెడ్డి, బాపురెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం • 23 సెప్టెంబరు 2024
features@andhrajyothy.com



బుకర్ ప్రైజ్... ఆంగ్ల సాహిత్యంలో ప్రతిష్టాత్మక పురస్కారాల్లో ఒకటి. దీనికి షార్ట్‌లిస్ట్ అయ్యే వారిలో ప్రతిసారీ పురుషులే ఎక్కువ. ఈ ఏడాది మాత్రం... ఎంపికైన ఆరుగురిలో అయిదుగురు రచయిత్రులే. యాభై అయిదేళ్ల 'బుకర్' చరిత్రను తిరగరాసిన ఆ మహిళలు ఎవరంటే...

బుకర్ బరిలో... అతివలు అయిదుగురు

సమంతా హార్వే

వయసు: 49 | దేశం: బ్రిటన్

బుకర్‌కు ఎంపికైన రచన: ఆర్బిటాల్



సమంతా రచనా శైలిని ప్రముఖ రచయిత్రి వర్జీనియా ఉల్ఫ్‌తో పోలుస్తారు అభిమానులు. ఆమె రాసిన అయిదు నవలలు అటు పాఠకుల నుంచి, ఇటు విమర్శకుల నుంచి అద్భుతమైన ఆదరణ పొందాయి. ఆమె 'యూనివర్సిటీ ఆఫ్ యార్క్', 'యూనివర్సిటీ ఆఫ్ షెఫీల్డ్'లో ఫిలాసఫీ చదివారు. కవితాత్మకమైన వచనం ఆమె ప్రత్యేకత. మానవ మనస్తత్వం గురించి లోతైన విశ్లేషణలు ప్రధానంగా ఉంటాయి. సమంతా రచనలు పన్నెండుకు భాషల్లో అనువాదమయ్యాయి. వాటికి పలు పురస్కారాలు దక్కాయి. "అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న ఆరుగురు వ్యోమగాముల చుట్టూ ఇది తిరుగుతుంది. 'భూమిలేని జీవితం ఏవిటి? మానవాళి లేని భూమి ఏమిటి?' అని ఆ వ్యోమగాములు ఆలోచించడం ప్రారంభిస్తారు. భూమి దిగువ కక్ష్యలో మానవులు నివాసం ఏర్పరచుకోవడం గురించి రాయాలని పాతికేళ్ళుగా అనుకుంటున్నాను. అయితే సైన్స్‌ఫిక్షన్‌గా కాదు, వాస్తవికత ఉట్టిపడేలా. అందరూ నివసించాలని కోరుకొనే ఒక ప్రదేశం సౌందర్యాన్ని ఒక ప్రకృతి రచయిత మాదిరిగా కళ్ళకు కట్టేలా చెప్పగలనా? ఇవీ నా ఆలోచనలు. ఈ రచన 'బుకర్' పరిశీలనలో ఉన్నందుకు సంతోషంగా ఉంది" అంటూ 'ఆర్బిటల్' నేపథ్యం గురించి చెప్పుకొచ్చారు. సమంతా.

అన్నే మైఖేల్స్

వయసు: 66 | దేశం: కెనడా

బుకర్‌కు ఎంపికైన రచన: హెల్డ్



ఇరవయ్యేనిమిదేళ్ళ కాలంలో అన్నే మైఖేల్స్ రాసినవి మూడే నవలలు. మొదటి నవల 'ఫ్యూజిటివ్ పీసెస్'కు అక్షరాలా పన్నెండు పురస్కారాలు వచ్చాయి. రెండో నవల 'వింటర్ వాలెట్'కూ అద్భుతమైన ఆదరణ దక్కింది. ఆ తరువాత పద్నాలుగేళ్ళకు... తన మూడో నవల 'హెల్డ్'తో మళ్ళీ సంచలనం సృష్టిస్తున్నారామె. అన్నే కేవలం నవలాకర్త మాత్రమే కాదు... గొప్ప కవయిత్రి. కవితా రచనను ప్రారంభించిన తొలి రోజుల్లోనే ఆమె వెలువరించిన తొలి సంకలనం 'ది వెయిట్ ఆఫ్ ఆరెంజెస్'ను 'కామన్వెల్త్ పొయెట్రీ ప్రైజ్ ఫర్ ది అమెరికాస్' పురస్కారం వరించింది. ఆ తరువాత వరుసగా ప్రచురితమైన మరో ఆరు కవితా సంకలనాలు... ఆస్ట్రేలియాలో అత్యుత్తమ కవయిత్రుల్లో ఒకరిగా ఆమెను నిలబెట్టాయి. మఆమె రచనలు, వాటి అనువాదాలు 45కు పైగా దేశాల్లో ప్రచురితమయ్యాయి. ఈ ఏడాది 'బుకర్ ప్రైజ్'కు షార్ట్‌లిస్ట్ అయిన 'హెల్డ్' నవల... నాలుగు తరాల జీవిత సమాహారం. "ఆ నవల రాస్తున్నంత కాలం... 'ఈ అత్యవసరమైన సమయాల్లో... వినలేనంత చిన్నదైనా సరే... ఎలాంటి స్వరం మనకు అవసరం?' అని ప్రతి రోజూ నన్ను నేను ప్రశ్నించుకున్నాను. దానికి అనుగుణంగానే కథా నేపథ్యాన్ని, శైలిని ఎంచుకున్నాను" అంటూ 'హెల్డ్'ను రాయడం వెనుక తన ఆలోచనలను అన్నే పంచుకున్నారు.

రాచెల్ కుష్నర్

వయసు: 55 | దేశం: అమెరికా

బుకర్‌కు ఎంపికైన రచన: క్రియేషన్ లేక్

అయిదేళ్ళ వయసులో... అమ్మ చెయ్యి పట్టుకొని బుక్ స్టోర్స్‌లో బిడియంగా అడుగుపెట్టిన రాచెల్ కుష్నర్‌కు బాల్యం నుంచే పఠనం ప్రధాన ఆసక్తిగా మారింది. 'పొలిటికల్ సైన్స్-ఫారిన్ పాలసీ'లో బ్యాచిలర్ డిగ్రీ చదివారు. ఆ తరువాత స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లో ఇటలీకి వెళ్ళి 'బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్' పూర్తి చేశారు. కొలంబియా యూనివర్సిటీలో క్రియేటివ్ రైటింగ్‌లో 'మాస్టర్ ఆఫ్ ఫైనార్ట్స్' డిగ్రీ తీసుకున్నారు. చదువుకొనే రోజుల్లోనే సంపాదన కోసం నైట్ క్లబ్‌లో క్లర్క్‌గా పని చేశారు. అనంతరం న్యూయార్క్‌లో ఎనిమిదేళ్ళు పాత్రికేయురాలిగా ఉన్నారు. 'గ్రాండ్ స్ట్రీట్' తదితర పత్రికలకు ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ సమయంలోనే కళారంగంపై రాచెల్ రాసిన వ్యాసాలు ఆమెకు మంచి గుర్తింపు తెచ్చాయి. 2008లో విడుదలైన 'టెలెక్స్ ఫ్రమ్ క్యూబా' ఆమె మొదటి నవల. 1967లో జరిగిన 'ఆరు రోజుల (అరబ్-ఇజ్రాయెల్) యుద్ధం' యాభయ్యో వార్షికోత్సవం సందర్భంగా... ఇజ్రాయిల్ ఆక్రమణపై ఒక పుస్తక ప్రచురణకు నిర్ణయించిన 'బ్రేకింగ్ ది సైలెన్స్' సంస్థ తరఫున 2016లో ఇజ్రాయెల్ వెళ్ళారు. ఆ సందర్శన తన దృక్పథంలో అనేక మార్పులు తీసుకువచ్చిందని ఆమె చెబుతారు. ఇప్పటివరకూ ఆమె ఏడు నవలలు రాశారు. తాజా నవల 'క్రియేషన్ లేక్'... 'బుకర్ ప్రైజ్'కు షార్ట్‌లిస్ట్ అయింది. సీక్రెట్ ఏజెంట్ అయిన ముప్పై నాలుగేళ్ళ అమెరికన్ మహిళ ప్రధాన పాత్రగా ఈ కథ నడుస్తుంది. "ఫ్రాన్స్ రాజధాని పారిస్ నుంచి ఆ దేశంలోని గ్రామీణ ఔట్‌పోస్ట్‌కు వెళ్లే యువకుల బృందం గురించి నేను చాలా కాలంగా ఒక కథ చెప్పాలనుకున్నాను. అదే సమయంలో పూర్వ చరిత్ర మీద నాకు ఆసక్తి కలిగింది.. 'మనం ఎక్కడికి వెళ్తున్నాం? ఎక్కడున్నాం?' అనే ప్రశ్న మనం వేసుకోవాలి. ఆ ప్రశ్న వేసుకోడానికి ప్రతి రోజూ సరైన తరుణమే అనుకుంటాను. ఈ సంఘర్షణను ప్రతిఫలించే స్పై థ్రిల్లర్... క్రియేషన్ లేక్" అంటూ తన రచన గురించి వివరించారు



ఛార్లెట్ వుడ్

వయసు: 59 | దేశం: ఆస్ట్రేలియా

బుకర్‌కు ఎంపికైన రచన: స్టోన్ యార్డ్ డివోషనల్



పలు ప్రతిష్ఠాత్మకమైన బహుమతుల జాబితాలో తరచూ కనిపించే పేరు ఛార్లెట్ వుడ్. విమర్శకుల ప్రశంసలూ ఆమెకు కొత్త కాదు. కొన్ని పదుల అవార్డుల్ని గెలుచుకున్న ఆమెను 'సొంత గొంతు కలిగిన, ప్రేరణ కలిగించే ఆస్ట్రేలియన్ రచయితల్లో ఒకరు' అని 'ది ఆస్ట్రేలియన్' పత్రిక ప్రశంసించింది. క్రియేటివ్ ఆర్ట్స్‌లో మాస్టర్స్ డిగ్రీ అందుకొని, 'యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్'లో పిహెచ్‌డి చేసిన ఛార్లెట్ పాత్రికేయ వృత్తిలో కొన్నాళ్ళు ఉన్నారు. 'పీసెస్ ఆఫ్ ఎ గర్ల్'తో ఆమె రచనా వ్యాసంగం ప్రారంభమయింది. ఏడు నవలలతో పాటు కొన్ని కాల్పనికేతర రచనలు కూడా చేశారు. కిందటి ఏడాది ప్రచురితమైన 'స్టోన్ యార్డ్ డివోషనల్' నవల ఈ ఏడాది 'బుకర్ ప్రైజ్'కు షార్ట్‌లిస్ట్ అయింది. "ఈ నవలలోని అంశాలన్నీ నా జీవితం, బాల్యానికి సంబంధించినవి. వాటిని ఏకంతంగా గడిపే ఒక మత సమాజం గురించి నేను ఊహించుకున్న కథతో కలగలిపాను. ఈ నవలను కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో రాశాను. అప్పుడే నేను తీవ్ర అనారోగ్యం నుంచి బయటపడ్డాను. కొవిడ్, అస్వస్థత.. ఈ రెండూ మానసికంగా అనిశ్చితి కలిగించాయి. గందరగోళంలో నిశ్చలత్వాన్ని సాధించడంలో నైపుణ్యం పొందడానికి ప్రయత్నించాను. ముందే చెప్పినట్టు అందరికీ దూరంగా ఉండే ఒక మత సమాజంలో క్షమాగుణం, దుఃఖం, మహిళలతో స్నేహాల కోసం నిర్భయమైన అన్వేషణే ఈ నవల" అంటారు ఛార్లెట్.

యేల్ వాన్ డెర్ వూడెన్

వయసు: 37 | దేశం: నెదర్లాండ్స్

బుకర్‌కు ఎంపికైన రచన: ది సేఫ్ కీప్



ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌లో యూదు తల్లికి, యూదేతర తండ్రికి యేల్ వాన్ జన్మించారు. ఆ తరువాత ఆమె కుటుంబం నెదర్లాండ్స్‌కు వలస వెళ్ళింది. చరిత్ర, సాహిత్యం ఆమె అభిమాన విషయాలు. పలు యూనివర్సిటీల్లో క్రియేటివ్ రైటింగ్, స్టోరీ టెల్లింగ్, లిటరేచర్ గురించి బోధించారు. అనేక పత్రికల్లో కళలు, సాహిత్యంపై వ్యాసాలు రాశారు. ఆమె కథలు ఎన్నో బహుమతులను అందుకున్నాయి. ఈ ఏడాది 'బుకర్ ప్రైజ్'కు షార్ట్‌లిస్ట్ అయిన 'ది సేఫ్ కీప్' ఆమె తొలి నవల. అంతేకాదు... ఆ బహుమతికి నామినేట్ అయిన తొలి డచ్ రచయితగానూ చరిత్రకెక్కారు. "ఈ నవల ఎందుకు రాశాననే ప్రశ్నకు... అనేక సమాధానాలు ఉన్నాయి. నెదర్లాండ్స్‌లో స్థిరపడిన ఇజ్రాయిలీ కుటుంబం మాది. వలస వచ్చిన చోట మా అస్థిత్వ మూలాల గురించి ఆలోచన, వాటిని వెతుక్కొనే ప్రయత్నాలు ఎంతో సంఘర్షణాత్మకమైనవి. ఒకసారి... నా సన్నిహితుల అంత్యక్రియల్లో పాల్గొని, కారులో తిరిగి వస్తున్నాను. విశాలమైన డచ్ వ్యవసాయ క్షేత్రాలు దారిలో కనిపిస్తున్నాయి. ఏదో దుఃఖం నాలో కదిలింది. దాని నుంచి ఎలా తప్పించుకోవాలి? అప్పుడు ఒక ఇల్లు, ఒక మహిళ, ఒక అపరిచితుడు... ఈ పాత్రలు నాలో మెదిలాయి. అదే రెండో ప్రపంచయుద్ధం ముగిసిన పదిహేనేళ్ళ తరువాత... నెదర్లాండ్స్‌లో జరిగే ఫ్యామిలీ డ్రామా- ది సేఫ్ కీప్" అంటూ తన నవల నేపథ్యాన్ని వివరించారు యేల్ వాన్. ప్రస్తుతం బోధన కొనసాగిస్తూనే... రచనా వ్యాసంగంలో తదుపరి అడుగులకు ఆమె సిద్ధమవుతున్నారు.

పదిహేనేళ్ల వయసులో పెళ్లి.... పద్దెనిమిదేళ్లు వచ్చే సరికి ఇద్దరు పిల్లలు. బాల్యంను గుర్తు చేసుకుంటే కన్నీళ్లే తప్ప తీపి జ్ఞాపకాలు ఏమీ లేవు. కానీ ఇప్పుడు మారథాన్‌లో రికార్డులు సృష్టిస్తూ అందరిచేత శభాష్ అనిపించుకుంటున్నారు. మనాలీకి చెందిన టెంజిన్ డోల్మా మారథాన్ ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకం.

మనాలీ మారథాన్ క్వీన్



లడఖ్ మారథాన్‌లో భాగమైన సిల్క్ రూట్ అల్ట్రా 122 కి.మీ మేర సాగుతుంది. ఈ మారథాన్‌ను 18 గంటల్లో పూర్తి చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు డోల్మా. కానీ 17 గంటల 3 నిమిషాల్లోనే పూర్తి చేసి మారథాన్‌లో అందరి మన్ననలు అందుకున్నారు. 30 ఏళ్ల వయసులో మారథాన్ మొదలుపెట్టి ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారామె. అలా అని తను మారథాన్‌లో ఎవరి దగ్గరా శిక్షణ తీసుకోలేదు. మారథానర్‌గా మారడం యాదృచ్ఛికంగా జరిగిపోయిందని అంటారు డోల్మా. హిమాచల్‌ప్రదేశ్‌లోని మారుమూల గ్రామం కొమిక్‌లో జన్మించారామె. ఆసియాలోనే ఎత్తైన గ్రామంగా కొమిక్‌కు గుర్తింపు ఉంది. డోల్మా చిన్నతనంలో వాళ్ల కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమయింది. దాంతో ఏడో తరగతి తరువాత చదువు మానేసింది. తండ్రి చనిపోవడంతో ఆర్థిక సమస్యలు ఎక్కువయ్యాయి. నలుగురు తోబుట్టువులలో డోల్మా చిన్నది. 15 ఏళ్లకే తనకు పెళ్లి చేశారు. 18 ఏళ్లు వచ్చే సరికి ఒక బాబు, ఒక పాప జన్మించారు. అప్పటి నుంచి కుటుంబ బాధ్యతలు మీద పడ్డాయి. పిల్లల ఆలనాపాలనా చూసుకోవడంతోనే సరిపోయేది. కానీ 3 సెప్టెంబరు 2017 ఆమె జీవితాన్నే మార్చేసింది. లడఖ్ హాఫ్ మారథాన్‌లో పాల్గొని విజేతగా నిలిచింది డోల్మా. "ఆ రోజు నా జీవితం మారిపోయింది" అని అంటారు డోల్మా. 30 ఏళ్ల వయసులో ఎలాంటి శిక్షణ, ఆటల్లో అనుభవం లేకున్నా 21.9 కి.మీ మారథాన్‌లో విజేతగా నిలిచారు డోల్మా.



పరుగు ఇలా మొదలు

ఏడేళ్ల క్రితం డోల్మీ స్నేహితురాలు మనాలీలో జరుగుతున్న 21కె మారథాన్‌లో పాల్గొనేందుకు రిజిస్టర్ చేసుకున్నారు. ఆమె సూచన మేరకు డోల్మీ కూడా తన పేరు నమోదు చేసుకున్నారు. ఆ మారథాన్‌లో అనుభవం ఉన్న రేసర్లు, పోలీస్ ఫోర్స్‌లో పనిచేస్తున్న మహిళలను వెనక్కినెట్టి డోల్మీ విజేతగా నిలిచారు. "ఆ గెలుపు నాకు ఎంతో ఆనందానిచ్చింది. నేను పరుగెత్తడం ప్రారంభించగానే నా కళ్లముందు నా బాల్యం కదలాడింది. గమ్యాన్ని చేరుకునే వరకు పరుగును ఆపొద్దని అనుకున్నా" అని ఆనాటి సంగతులను పంచుకుంటారు డోల్మా. భర్త, కుటుంబ సభ్యుల నుంచి సంపూర్ణ సహకారం లభించడంతో ఆత్మవిశ్వాసంతో ఆ మారథాన్‌లో పాల్గొని విజేతగా నిలిచింది.

అదే నాకు శిక్షణ

లేహ్-మనాలీ హైవేపై నిర్వహించిన 480 కి.మీ మారథాన్ డోల్మాకు ఒక ఛాలెంజింగ్‌గా నిలిచింది. ఈ మారథాన్‌ను పూర్తి చేయడానికి శారీరకంగా దృఢంగా ఉంటే సరిపోదు. ఉక్కు సంకల్పం కూడా కావాలి. ఆక్సిజన్ శాతం తక్కువగా ఉండే ఎత్తైన ప్రాంతాలలో, మంచు వాతావరణంలో మారథాన్ అంత సులభం కాదు. కానీ డోల్మా ఆ మారథాన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. "ఒక్కోసారి రోజుకు 40 కి.మీ మాత్రమే పరుగెత్తడానికి వీలయింది. అయితే మారథాన్‌ను పూర్తి చేయలేనని ఎప్పుడూ అనిపించలేదు" అని అంటారు డోల్మా. హెల్ అల్ట్రా మారథాన్‌ను టైం లిమిట్‌లో పూర్తి చేసిన మొదటి మహిళగా డోల్మా గుర్తింపు సాధించారు. సముద్ర మట్టానికి 10వేల అడుగుల ఎత్తులో ఉన్న లాహౌల్‌లో నిర్వహించిన స్నో మారథాన్‌లో మూడు సార్లు విజయం సాధించారు. ఎముకలు కొరికే చలిలో జరిగే ఈ మారథాన్‌లో వరుసగా మూడేళ్లు తనే విజేతగా నిలిచారు. "కోచ్, శిక్షణ లేకుండా ఇన్నాళ్లుగా ఎలా పరుగెడుతున్నావు అని చాలా మంది నన్ను అడుగుతుంటారు. దానికి నా సమాధానం నేను పాల్గొన్న ప్రతి రేసు నాకు శిక్షణలా ఉపయోగపడింది" అని అంటారు డోల్మా. చక్కని ఆహారపు అలవాట్లు, యోగా, మంచి నిద్ర వంటివి కూడా డోల్మా విజయానికి కారణం. కొన్నేళ్లుగా డోల్మా జంక్ ఫుడ్‌ను ముట్టుకోవడం లేదు. ఇంట్లో వండిన ప్రొటీన్ ఆహారాన్ని మాత్రమే తీసుకుంటారు. మనాలి సమీపంలో ఉన్న కోఠి అనే గ్రామంలో భర్తతో కలిసి కేఫ్‌ని నడుపుతున్నారామె. అక్కడికి సమీపంలో ఉన్న రోహతంగ్ లాను సందర్శించేందుకు పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు. ఆ దారిలోనే ఈ కేఫ్ ఉంది. మూడు పదుల వయసులో మారథాన్ మొదలుపెట్టి రికార్డులు సృష్టించడం ద్వారా ఎంతో మంది యువతులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు డోల్మా.

హాట్ హిట్స్



ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
3. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
4. ఆయీ నై (స్త్రీ-2)
5. సాజ్‌నీ రే (లాపతా లేడీస్)
6. తైనూ ఖబర్ నహీ (ముంజ్యా)
7. దేఖా తేనూ (మిస్టర్ అండ్ మిసెస్ మహీ)
8. నైనా (క్రూ)
9. ఓ మాహీ (డంకీ)
10. చలేయా (జవాన్)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)

నవ్య | చిత్రజ్యోతి



షూటింగ్స్‌కు చిన్న బ్రేక్ ఇచ్చిన సమంత పెళ్లి పెద్ద అయ్యారు. ఆమె సోదరుడు డేవిడ్ పెళ్లి ఇటీవలే అమెరికాలోని విస్కాన్సిన్‌లో ఘనంగా జరిగింది. పెళ్లి పనులను దగ్గరుండి చూసుకున్నారు సమంత. తమ్ముడి పెళ్లి ఫొటోలను ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో పంచుకున్నారు.

నాకేం ఆ ఉబలాటం లేదు

- సిమ్రాన్



'స్టార్ హీరోల సరసన నటించేందుకు సిమ్రాన్ వెంపర్లాడుతున్నారంటూ కొందరు డిజిటల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. నన్ను సంప్రదించకుండా ఇలాంటి తప్పుడు వార్తలు రాస్తున్నవాళ్లంతా నాకు క్షమాపణలు చెప్పాలి' అని నటి సిమ్రాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె స్వీయ నిర్మాణంలో విజయ్‌తో భారీ బడ్జెట్ సినిమా చేసేందుకు ప్రయత్నించగా ఆయన అంగీకరించలేదంటూ కోలీవుడ్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. దీనిపై సిమ్రాన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పరోక్షంగా స్పందించారు. 'నేను ఇప్పటికే దక్షిణాదిలో అగ్రహీరోలందరితో సినిమాలు చేశాను. ఇంకా పెద్ద హీరోలతో హీరోయిన్‌గా చేయాలనే ఉబలాటం నాకు లేదు. నా పరిమితులు నాకు తెలుసు. కానీ తరచూ ఎవరితో ఒకరితో ముడిపెడుతూ వార్తలు రాస్తున్నారు. పదే పదే జరుగుతున్న ప్రచారంతో స్నేహితులు, సన్నిహితులు అదంతా నిజమేనని నమ్మే పరిస్థితి వచ్చింది. అందుకే దీనిపై నేను వివరణ ఇవ్వాల్సి వచ్చింది. ఇక నుంచైనా ఇలాంటి ప్రచారాన్ని ఆపండి' అని సిమ్రాన్ కోరారు.

కొత్తగా..

ఆస్ట్రేలియాలో డ్యూయెట్



నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'రాబిన్‌హుడ్'. మైత్రీ మూవీస్ బ్యానర్‌పై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. ఈ సినిమాలోని ఓ కీలక షెడ్యూల్ ఆస్ట్రేలియాలో ప్రారంభమైంది. ఈ షెడ్యూల్‌లో నితిన్, శ్రీలీలపై ఓ డ్యూయెట్ చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమా డిసెంబర్ 20న విడుదలవనుంది. ఈ చిత్రంలో రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్, బ్రహ్మాజీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎడిటర్: కోటి, డీఓపీ: సాయి శ్రీరామ్, సంగీతం: జీ.వి.ప్రకాశ్‌కుమార్.

దేవర ప్రీ రిలీజ్ ఈవెంట్ రద్దు

- ఒక్కసారిగా దూసుకొచ్చిన అభిమానులు
- హెచ్ఐసీసీ అద్దాలు ధ్వంసం, పోలీసుల లాఠీ చార్జి
- విచారం వ్యక్తం చేసిన ఎన్టీఆర్



జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటించిన 'దేవర' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ రద్దయింది. ఆదివారం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు హైదరాబాద్‌కు తరలివచ్చారు. హెచ్ఐసీసీలో 3500 మందికి సీటింగ్ కెపాసిటీ ఉండగా నిర్వాహకులు 5వేల మందికి పాస్‌లు జారీ చేశారు. ఒక్కసారిగా అభిమానులు వేల సంఖ్యలో చొచ్చుకొని రావడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. పోలీసులు అంచనా వేయలేకపోవడంతో పరిస్థితి అదుపు తప్పింది. దీంతో లాఠీ చార్జి చేయాల్సి వచ్చింది. పలువురు అభిమానులకు గాయాలయ్యాయి. పరిస్థితి అదుపు తప్పడంతో ఈవెంట్‌ను రద్దు చేస్తున్నట్లు శ్రేయాస్ మీడియా ప్రతినిధులు ప్రకటించారు. కెపాసిటీకి మించి పాస్‌లు ఇచ్చి, అభిమానులను గందరగోళానికి గురిచేయడమే కాకుండా, పోలీసులకు సరైన సమాచారం ఇవ్వకుండా భద్రతా వైఫల్యానికి కారణమైన శ్రేయాస్ మీడియాపై పోలీసులు కేసు నమోదు చేయాలని అభిమానులు డిమాండ్ చేశారు.

నేనే ఎక్కువ బాధపడుతున్నా : ఎన్టీఆర్

'దేవర' ప్రీ రిలీజ్ వేడుక రద్దవడం పట్ల జూనియర్ ఎన్టీఆర్ విచారం వ్యక్తం చేశారు. అభిమానులను ఉద్దేశించి ఓ వీడియోను విడుదల చేశారు. "అభిమాన సోదరులకి నమస్కారం. దేవర ప్రీ రిలీజ్ ఈవెంట్ రద్దు కావడం ఎంతో బాధాకరం. సినిమా కోసం ఎంత కష్టపడ్డామో మీకు తెలియజేద్దాం అనుకున్నా. కానీ కార్యక్రమం రద్దయింది. దీనికి మీ కంటే నేనే ఎక్కువ బాధపడుతున్నా. కార్యక్రమం రద్దయినందుకు నిర్మాతల్ని, నిర్వాహకుల్ని తప్పు పట్టాల్సిన పని లేదనేది నా అభిప్రాయం. మనమంతా ఈ రోజు కలవకపోయినా.. ఈ నెల 27న థియేటర్లలో కలుసుకుందాం. మీరందరూ గర్వపడేలా సినిమా ఉంటుంది. అందరూ జాగ్రత్తగా ఇంటికి చేరుకోండి" అని అందులో విజ్ఞప్తి చేశారు.

గిన్నిస్ బుక్‌లో మెగా స్టెప్



మెగాస్టార్ చిరంజీవి కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరింది. మరో అరుదైన గౌరవం ఆయన సొంతమైంది. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చిరంజీవి స్థానం దక్కించుకున్నారు. తను నటించిన సినిమాల్లోని 537 పాటల్లో 24 వేల డాన్స్ స్టెప్పులతో ఎవరికీ సాధ్యం కానీ రీతిలో ప్రేక్షకులను అలరించినందుకు ఆయనను ఈ అవార్డ్‌కు గిన్నిస్ నిర్వాహకులు ఎంపికచేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో గిన్నిస్ బుక్ ప్రతినిధి రిచర్డ్స్, బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ సంయుక్తంగా సర్టిఫికేట్‌ను చిరంజీవికి అందజేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ "నాకు చిన్నప్పటి నుంచి డాన్స్ అంటే ప్రాణం. ఆ ఆసక్తి వల్లే ఈ రికార్డు నా సొంతమైంది. ఈ ఘనత సాధించినందుకు చాలా ఆనందంగా ఉంది" అని అన్నారు. ఆమిర్‌ఖాన్ మాట్లాడుతూ "చిరంజీవికి నేను వీరాభిమానిని. నేను ఆయనను పెద్దన్నయ్యలా భావిస్తాను. ఆయనకు ఇంత గొప్ప గౌరవం దక్కినందుకు చాలా సంతోషంగా ఉంది" అని చెప్పారు. మెగా హీరోలు సాయిధరమ్ తేజ్, వరుణ్ తేజ్.. డైరెక్టర్లు రాఘవేంద్రరావు, బి.గోపాల్, కోదండరామిరెడ్డి, గుణశేఖర్, బాబీ.. నిర్మాతలు అల్లు అరవింద్, సురేశ్‌బాబు, అశ్వనీదత్ తదితరులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

ప్రముఖుల అభినందనలు

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చిరంజీవికి చోటు దక్కడం పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. చిరంజీవి తన నటన, డాన్స్‌తో తెలుగు సినిమా స్థాయిని పెంచడంలో కీలకపాత్ర పోషించారు అని అభినందించారు. చిరంజీవికి గిన్నిస్ బుక్‌లో స్థానం దక్కడం తెలుగు వారిగా మనమంతా గర్వించాల్సిన సందర్భం అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. నృత్యం అంటే మెగాస్టార్, మెగాస్టార్ అంటేనే నృత్యం అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చిరంజీవిని కొనియాడారు. ఏదైనా సాధించాలనుకునే యువత చిరంజీవిని ఆదర్శంగా తీసుకోవాలని హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ సూచించారు. విజయాలు, రికార్డులు అన్నయ్యకు కొత్త కాదు, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కడం ఎంతో ప్రత్యేకం అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు చిరంజీవిని అభినందించారు.

టీజీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఎకానమీ

తెలంగాణలో వైద్య, ఆరోగ్య సేవలు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్య సంబంధిత అవస్థాపన సౌకర్యాల కల్పనతోపాటు అనేకరకాల వైద్య, ఆరోగ్య సేవలను అందిస్తున్నది. దీనిలో ముఖ్యమైన వాటిని పరిశీలిద్దాం.

ఎంసిహెచ్ (మదర్ అండ్ చైల్డ్ హెల్త్)కిట్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసూతి జరిగిన తల్లి, బిడ్డలకు అవసరమైన 14 వస్తువులను అందించే పథకం ఇది. ఈ పథకం కింద గర్భవతులుగా ఉన్నప్పటి నుంచి ఆదాయం ఇచ్చే ఉపాధికి దూరమైనందుకు ఆడపిల్ల తల్లికి రూ.13,000; బాలురకు జన్మనిస్తే రూ.12,000లను నాలుగు విడతలుగా ప్రయోజకుల ఖాతాకు ప్రభుత్వం జమచేస్తుంది.

ఇందుకు నాలుగు రకాల ఆరోగ్య భద్రత చర్యలను ప్రయోజకులు పాటించాలి. అవి- 1) వైద్యాధికారితో గర్భవతిగా రెండుసార్లు పరీక్ష చేయించుకోవాలి.

2) ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసూతి జరగాలి.

3) శిశువుకు మూడున్నర మాసాలకు ఒకసారి రోగనిరోధక టీకా వేయించుకోవాలి.

4) అన్ని దశల చుక్కల మందులు తీసుకోవాలి. 2017 జూన్ 2న అప్పటి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఈ పథకాన్ని కేసీఆర్ కిట్ పేరిట ఆరంభించారు.



పౌష్టికాహార కిట్

2022 డిసెంబరు 21న ఈ పథకాన్ని ఆరంభించారు. 2023 జూన్ 14 నుంచి 33 జిల్లాలో దీనిని అమలుపరుస్తున్నారు. పథకంలో భాగంగా గర్భవతులకు 14-26 వారాల మధ్య మొదటిసారి, 27-34 వారాల మధ్య రెండోసారి ఆరోగ్యానికి అవసరమైన పౌష్టికాహార కిట్‌ను ప్రభుత్వం అందిస్తుంది.

ఆరోగ్య మహిళ

ప్రతి మంగళవారం మహిళా వైద్యులు ప్రత్యేకించి మహిళల ఆరోగ్య పర్యవేక్షణ జరిపే పథకం ఇది.

సాధారణ ప్రసూతి ప్రోత్సాహ పథకం



ఆస్పత్రుల్లో సర్జరీ ప్రసూతిని నిరుత్సాహపరుస్తూ, సాధారణ ప్రసూతిని ప్రోత్సహించడం కోసం టీమ్ బేస్డ్ ఇంటెన్సివ్(టీబీఐ) అనే పథకాన్ని రాష్ట్రప్రభుత్వం అమలుపరుస్తుంది. ఈ పథకంలో భాగంగా గత సంవత్సరం జరిగిన ప్రసవాల్లో ఎంత శాతం సాధారణమైనవో పరిశీలించి ప్రస్తుత సంవత్సరం ఆ శాతాన్ని దాటి జరిగిన ప్రతి సాధారణ ప్రసవానికి రూ.3,000లను ఆస్పత్రికి ప్రభుత్వం ఇస్తుంది.

శిశు ఆరోగ్య ప్రత్యేక వైద్య యూనిట్లు

అప్పుడే జన్మించిన శిశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక వైద్య యూనిట్లను రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసింది. డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో 27, తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో 19, మొత్తం 46 శిశు ఆరోగ్య ప్రత్యేక యూనిట్లు(స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్స్) రాష్ట్రంలో ఏర్పాటు చేశారు. నెలలు నిండకముందే జన్మించిన శిశువులకు, తక్కువ బరువుతో జన్మించిన శిశువులకు కంగారు మదర్ కేర్(కేఎంసీ) సేవలను ఈ శిశు వైద్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు.



పౌష్టికాహార పునరావాస కేంద్రాలు

తీవ్రమైన పౌష్టికాహార లోపంతో ఉన్న పిల్లలకు అవసరమైన పోషకాహార సరఫరాకు రాష్ట్రంలో 17 పౌష్టికాహార పునరావాస కేంద్రాలు పనిచేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 30 మంది మాస్టర్ ట్రైనర్లు ఈ కేంద్రాల సిబ్బందికి దార్శనికత చేస్తారు.

రాష్ట్రీయ బాలస్వస్థ కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే)

రాష్ట్రంలో శిశు మరణాల రేటును తగ్గించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 300 సంచార వైద్య బృందాలు రాష్ట్రమంతటా పర్యటిస్తూ, ప్రత్యేకించి పాఠశాలలను సందర్శిస్తూ ఆరు సంవత్సరాలు, అంతకంటే తక్కువ వయసు గల పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత వైద్యం అందిస్తారు.

అత్యవసర రవాణా సేవలు

టోల్ ఫ్రీ 108 ద్వారా అత్యవసర చికిత్స రవాణా అందించడానికి 456 అంబులెన్స్‌లు ఉన్నాయి. 104 ద్వారా హైదరాబాద్ వినహా మిగతా ప్రాంతాల్లో నిర్ణీత రోజుల్లో వైద్యం అందించడానికి 198 సంచార వైద్య వాహనాలు ఉన్నాయి. 102 టోల్ ఫ్రీ నంబరు ద్వారా గర్భవతులు, బాలింతలు, చిన్నపిల్లలకు వైద్యం నిమిత్తం ఉచిత రవాణా కోసం 2018 జనవరిలో 200 వాహనాలతో 'అమ్మ ఒడి' పేరిట ఈ కార్యక్రమం ఆరంభమైంది. ప్రస్తుతం 300 వాహనాలు అమ్మ ఒడి సేవలను అందిస్తున్నాయి.

కుటుంబ నియంత్రణ సేవలు

1952లో ఆరంభమైన కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేశారు. ఫలితంగా దేశంలో సగటు మహిళ సంతానోత్పత్తి రేటు '2'గా ఉండగా, రాష్ట్రంలో 1.5గా ఉంది. ప్రస్తుతం పురుషులు, స్త్రీలకు శాశ్వత కుటుంబ నియంత్రణ సేవల్ని, పిల్లల మధ్య వ్యవధిని పెంచే సేవలను కుటుంబ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా అందిస్తున్నారు.

తెలంగాణ డయాగ్నస్టిక్స్

రోగాన్ని శాస్త్రీయంగా గుర్తించి వైద్యం చేయాలనే ఆధునిక వైద్య ప్రక్రియలో భాగంగా 2018లో హైటెక్ హంగులతో కేంద్రీయ ల్యాబ్‌ను ఏర్పాటుచేశారు. దీనిలో ప్రతిరోజూ 23 వేల శాంపిల్స్‌ను ప్రాసెస్ చేస్తూ 1463 ఆస్పత్రులకు సహాయాన్ని అందిస్తున్నారు.

జాతీయ పట్టణ ఆరోగ్య కార్యక్రమం

జాతీయ ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా 2018లో జాతీయ పట్టణ ఆరోగ్య కార్యక్రమాన్ని ఆరంభించారు. ప్రధానంగా పట్టణాల్లోని మురికివాడల్లో, బలహీనవర్గాల ప్రజలకు వైద్యసేవల నిమిత్తం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రంలోని 56 పట్టణాలు, మున్సిపాలిటీలు, కార్పోరేషన్లలో ఈ కార్యక్రమం అమలులో ఉంది. రాష్ట్రంలో ఉన్న 246 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 461 బస్తీ దవాఖానాల ద్వారా ఈ కార్యక్రమం అమలవుతోంది.



డా.ఎం.ఏ.మాలిక్
అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ ఎకనామిక్స్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చేవెళ్ల

రాష్ట్రంలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు

రాష్ట్రంలో అంటువ్యాధులు కానీ అధిక రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ మొదలైన వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నది. ఇలాంటి వ్యాధులను గుర్తించి చికిత్స అందించాలనే జాతీయ కార్యక్రమం రాష్ట్రంలో అమలవుతోంది.




జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమం ద్వారా 2025 సంవత్సరం నాటికి రాష్ట్రాన్ని క్షయ వ్యాధిగ్రస్తులు లేని రాష్ట్రంగా ప్రకటించాలనే లక్ష్యంతో అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

1976లో ఆరంభమైన జాతీయ అంధత్వ నియంత్రణ కార్యక్రమం 1994 సంవత్సరం నుంచి 2002 సంవత్సరాల మధ్య ప్రపంచబ్యాంకు సహాయంతో బలోపేతమైంది. రాష్ట్రంలో 2006-07లో ఒక శాతం ప్రజలు అంధత్వాన్ని కలిగి ఉండగా, ప్రస్తుతం (2015-19) 0.36 శాతం మంది ప్రజలు అంధత్వాన్ని కలిగి ఉన్నారు. దోమకాటు ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, ఫిలారియాసిస్, డెంగ్యూ, చికెన్ గునియా, జపనీస్ ఎన్సెఫలిటిస్ లాంటి వ్యాధుల నిరోధానికి ఏర్పాటైన జాతీయ సంస్థ సహాయంతో ఈ వ్యాధుల నిరోధానికి రాష్ట్రంలో ప్రయత్నం జరుగుతున్నది. మలేరియా వ్యాధిగ్రస్తుల సంఖ్య క్రమంగా తగ్గడంతోపాటు కొన్ని జిల్లాల్లో మలేరియా కేసులే నమోదు కాలేదు. 1955లో జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన కార్యక్రమం ఆరంభమైంది. 1982లో బహుళ ఔషధ విధానం ద్వారా ఈ కార్యక్రమం బలోపేతమైంది. 2027 నాటికి కుష్ఠు వ్యాధి లేని తెలంగాణను సాధించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం రాష్ట్రంలో అమలు చేస్తున్నారు.



క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు, చేతులు, కాళ్లు పడిపోయిన వారిని జాగ్రత్తగా చూసుకుంటూ అవసరమైన వైద్యం అందించాలనే జాతీయ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో కనీసం ఏడు నుంచి తొమ్మిదిమందికి సేవలందించే ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఇలాంటి సేవలందించే 34 కేంద్రాలు, 34 సంచార గృహసేవల యూనిట్లు పనిచేస్తున్నాయి.

జాతీయ పొగాకు వినియోగ నియంత్రణ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల్లో అమలు చేస్తున్నారు. జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని 33 జిల్లాల్లో జిల్లా మానసిక ఆస్పత్రులను ఏర్పాటుచేశారు. మానసిక వైద్యులు, నర్సులు, కౌన్సిలర్లు ఈ ఆస్పత్రుల్లో సేవలందిస్తున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు కూడా ఈ సేవలను అందిస్తున్నాయి. వారంలో అయిదు రోజులు ఇన్‌పేషెంట్, అవుట్ పేషెంట్ సేవలను అందించడంతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో మానసిక వైద్యులు వారంలో ఒకరోజు అవుట్ పేషెంట్ సేవలు అందిస్తారు. 2004లో ప్రపంచబ్యాంకు సహాయంతో అంటువ్యాధుల నుంచి రక్షణ పొందే కార్యక్రమం ప్రారంభమైంది. అంటువ్యాధుల కారకాలను, వ్యాధులు ప్రబలే అవకాశాలను ముందే పసిగట్టడం, వచ్చిన ఎడల దాని నుంచి ప్రజలను రక్షించడం కోసం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.



జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాన్ని రాష్ట్రంలో తెలంగాణ ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ అమలుపరుస్తుంది. రాష్ట్రంలో 127 సమగ్ర కౌన్సెలింగ్, నిర్ధారణ కేంద్రాలు, 27 చికిత్స కేంద్రాలు ఏర్పాటుచేశారు. 2023 డిసెంబరు చివరివరకు 1,20,633 మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు తెలంగాణ ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ గుర్తించింది.

2007 ఏప్రిల్ 1న రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ పేదరికంలో ఉన్న ప్రజలకు సమగ్ర ఆరోగ్య సేవలను అందించడానికి ఏర్పాటు చేశారు. 2021లో ఏబీపీఎం-జెఏవై ఈ కార్యక్రమాన్ని కలిపివేశారు. ప్రస్తుతం దీనిని ఆయుష్మాన్ భారత్ పీఎం జాయ్ రాజీవ్ ఆరోగ్యశ్రీ అని పిలుస్తున్నారు.

నాణ్యత గల వైద్య సేవలను పేద ప్రజలకు అందించడం, వారికి చికిత్సకు అవసరమైన ద్రవ్యాన్ని అందుబాటులో ఉండేవిధంగా చూడటం ఈ పథకం ఉద్దేశం. రాష్ట్రంలో '84' డయాలసిస్ కేంద్రాలు ఈ పథకం కింద సేవలందిస్తున్నాయి. నిర్మాణరంగంలో ఉన్న 8.4 లక్షల కార్మిక కుటుంబాలు ఈ పథకం ప్రయోజకులుగా ఉన్నారు.

రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఒక కుటుంబానికి ఒక సంవత్సరానికి అందించే బీమా మొత్తాన్ని రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు 2024 డిసెంబరు 9 నుంచి పెంచుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

1904లోనే హైదరాబాద్‌లో ద డైరెక్టరేట్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్, పబ్లిక్ హెల్త్ లేబొరేటరీస్, ఫుడ్ అడ్మినిస్ట్రేషన్ ఏర్పాటైంది. 1981లో దీని నమూనాను ఆధునీకరించారు. ఈ సంస్థ రోగాల నిర్ధారణ, రక్తనిధి నిర్వహణ, విపత్తులకు స్పందించడం, రోగనిరోధక టీకాలు వేయించడం, నీటి నాణ్యత పర్యవేక్షణ, ఆహార నాణ్యత విశ్లేషణ మొదలైన బహుళ రకాల ఆరోగ్య సేవలను అందిస్తున్నది.

లెటర్ రిపీటెడ్ సిరీస్

పార్ట్-2

టీజీపీఎస్సీ / ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

1. a - c - bc - b - a - c
   ఎ) baabc బి) baacb
   సి) ababc డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: abc/abc/abc/abc.
ఒకే విధమైన మూడు అక్షరాలు ప్రతి సమూహంలో ఏర్పడినవి.
∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు baacb.

2. a - b - a - ba - b - aab - a
   ఎ) bababb బి) babbab
   సి) babbba డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: abba/abba/abba/abba
ఒకే విధమైన నాలుగు అక్షరాలు ప్రతి సమూహంలో ఏర్పడినవి.
∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు bababb.

3. c - ab - b - bcb - bc - ab - b - -
   ఎ) bcabacab బి) bcaabbac
   సి) bcaabcab డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: cbab / cbab / cbab / cbab / cba b
ఒకే విధమైన నాలుగేసి అక్షరాలు ప్రతి సమూహంలో ఏర్పడినవి.
∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు bcaabcab.

4. L - N - M - L M - L - N - MN
   ఎ) MLNNML బి) MLNNLM
   సి) MLLNNM డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: LMN / LMN / LMN / LMN / LMN
ఒకే విధమైన మూడు అక్షరాలు ప్రతి సమూహంలో ఏర్పడినవి.
∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు MLNNML.

5. b - d - bc - ab - da - c - a
   ఎ) cadcdb బి) cadcbd
   సి) caddbc డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: bcda / bcda / bcda / bcda
ఒకే విధమైన నాలుగు అక్షరాలు ప్రతి సమూహంలో ఏర్పడినవి.
∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు cadcbd.

6. a - b - a - cbc - ac - ca
   ఎ) ccaab బి) ccbaa
   సి) ccaba డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: acbca / acbca / acbca
ఒకే విధమైన ఐదేసి అక్షరాలు ప్రతి సమూహంలో ఏర్పడినవి.
∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు ccaab.

7. P - R - Q - S - RS - QSP - R - QR -
   ఎ) QSRPQPSP
   బి) QSRPPQPS
   సి) QSRQPPSP
   డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: PQRS / QRSP / RSPQ / SPQR / PQRS
మొదటి సమూహంలో చివరి మూడు అక్షరాలు రెండో సమూహంలో మొదటి మూడు అక్షరాలుగా, మొదటి సమూహంలో ఒకటవ అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఉంది. రెండో సమూహంలో చివరి మూడు అక్షరాలు మూడో సమూహంలో మొదటి మూడు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఉంది. ఈ విధంగా ఒక సక్రమమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు QSRP-PQPS.

8. b - dab - ad - bba - a - b - da -
   ఎ) abadabb బి) abdabba
   సి) abadbab డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: badab / badab / badab / badab
ఒకే విధమైన ఐదు అక్షరాలు ప్రతి సమూహంలో ఏర్పడినవి.
∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు abadbab.

9. a - d - - cdba - - bac - ba - db
   ఎ) cbacddc
   బి) cbaddcc సి) cbaccdd
   డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: acdb / acdb / ac db / acdb / acdb
ఒకే విధమైన నాలుగు అక్షరాలు ప్రతి సమూహంలో ఏర్పడినవి.
∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు cbacddc.

10. c - a - - da - cd - b - dabc - a -
    ఎ) dcbbadbc బి) dbcbacdb
    సి) dbcbacbd డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: cdab / cdab / cdab / cdab / cdab
ఒకే విధమైన నాలుగు అక్షరాలు ప్రతి సమూహంలో ఏర్పడినవి.
∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు dbcbacdb.

11. a - cb - ab - b - - bc - aab - b -
    ఎ) bacaabca బి) baaacbca
    సి) baaaccba డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: abcba / abcba / abcba / abcba
ఒకే విధమైన అయిదు అక్షరాలు ప్రతి సమూహంలో ఏర్పడినవి.
∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు bacaabca.

12. P - R P Q - - Q - P Q -
    ఎ) QRPRR బి) PQRRR
    సి) RPQRR డి) RPRQR

సమాధానం: (ఎ)

వివరణ: PQR/ PQR/ PQR/ PQR
ఒకే విధమైన మూడేసి అక్షరాలు ప్రతి సమూహంలో ఏర్పడినవి.
∴ సిరీస్‌లో వదిలివేసిన అక్షరాలు QRPRR.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



వరదలు - ఒక హెచ్చరిక

ఆది మానవుని నుంచి నేటి వరకు మనిషి నాగరికత, ఆధునికత సంతరించుకునే క్రమంలో అనేక సవాళ్లను అధిగమిస్తూ ముందుకు వెళ్తున్నాడు. నేటి ఆధునిక సమాజంలోనూ భిన్నమైన సవాళ్లు అతని ఎదుట పొంచి ఉన్నాయి. అతిచేస్తే గతి చెడుతుందంటారు. అవసరానికి మించిన వేగంతో వెళ్తున్న మానవాళికి ప్రకృతి నుంచి నేడు ప్రతి ఘటన ఎదురవుతోందన్న పరిశీలనలు, వాదనలు ప్రపంచవ్యాప్తంగా వెల్లువెత్తుతున్నాయి. గ్లోబల్ వార్మింగ్ వాటిలో ఒకటి. విపరీతమైన నగరీకరణ మరోటి. పగ్గాలు లేని దూకుడుతో వెళ్తున్న మానవ జీవనశైలి మూడోది. వెరసి మనిషి ప్రకృతిని పరిహాసం చేస్తున్నాడా అనిపిస్తుంది. ప్రకృతి ప్రకోపిస్తే ఏమవుతుందో ఇటీవల ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి.

వియత్నాంలో తాజాగా చూసిన 'యాగి' పెను తుపాను బీభత్సం ఒక ఉదాహరణ. మనదేశంలో పడగ విప్పుతున్న ప్రకృతి బుసలు అనేకం తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరికలు పంపుతున్నాయి. ప్రకృతి పోకడల విషయంలో మానవాళి ముఖ్యంగా భారతీయ నిపుణులు అనేక సమీక్షలు జరపాల్సిన అవసరం కనిపిస్తోంది.

మానవుని ప్రతీ అవసరాన్ని తీర్చగల శక్తి ప్రకృతికి ఉంది. కానీ, వారి అత్యాశను అది తీర్చలేదని అంటారు మహాత్మాగాంధీ. ప్రకృతి అందచేసింది తీసుకోవాలి కాని ఎగబడి లాక్కోరాదని గతంలో పెద్దలు హెచ్చరించేవారు. మనం జరుపుకునే ప్రతి పండుగ వెనక ప్రకృతి ఆరాధన అంతర్లీనంగా ఇమిడి ఉంటుంది. కానీ నేడు ప్రకృతి వనరులను విచ్చలవిడిగా కొల్లగొడుతున్నారు. భూమి, సముద్రం, గాలి, నీరు, అంతరిక్షం ఇలా యావత్ పర్యావరణం మనిషి ఆధునిక అరాచకాలకు బలైపోతోంది. కాలాలు గతి తప్పుతున్నాయి. నెలకు మూడు వానలు కురవాల్సిన రోజులు పోయి 30 నిమిషాల్లో మొత్తం వాన ఒకే ప్రదేశంలో క్లౌడ్ బరస్ట్ రూపంలో కురుస్తున్న విధానాలు, ఎన్నడూ చూడని వరదల సవాళ్లను విసురుతున్నాయి. సముద్ర, నదీ తీరాలు, వాగులు, ఏరులు, వంకలు, కొండ జలపాతాలు అన్నీ తమ ఉనికిని ప్రశ్నిస్తున్న మానవాళిని పునరాలోచనలో పడేలా చేస్తున్నాయి. కేదార్‌నాథ్ మహా ఉత్పాతం మొదలు మొన్నటి కేరళ వయనాడ్‌లో కొండ వరదలు అనేకమందిని కబళించి తమ ఆగ్రహాన్ని చూపాయి. చెన్నై, ముంబయి, ఢిల్లీ, హైదరాబాద్ నగరాలు వరదల్లో తరచూ మునుగుతుండటం చూస్తూనే ఉన్నాం. కృష్ణానదికి ఉపనది అయిన మున్నేరు వాగు, చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా భీకరంగా పొంగి ఖమ్మం జిల్లాను కన్నీటిలో ముంచెత్తగా, ఒక చిన్న బుడమేరు వాగు విజయవాడ వాసులను వారం రోజులపాటు బావురుమనిపించింది. 11.20 లక్షల క్యూసెక్కుల మహా జలప్రవాహంతో కృష్ణానది ఉధృతంగా ప్రవహించి భవిష్యత్తులో పొంచి ఉన్న ప్రమాదాలకు సంకేతంగా నిలిచింది. ఈ విపరిణామాలకు విరుగుడు- ప్రగతిపథంలో ప్రకృతి పర్యావరణ అంశాలకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వడమే.

వరదలు ఎందుకు వస్తాయి?

అధిక వర్షాలు వరదలకు ప్రధాన కారణమని తెలిసిన విషయమే. ప్రకృతి తన పని సాధారణ స్థితిలో చేసుకుపోతుంటే నెలకు మూడు వానలు కురిసి మానవాళికి మేలు చేస్తాయి. అడవులు, వ్యవసాయం వంటి పచ్చదనం గల ప్రాంతాల్లో చల్లని వాతావరణంలో మేఘాలు పిలిచినట్లు వచ్చి వానలు కురిపిస్తాయి. గ్రామాల్లో చెరువులు, కుంటలు జలాలతో కళకళలాడతాయి. ఇది ప్రకృతి. కానీ పరిశ్రమలు, వాహనాలు వెదజల్లుతున్న కాలుష్యం, అడవుల నరికివేత, నగరీకరణ పేరిట ఇంటింటా చెట్లు నరికివేత, సామాజిక వనాల కనుమరుగు వంటి వాటివల్ల భూమి వేడెక్కుతోంది. దీనిని భూతాపం(గ్లోబల్ వార్మింగ్) అంటారు. ఈ ప్రక్రియ వల్ల వానాకాలం తీరుతెన్నులే మారిపోతున్నాయి. రుతుపవనాల రాకపైనా ప్రభావం పడుతోంది. ఇదంతా వికృతి. ఫలితంగా వానలు ఎప్పుడు ఎక్కడ భళ్లుమని కురుస్తాయో కూడా అంచనా వేయలేని పరిస్థితి వచ్చింది. మేఘాల కదలికలు కూడా అనూహ్యంగా మారుతున్నాయి. నగర ప్రాంతాల్లో క్లౌడ్ బరస్ట్ అనే ఫినామినా కొన్నేళ్లుగా బాగా వినిపిస్తుంది. ఏడాదంతా కురవాల్సిన వాన ఒకచోట ఒకేరోజున కొన్ని గంటల్లో భళ్లున కురుస్తోంది. దీని వల్ల నదులు, చెరువులు, వాగులు, వంకలు ఉన్న ప్రాంతాల్లో సాధారణంగా కనిపించే వరదలు నేడు నగరాలను ముంచేస్తున్నాయి. కొండ పర్వత ప్రాంతాల్లో వాణిజ్య వ్యాపార కార్యక్రమాలు, రహదారుల నిర్మాణం వల్ల అవి పటుత్వం కోల్పోయి కొండ చరియలు జారిపడిపోతున్నాయి. మైదాన ప్రాంతాలు కనుమరుగు అవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లోని గుంతలు, కుంటలు నీటిని తమలో ఇముడ్చుకుంటాయి. ప్రస్తుతం ఆ వెసులుబాటు లేదు. గ్రామాలు, పట్టణాలు, నగరాలు వీధి వీధినా సిమెంట్ రోడ్లు వచ్చేశాయి. కానీ వాననీరు ఇంకేవిధంగా లేదా స్థానికంగా ఒడిసిపట్టి ఆపడానికి మరికొన్ని ఏర్పాట్లు అవసరమని తాజా పరిణామాలు హెచ్చరిస్తున్నాయి. ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలను మళ్లీ సాధారణ స్థితికి తీసుకురావాలి. అందుకు తెలంగాణ ప్రభుత్వం చొరవగా 'హైడ్రా' వ్యవస్థను తీసుకువచ్చింది. చెరువుల్లో ఆక్రమణలను తొలగిస్తోంది. అంతేకాదు కొన్ని లక్షల లీటర్ల సామర్థ్యం గల లోతైన బావులను తవ్వించి వరద నీటిని నిల్వచేసి, మూసీనదికి మళ్లించే వ్యవస్థను తెస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి చేసిన ప్రకటన రాజధాని హైదరాబాద్ ప్రజలకు ఊరటేనని చెప్పాలి. ఇంటింటా ఇంకుడు గుంతలకు బదులు ఇంటింటా ఇంకుడు బావి అవసరం అన్నది నగర ప్రజల వరద కష్టాలు నేర్పుతున్న పాఠం.

చెత్త, మురుగునీటి పారుదల వైఫల్యం

అంతేకాదు మురుగునీటి పారుదల వ్యవస్థలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి. డ్రైనేజీల పూడిక కూడా నగర వరదలకు కారణమవుతున్నాయి. చెత్త నిర్వహణలోనూ పాలనపరంగా, ప్రజలపరంగా అనేక మార్పులు రావాల్సి ఉంది. వివిధ రకాల చెత్తను ఎలా పారవేయాలన్న దానిపై ప్రజలకు ఒక అవగాహన అన్నది లేదు. చెత్త తీసుకువెళ్లడం ప్రభుత్వ బాధ్యత అనే ఆలోచన నుంచి చెత్త తగ్గింపు, అదో ఆదాయ వనరుగా మార్చడం అనే విషయాలపై అవగాహన పెంచడానికి ఎంతో ప్రచారం జరగాలి. చెత్త పునర్వినియోగం లేదా నియంత్రణ విధానాలపై పరిశోధన - అభివృద్ధి జరగాలి. నగర వరదల నివారణకు నేటి తరం యువత కొత్త కొత్త ఆలోచనలతో ముందుకు రావాల్సిన సమయమిది. ఉదాహరణకు పాత చెప్పులు మళ్లీ అదే షాపు వారికి ఇవ్వడం. అలా సేకరించిన వాటిని రీసైక్లింగ్ విధానంలో పునర్వినియోగానికి తీసుకురావడం. ఆన్‌లైన్ షాపింగ్ ప్యాకింగ్ నుంచి పెళ్లి భోజనాల వ్యర్థాల వరకు అన్నీ కలిసి మురుగునీటి పారుదల నుంచి పర్యావరణ సమస్యలను తీసుకువస్తున్నాయి. సముద్రాలు, నదులు, కాలువలు, కుంటలు కూడా వ్యర్థాల బారిన పడుతున్నాయి. ఈతరహా చిన్న చిన్న సమస్యలు ముదిరి నగర వరదలకు కారణమవుతున్నాయి.

వాననీరు వెళ్లే దారి లేక పట్టణాలు, నగరాలు చిన్నపాటి వానకే రహదారి నదులుగా మారిపోతున్నాయి. చెరువుల నిర్వహణ కూడా సమస్యాత్మకమవుతోంది. ఏళ్ల తరబడి పూడిక తీయకపోవడం వల్ల క్రమేణా అవి మైదానాలుగా మారిపోతున్నాయి. పట్టించుకునేవారు కానరాక కాలక్రమంలో ఆక్రమణలకు గురవుతున్నాయి. అక్కడ ఫామ్‌హౌస్‌లు, నిర్మాణాలు, వ్యాపార, విద్యాసంస్థలు రావడం హైదరాబాద్‌లో తాజా చరిత్ర. అందువల్లే హైదరాబాద్‌కు వరద కష్టాలు.

నీటి పారుదల విభాగాల లోపం

ఇక గ్రామాల్లోని చెరువుల పరిస్థితి భిన్నంగా లేదు. నిర్వహణ లేక అవి పూడిపోతున్నాయి. వాటిలోని పూడిక తీస్తూ ఎప్పటికప్పుడు గట్లను పటిష్టీకరించుకుంటే చెరువులు జలాలను ఒడిసిపట్టి మానవాళి జీవికకు అనేక రకాలుగా ఉపయోగపడతాయి. జీవవైవిధ్యానికి దోహదం చేస్తాయి. భూగర్భ జలాల పెంపుదలకు సహకరిస్తాయి. పూర్వకాలంలో ప్రతి చెరువు ఆవిర్భావం వెనుక ఆసక్తికరమైన కథలు కూడా ఉంటాయి. అనేకమంది త్యాగఫలంగా వాటిని పిలుస్తారు. జానపద కథగా గౌరవిస్తారు.

అదేవిధంగా సముద్ర తీరాలను కూడా కాపాడుకోవాలి. మడ అడవుల సంరక్షణ ఇందుకు ఎంతో అవసరం. కానీ అభివృద్ధి పేరిట వాటిని నరికివేసి, రిసార్టుల నిర్మాణం చేపడుతుండటం మరో విపరిణామం.

(మిగతా రేపటి దిక్సూచిలో...)



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

ఎన్‌డీఎంఏ

భారత భూశాస్త్ర మంత్రిత్వశాఖ పరిధిలోని ఐఎండీ దేశంలోని వర్షపాతం, తుపానులు వంటి వాటిని ముందే పసిగట్టి అప్రమత్తం చేస్తుంది. తుపానులు, వరదల వంటి ఉపద్రవాలను ఎదుర్కొనే కార్యకలాపాలను నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ(ఎన్‌డీఎంఏ) పర్యవేక్షిస్తుంది. కష్టకాలంలో కార్యరంగంలోకి దూకడానికి సహాయ కార్యకలాపాలు అందచేయడానికి నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్‌ఫోర్స్(ఎన్‌డీఆర్ఎఫ్) సిద్ధంగా ఉంటుంది. నదుల్లో నీటి ప్రవాహం, జలాల విడుదల వ్యవహారాలను హైడ్రాలజీ డేటాతో సహా రాష్ట్రాలకు నివేదించి నిర్వహణ పర్యవేక్షణ బాధ్యతలను సెంట్రల్ వాటర్ కమిషన్(సీడబ్ల్యూసీ) చూస్తుంది. నేషనల్ ఫ్లడ్ రిస్క్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు(ఎన్ఎఫ్ఆర్ఎంపీ) ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం, ఉపశమనం, పునరావాసం, పునర్నిర్మాణం వంటి కార్యక్రమాలు చేపడతారు.

ఎన్‌డీఎంఏ బాధ్యతలు

- రిజర్వాయర్లు, డ్యామ్‌లను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి భద్రతను నిర్ధారించాలి.
- వర్షాకాలానికి ముందే రిజర్వాయర్లు, డ్యామ్‌లలో పూడిక తీత కార్యక్రమాలు చేపట్టాలి.
- చెట్ల పెంపకం, వాటర్‌షెడ్ కార్యక్రమాలు చేపట్టాలి.
- వరదనీరు జనావాసాల్లోకి రాకుండా ఆనకట్టలు, గోడలు నిర్మించి దారి మళ్లింపు చర్యలు చేపట్టాలి.
- వరద ప్రాంతాలను ప్రత్యేకంగా జోనింగ్ చేసి, అక్కడ ప్రజలను వరద ప్రభావానికి ముందే జాగ్రత్తలు తీసుకునే చర్యలు చేపట్టాలి.
- వరద నష్టాలు వీలైనంత తక్కువ ఉండేలా జాగ్రత్తలు పాటించడం.
- వరద నియంత్రణలో సామాజిక భాగస్వామ్యం పెరిగేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, స్వచ్ఛంద సేవలకులకు ఎన్‌డీఎంఏ శిక్షణ అందించడానికి ఆపదమిత్ర అనే ప్రాయోజిత కార్యక్రమం చేపట్టడం.
- వరద సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించడానికి కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) ఒక మొబైల్ యాప్ ఫ్లడ్‌వాచ్‌ను అభివృద్ధి చేసింది.



64 గళ్ల రాజ్యంలో మనమే

కింగ్ క్వీన్

చెస్ ఒలింపియాడ్‌ది వందేళ్ల చరిత్ర.. మిగతా క్రీడలకు ఒలింపిక్స్ ఎంత ప్రతిష్ఠాత్మకమో చెస్‌కు ఇదీ అంతే.. 200కిపైగా దేశాలు..హేమాహేమీలైన ఆటగాళ్లు..గెలిచి తీరాలనే పట్టుదల.. ఎత్తులకుపైఎత్తులు..వెరసి ఉత్కంఠభరిత పోరాటాలు..అలాంటి చెస్ ఒలింపియాడ్‌లో పాల్గొనడమే గర్వకారణమైతే..అందులో పతకం అదీ స్వర్ణం సొంతం చేసుకోవడం ఆ ప్లేయర్ కెరీర్ సంపూర్ణం.. మరి అలాంటి ప్రఖ్యాత టోర్నమెంట్‌లో ఈసారి భారత జట్లు అద్భుతం చేశాయి.. ఏకంగా పురుషులు, మహిళల విభాగాలలో పసిడి పతకాలతో చరిత్ర సృష్టించాయి..దేశ చెస్‌లో నూతనాధ్యాయాన్ని లిఖించాయి.. చెస్ 'ప్రపంచం'లో భారత్ తిరుగులేని శక్తిగా మరోసారి నిరూపించాయి.. ఆఖరి రౌండ్‌లో తెలుగు గ్రాండ్‌మాస్టర్లు అర్జున్ ఇరిగేసి, ద్రోణవల్లి హారిక కీలక విజయాలతో మెప్పించారు.

భారత పురుషులు, మహిళల జట్ల చరిత్ర

చెస్ ఒలింపియాడ్‌లో రెండు స్వర్ణాలు

చెస్ ఒలింపియాడ్‌లో భారత్

2014	పురుషులు	కాంస్యం
2022	పురుషులు	కాంస్యం
2022	మహిళలు	కాంస్యం
2024	పురుషులు	స్వర్ణం
2024	మహిళలు	స్వర్ణం

బుడాపెస్ట్: కల నెరవేరింది. సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. చెస్ ఒలింపియాడ్‌లో భారత్ ఒకటికాదు రెండు స్వర్ణాలతో అదరగొట్టింది. అలా తొలి పసిడి పతక లక్ష్యాన్ని 'డబుల్'తో చిరస్మరణీయం చేసుకుంది. పతకమే లక్ష్యంగా ఈసారి టోర్నమెంట్‌లో బరిలో దిగిన పురుషులు, మహిళల జట్లు వాటిని సాధించాయి. పోటీల ఆరంభం నుంచి జోరు ప్రదర్శించిన జట్లు ఆఖరి రౌండ్‌లోనూ అదే ఊపును కొనసాగించాయి. ఆదివారం జరిగిన 11వ, చివరి రౌండ్‌లో..రెండో సీడ్ భారత పురుషుల జట్టు 3.5-0.5తో స్లొవేనియాను చిత్తు చేసింది. టాప్ సీడ్ మహిళల జట్టు కూడా 3.5-0.5తో అజర్‌బైజాన్‌పై విజయం అందుకుంది. పురుషులు శనివారంనాటి పదో రౌండ్ ముగిసే సరికే పసిడి పతకం ఖాయం చేసుకున్నారు. మరోవైపు మహిళల స్వర్ణంపై కాసింత అనుమానాలు ఏర్పడ్డాయి. కారణం..కజకిస్థాన్, అమెరికా పోటీలో నిలవడమే. కానీ చివరి రౌండ్‌లో మనోళ్లు గెలవగా..ఆఖరి రౌండ్‌లో పరస్పరం తలపడిన కజకిస్థాన్-అమెరికా డ్రా చేసుకోవడంతో మన మహిళలకు స్వర్ణం నిర్ధయమైపోయింది.

ఆఖర్లోనూ తగ్గేదేలే..: స్లొవేనియాతో చివరి రౌండ్‌ను డ్రా చేసుకుంటే చాలు.. పురుషుల జట్టుకు స్వర్ణ పతకం లభిస్తుంది. ఈనేపథ్యంలో జాన్ సుబేజ్‌పై నల్ల పావులతో ఆడిన తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి 49 ఎత్తుల్లో అతడిని చిత్తు చేసి జట్టుకు శుభారంభం అందించాడు. మరోవైపు నల్లపావులతోనే బరిలో దిగిన వరల్డ్ చాంపియన్‌షిప్ చాలెంజర్ గుకేష్.. వ్లాదిమిర్ ఫెడోసీవ్‌ని ఓడించడంతో భారత్‌కు స్వర్ణం ఖాయమైంది. నామమాత్రమైన మిగిలి రెండు గేముల్లో.. ప్రజ్ఞానంద-ఆంటన్ డెమ్‌చెన్కోపై గెలుపొందగా, మటేజ్ సెబెనిక్‌తో విదిత్ గుజ్‌రాతీ డ్రా చేసుకోవడంతో భారత జట్టులో ఆనందోత్సాహాలు మిన్నంటాయి.

మొత్తం 11 రౌండ్లలో 22 పాయింట్లకుగాను 21 పాయింట్లతో పురుషుల జట్టు స్వర్ణ విజేతగా అవతరించింది. అమెరికా (17 పాయింట్లు) రజతం, ఉజ్బెకిస్థాన్ (17 పాయింట్లు) కాంస్య పతకం కైవసం చేసుకున్నాయి. అమెరికా, ఉజ్బెకిస్థాన్ చెరో 17 పాయింట్లతో సమంగా నిలిచాయి. కానీ మెరుగైన టైబ్రేకర్ స్కోరుతో అమెరికా రెండో స్థానం దక్కించుకుంది.

అమ్మాయిలు అదరహో..: కజకిస్థాన్, అమెరికా జట్లు కూడా రేసులో ఉండడంతో చివరి రౌండ్‌లో మహిళల జట్టుపై ఒకింత ఒత్తిడి ఏర్పడింది. కానీ బరిలో దిగాక ఆ ఛాయలేవీ దరిచేరనీయకుండా ఆడి సూపర్ విక్టరీ సాధించింది. గోహర్‌పై విజయంతో ఇంటర్నేషనల్ మాస్టర్ దివ్యదేశ్‌ముఖ్ అదిరే బోణీతో ఆధిక్యం ప్రదర్శించింది. కానీ జీఎం వైశాలీ-ఉల్వియాతో డ్రా చేసింది. తెలుగు గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక తిరుగులేని సాంకేతిక నైపుణ్యంతో మమ్మాదాపై 51 ఎత్తుల్లో నెగ్గి భళా అనిపించింది. దాంతో మనోళ్లు 2.5-0.5తో ముందంజలో నిలిచారు. ఆఖరి గేములో నల్లపావులతో ఆడిన ఇంటర్నేషనల్ మాస్టర్ వంతిక అగర్వాల్-ఖనీమ్‌ను చిత్తు చేయడంతో భారత్ తిరుగులేని విజయం సొంతం చేసుకుంది. మొత్తం 11 రౌండ్లలో తొమ్మిదో రౌండ్లో పోలెండ్ చేతిలో మాత్రమే మన మహిళలు ఓటమి చవిచూశారు. ఇక కజకిస్థాన్ (18) రజతం, అమెరికా (17) కాంస్య పతకం అందుకున్నాయి.

ఓటమే లేకుండా..

పురుషుల జట్టు అపజయమే ఎరుగకుండా టోర్నీని ముగించడం విశేషం. 11 రౌండ్లలో భారత్ 10 విజయాలతో తిరుగులేని ప్రదర్శన చేసింది. కేవలం తొమ్మిదో రౌండ్‌లో ఉజ్బెకిస్థాన్‌తో డ్రా చేసుకుంది.

మన ఖాతాలో మరో నాలుగు స్వర్ణాలు

పురుషులు, మహిళల జట్లు కాకుండా.. వ్యక్తిగత ప్రదర్శనకు సంబంధించి మరో నాలుగు పసిడి పతకాలూ భారత్‌కు లభించాయి. గ్రాండ్‌మాస్టర్లు అర్జున్ ఇరిగేసి, గుకేష్ పురుషుల విభాగంలో..ఇంటర్నేషనల్ మాస్టర్లు దివ్య దేశ్‌ముఖ్, వంతిక అగర్వాల్ వ్యక్తిగతంగా స్వర్ణ పతకాలు అందుకున్నారు.

ఆ ట్రోఫీ మనకే..

పసిడి పతకాలతోపాటు గాప్రిన్‌డాష్‌విలీ ట్రోఫీని కూడా భారత్ చేజిక్కించుకుంది. ఓపెన్, మహిళల విభాగాలలో ఓవరాల్‌గా అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన జట్లకు ఈ ట్రోఫీ అందజేస్తారు. రష్యా తర్వాత ఈ ట్రోఫీని అందుకున్న రెండో దేశం భారతే కావడం విశేషం.

భారత్‌పై క్రామ్నిక్ ఫిర్యాదు

ప్రపంచ మాజీ చాంపియన్, ఉజ్బెకిస్థాన్ జట్టు కోచ్‌గా వ్యవహరిస్తున్న వ్లాదివిర్ క్రామ్నిక్ భారత్‌పై ఫిర్యాదు చేశాడు. ఉజ్బెకిస్థాన్‌తో తొమ్మిదో రౌండ్ సందర్భంగా భారత పురుషుల జట్టు సభ్యులవద్ద సెల్‌ఫోన్లు ఉండడంపై నిర్వాహకులకు ఫిర్యాదు చేశాడు. అయితే భారత ఆటగాళ్ల గేములను రికార్డు చేసేందుకు నిర్వాహకుల అనుమతితోనే ఆ ఫోన్లను తాము అక్కడ ఉంచినట్టు చెస్ బేస్ ఇండియా సంస్థ తెలిపింది. అయితే వాటిని 'ఏరో ప్లేన్' మోడ్‌లో ఉంచినట్టు వివరించింది.

మీ విజయాలు భారత ప్రజల కలలకు ప్రతిరూపం. దేశ శక్తి సామర్థ్యాలకు చిహ్నం. ప్రతిరోజూ మనం ఎన్నో విజయాలు సాధిస్తున్నాం. పసిడి పతకాలు అందుకున్న పురుషులు, మహిళల జట్లకు అభినందనలు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

రెండు స్వర్ణాలు సాధించిన చాంపియన్లను చూసి గర్విస్తున్నాం. అద్భుత తెలివి తేటలు, కఠోర శ్రమ, అంకితభావంతోనే ఈ విజయం సాధ్యమైంది.
-లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

చదరంగంలో భారత్ చరిత్ర సృష్టించింది. స్వర్ణం గెలిచిన గుకేష్, అర్జున్, విదిత్, హరికృష్ణ, ప్రజ్ఞానందకు శుభాకాంక్షలు. ప్రతిభ, కృషితో దేశం గర్వపడేలా చేశారు.
- కేంద్ర క్రీడామంత్రి మాండవ్య

భారత జట్లకు శుభాకాంక్షలు. గుకేష్, అర్జున్ సంచలనం. శ్రీనాథ్ కెప్టెన్సీ అద్భుతం. దివ్య, వంతికకు ప్రత్యేక అభినందనలు. - విశ్వనాథన్ ఆనంద్

కల నిజమాయె!

ఆంధ్రజ్యోతితో హరికృష్ణ, అర్జున్,హారిక

రెండు దశాబ్దాల నిరీక్షణ ఒకరిదైతే.. పుష్కరకాలంగా ఎదురు చూపులు మరొకరివి. క్రితంసారి అందినట్టే అంది త్రుటిలో ఈ టైటిల్ చేజారడంతో నిద్రలేని రాత్రులు గడిపిన చెస్ చిచ్చరపిడుగు మరొకరు. అలాంటి ఆ ముగ్గురు గ్రాండ్‌మాస్టర్ల కల ఒకే సారి ఒకే వేదికపై నెరవేరడంతో వారంతా ఆనందంలో మునిగిపోయారు. తెలుగు గ్రాండ్‌మాస్టర్లు పెంటేల హరికృష్ణ, ద్రోణవల్లి హారిక, ఇరిగేసి అర్జున్ తమ సంతోషాన్ని ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు. ఆ విశేషాలు వారి మాటల్లోనే..

నవ శకం ప్రారంభం..


హరికృష్ణ

24 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత నా కల సాకారమైంది. నా ఆనందానికి హద్దుల్లేవు. నా జీవితంలోనే ఇదొక గొప్ప అనుభూతి. టీమ్ చెస్ చాంపియన్‌షిప్‌ల్లో నేను సాధించిన అతి పెద్ద టైటిల్ ఇదే. గతంలో ఆసియా గేమ్స్, ఆసియా టీమ్ చాంపియన్‌షిప్‌ల్లో టైటిళ్లు నెగ్గా, కానీ ఒలింపియాడ్ కల నెరవేర్చుకోవడానికి ఇన్నేళ్లు పట్టింది. నేనాడిన అన్ని చెస్ ఒలింపియాడ్ టోర్నీల్లో కంటే ఇదే అత్యుత్తమమైనది. ఈ పుష్కరకాలంలో చెస్‌లో చాలా మార్పులు వచ్చాయి. ఆట స్వరూపం, సమీకరణాలు మారాయి. ఆడే దేశాల సంఖ్య, గ్రాండ్‌మాస్టర్ల శక్తిసామర్థ్యాల ప్రమాణాలు పెరిగాయి. బలమైన ప్లేయర్లను సవాల్ చేసి, కఠినమైన పోటీని తట్టుకుని ఈ టైటిల్‌ను సాధించాం. భారత చెస్‌లో ఇదొక కొత్త అధ్యాయం. నవశకం ప్రారంభమైంది.

అమ్మ అయ్యాక నెరవేరింది..


హారిక

నాకు 13 ఏళ్లప్పుడు తొలి చెస్ ఒలింపియాడ్ ఆడాను. ఇప్పుడు నా వయసు 33 ఏళ్లు. పుష్కరకాలంగా నెరవేరని నా కల, అమ్మ అయ్యాక తీరింది. రెండేళ్లక్రితం చెన్నై వేదికగా జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో తొమ్మిది నెలల బిడ్డను మోస్తూ బరిలోకి దిగా. కాంస్యం సాధించినా టైటిల్ దక్కలేదన్న వెలితి అలానే ఉండిపోయింది. మొత్తానికి ఇన్నేళ్ల తర్వాత నా కల నెరవేరింది. బలమైన జార్జియాపై 3-1తో గెలిచినప్పుడే ఈసారి టైటిల్ సాధిస్తామని నమ్మకం కలిగింది. టోర్నీ ప్రారంభం నుంచి అంచనాలకు తగ్గట్టు రాణించాం. నా చెస్ కెరీర్‌లోనే ఇదొక అద్భుతమైన విజయంగా నిలిచిపోతుంది.

అద్భుతంగా ఆడాం..


అర్జున్

గతంలో త్రుటిలో పతకం కోల్పోయాం. ఈసారి అత్యుత్తమ టీమ్‌తో బరిలోకి దిగి నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోగలిగాం. నా ఆటలోనూ మార్పులు చేసుకున్నా. ఒకప్పుడు ఓటమి ఎదురైనప్పుడు దానికి గల కారణాలపై ఎక్కువగా ఆలోచించేవాడిని. ఆ పరాజయం ప్రభావం తదుపరి పోటీలపైన పడేది. గత మే నెలలో కోయంబత్తూరులోని ఇషా ఫౌండేషన్‌లో జరిగిన ఇన్నర్ ఇంజనీరింగ్ తరగతులకు హాజరయ్యాక నా ఆలోచనా దృక్పథంలో మార్పు వచ్చింది. ప్రతి గేమ్‌ను తాజాగా ఆరంభించడం అలవాటు చేసుకున్నాక నా ఆటతీరు మారింది. మిత్రులు ప్రజ్ఞానంద, గుకేష్‌తో కలిసి ఆడడం, సంయుక్తంగా ఈ టైటిల్ సాధించడం చాలా సంతోషంగా ఉంది.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి-హైదరాబాద్)

అర్జున్@3

చెస్ ఒలింపియాడ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి కెరీర్‌లో అత్యుత్తమంగా ప్రపంచ మూడో ర్యాంక్‌కు చేరాడు. ఫిడే ఆదివారం ప్రకటించిన ర్యాంకుల్లో అతడు ఈ ఘనత అందుకున్నాడు. ఈక్రమంలో అమెరికా స్టార్ ఫాబియానో కరువానాను అర్జున్ వెనక్కు నెట్టాడు. ఒలింపియాడ్‌లో మొత్తం 11 గేముల్లో ఏడింటిలో నెగ్గిన అర్జున్..రెండింటిని డ్రా చేసుకున్నాడు. గుకేష్ ఐదో ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. ఇక కార్ల్‌సన్, నకామురా తొలి రెండు ర్యాంకుల్లో నిలిచారు.

తిప్పేసి.. గెలిచేసి

తొలి టెస్టు భారత్‌దే

280 రన్స్‌తో బంగ్లాపై ఘనవిజయం

అశ్విన్‌కు ఆరు, జడేజాకు మూడు వికెట్లు



తొలి టెస్టు ఆరంభం.. ముగింపు అంతా అశ్విన్‌దే. టాపార్డర్ విఫలమై ఇబ్బంది పడుతున్న దశలో మొదటి రోజు బ్యాట్ పవర్ ఏంటో చూపాడు. ఆ తర్వాత నాలుగో ఇన్నింగ్స్‌లో సుడులు తిరిగే బంతులతో బంగ్లాదేశ్ బ్యాటర్లను టపటపా పెవిలియన్‌కు చేర్చాడు. సొంత గడ్డపై ఈ వెటరన్ స్పిన్నర్ నిఖార్సయిన ఆల్‌రౌండ్‌షోతో భారత్ నాలుగో రోజే మ్యాచ్‌ను పూర్తి చేసి అద్భుత విజయాన్ని అందుకుంది. జడేజా కూడా ఇదే రీతిన రాణించడం విశేషం.

చెన్నై: బంగ్లాదేశ్‌తో రెండు టెస్టుల సిరీస్‌ను భారత్ ఘనంగా ఆరంభించింది. 'లోకల్ బాయ్' బ్యాట్‌తో.. బంతితో అశ్విన్ (6/88) కెరీర్‌లో చిరస్మరణీయ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఫలితంగా 515 పరుగుల భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన బంగ్లాదేశ్ నాలుగో రోజే కుప్పకూలింది. అశ్విన్‌తో పాటు మరో స్పిన్నర్ జడేజా (3/58) కూడా బంతితో రాణించడంతో బంగ్లా రెండో ఇన్నింగ్స్‌లో 234 పరుగులకు ఆలౌటైంది. దీంతో టీమిండియా 280 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. అలాగే సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది. చివరిదైన రెండో టెస్టు కాన్పూర్‌లో ఈనెల 27న ఆరంభం కానుంది. కెప్టెన్ షంటో (82), షాద్‌మన్ ఇస్లాం (35), జకీర్ హసన్ (33), షకీబ్ (25) మాత్రమే ఫర్వాలేదనిపించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అశ్విన్ నిలిచాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 376, రెండో ఇన్నింగ్స్‌లో 287/4 డిక్లేర్ చేయగా.. బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులు సాధించింది.

స్పిన్‌కు దాసోహం: భారత్‌తో ఆడడమంటే పాకిస్థాన్‌తో ఆడినట్టు కాదని బంగ్లాదేశ్‌కు సులువుగానే అర్థమైంది. 158/4 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన పర్యాటక జట్టుకు స్పిన్‌తో గాలమేసింది. బంతి టర్న్ కావడంతో అశ్విన్, జడేజా పన్నిన ఉచ్చు లో బంగ్లా బ్యాటర్లు విలవిల్లాడారు. క్రీజులో షంటో, షకీబ్ ఉండడం తో పాక్‌పై మాదిరే ఏమైనా పోరాడగలరా? అనే సందేహం వ్యక్తమైంది. కానీ ఈ ఇద్దరి నుంచి కొద్దిసేపే ప్రతిఘటన ఎదురై ఐదో వికెట్‌కు 48 పరుగులు జోడించగలిగారు. అయితే, అశ్విన్ బంతి తీసుకోగానే వికెట్ల పతనం ఆరంభమైంది. మొదట 52వ ఓవర్‌లో అతడు షకీబ్‌ను అవుట్ చేయడంతో భారత్ విజయం వైపు అడుగులు వేసింది. అటు షంటో వీలు చిక్కినప్పుడల్లా షాట్లు బాదినా అతడికి సహకారం అంద లేదు. ఆదివారం పడిన ఆరు వికెట్లలో అశ్విన్, జడ్డూ చెరి సగం తీయడంతో లంచ్ సెషన్‌లోపే ఆట ముగిసింది.


స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 376
రెండో ఇన్నింగ్స్: 287/4 డిక్లేర్డ్
బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: 149
బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్: జకీర్ (సి) జైస్వాల్ (బి) బుమ్రా 33; షాద్‌మన్ (సి) గిల్ (బి) అశ్విన్ 35; షంటో (సి) బుమ్రా (బి) జడేజా 82; మోమినుల్ (బి) అశ్విన్ 13; ముష్ఫికర్ (సి) రాహుల్ (బి) అశ్విన్ 13; షకీబ్ (సి) జైస్వాల్ (బి) అశ్విన్ 25; లిట్టన్ (సి) రోహిత్ (బి) జడేజా 1; మెహిదీ హసన్ (సి) జడేజా (బి) అశ్విన్ 8; టస్కిన్ అహ్మద్ (సి) సిరాజ్ (బి) అశ్విన్ 5; హసన్ (బి) జడేజా 7; నహీద్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 62.1 ఓవర్లలో 234 ఆలౌట్. వికెట్ల పతనం: 1-62, 2-86, 3-124, 4-146, 5-194, 6-205, 7-222, 8-222, 9-228, 10-234. బౌలింగ్: బుమ్రా 10-2-24-1; సిరాజ్ 10-5-32-0; ఆకాశ్ దీప్ 6-0-20-0; అశ్విన్ 21-0-88-6; జడేజా 15.1-2-58-3.

1 నాలుగో ఇన్నింగ్స్‌లో ఎక్కువ వికెట్లు (99) తీసిన భారత బౌలర్‌గా అశ్విన్. కుంబ్లే (94)ను అధిగమించాడు.

2 ఒకే టెస్టులో ఎక్కువసార్లు (4) సెంచరీ, 5+ వికెట్లు తీసిన రెండో ప్లేయర్‌గా అశ్విన్. ఇయాన్ బోథమ్ (5) టాప్‌లో ఉన్నాడు.

సుదీర్ఘ సీజన్ కఠినమే..



'డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం మేం సుదీర్ఘ సీజన్ ఆడాల్సి ఉంది. ఇంకా తొమ్మిది టెస్టులున్నాయి. మరో మూడు, నాలుగు నెలల్లో వీటిని ఆడాల్సి ఉందని తల్చుకుంటే భయంగా ఉంటుంది. కానీ అలా కాకుండా ఒక్కో టెస్టుకు మాత్రమే పరిమితమైతే ప్రశాంతంగా ఉంటుంది. టెస్టుల మధ్య లేక సిరీస్‌ల మధ్య తీసుకునే విశ్రాంతి ఉత్తేజాన్నిస్తుంటుంది. ఇప్పుడు నేను 25-30 ఏళ్ల మధ్యలో ఆడినట్టు ఆడలేను. 38 ఏళ్ల వయస్సులో రెట్టింపు కృషి చేయాల్సి ఉంటుంది. అందుకే శారీరక శిక్షణ కాకుండా యోగా చేస్తాను. ఇక ఈ పిచ్‌పై మంచి బంతులు విసిరినా పరుగుల కోసం ప్రయత్నించవచ్చు. అయితే బౌన్స్ ఎక్కువగా ఉంటుంది' - ఆర్.అశ్విన్

చరిత్రలో తొలిసారి..

బంగ్లాతో తొలి టెస్టు విజయం భారత్‌కు అరుదైన ఘనతను సాధించిపెట్టింది. తమ 92 ఏళ్ల సుదీర్ఘ ఫార్మాట్ చరితలో తొలిసారి ఓటములకన్నా ఎక్కువ విజయాలందుకుంది. ఇప్పటి వరకు భారత్ 580 మ్యాచ్‌లు ఆడగా ఇందులో 179 విజయాలు, 178 ఓటములన్నాయి. అలాగే 222 మ్యాచ్‌లు డ్రా, 1 టైగా ముగిశాయి.

రెండో టెస్టుకూ ఇదే జట్టు..

కాన్పూర్‌లో జరిగే రెండో టెస్టు కోసం భారత జట్టును ప్రకటించారు. అయితే సెలెక్టర్లు ఈ టీమ్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. కెప్టెన్ రోహిత్ శర్మ ఆధ్వర్యంలో తొలి టెస్టులో ఆడిన ఆటగాళ్లనే కొనసాగిస్తున్నట్టు బీసీసీఐ ప్రకటించింది. అయితే ఈ మ్యాచ్‌కు పనిఒత్తిడిలో భాగంగా పేసర్ బుమ్రాకు విశ్రాంతినిస్తారనే ఊహాగానాలు వినిపించాయి.

దులీప్ ట్రోఫీ విజేత ఇండియా-ఎ

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి): ఇండియా-ఎ జట్టు దులీప్ ట్రోఫీ విజేతగా నిలిచింది. ఆఖరి మ్యాచ్‌లో ఇండియా-ఎ 132 పరుగుల తేడాతో ఇండియా-సి జట్టును చిత్తు చేసింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండింటిలో నెగ్గి ఒకటి ఓడిన ఇండియా-ఎ మొత్తం 12 పాయింట్లతో టాప్‌లో నిలిచి ట్రోఫీని సొంతం చేసుకొంది. ఇండియా-సి 9 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఆటకు చివరి రోజైన ఆదివారం 350 పరుగుల లక్ష్య ఛేదనలో ఇండియా-సి రెండో ఇన్నింగ్స్‌లో 217 రన్స్‌కు ఆలౌటైంది. సాయి సుదర్శన్ (111) శతకం వృథా అయింది. అంతకుముందు ఇండియా-ఎ రెండో ఇన్నింగ్స్‌ను 286/8 వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా-ఎ 297, ఇండియా-సి 234 రన్స్ సాధించాయి.

రికీ భుయ్ అజేయ శతకం.. ఇండియా 'డి'కి ఓదార్పు విజయం: పేసర్ అర్ష్‌దీప్ సింగ్ (6/40) నిప్పులు చెరగడంతో.. దులీప్ ట్రోఫీని ఇండియా-డి విజయంతో ముగించింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిన ఇండియా-డి.. చివరి మ్యాచ్‌లో ఇండియా-బిపై 257 రన్స్‌తో గెలిచింది. ఆటకు చివరి రోజు ఓవర్‌నైట్ స్కోరు 244/5తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా-డి 305 రన్స్‌కు ఆలౌటైంది. 67 రన్స్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి ప్రత్యర్థి ముందు 373 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. రికీ భుయ్ (119 నాటౌట్) సెంచరీ చేశాడు. ఛేదనలో ఇండియా-బి రెండో ఇన్నింగ్స్‌లో 115 రన్స్‌కే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా-డి 349, ఇండియా-బి 282 రన్స్ సాధించాయి.



పారా అథ్లెట్లకు ఆర్థిక సాయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): పారాలింపిక్స్‌లో పతకాలు సాధించిన ముగ్గురు క్రీడాకారులు, వారి కోచ్‌లకు తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చాముండేశ్వర్‌నాథ్ కుమార్తె రమ్య రూ. 20 లక్షలు ఆర్థిక సాయం అందించారు. వరంగల్ అథ్లెట్ దీప్తితో పాటు తులసీమతి, నితీశ్‌కు తలో రూ.5 లక్షలు, కోచ్ నాగపురి రమేశ్ సిబ్బందికి రూ.5 లక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ గోపీచంద్ పాల్గొన్నారు.

కివీస్ లక్ష్యం 275

ప్రస్తుతం 207/8
లంకతో తొలి టెస్టు


రచిన్ రవీంద్ర (91 బ్యాటింగ్)

గాలె: రచిన్ రవీంద్ర (91 బ్యాటింగ్) ఒంటరి పోరాటంతో.. శ్రీలంక, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న తొలి టెస్ట్ రసవత్తరంగా మారింది. 275 పరుగుల లక్ష్య ఛేదనలో ఆఖరి రోజు విజయానికి కివీస్‌కు 68 పరుగులు కావాల్సి ఉండగా.. లంకకు రెండు వికెట్లు చాలు. ఆటకు నాలుగో రోజు ఓవర్‌నైట్ స్కోరు 237/4తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన లంక 309 పరుగులకు ఆలౌటైంది. ధనంజయ డిసిల్వా (40), కుశాల్ మెండిస్ (23) కొంతసేపు పోరాడారు. ఎజాజ్ పటేల్ 6 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన న్యూజిలాండ్ ఆదివారం ఆట ముగిసే సమయానికి 207/8 స్కోరు చేసింది. రవీంద్రతోపాటు పటేల్ క్రీజులో ఉన్నాడు. ప్రభాత్ జయసూర్య రమేష్ మెండిస్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో లంక 305 పరుగులు చేయగా.. న్యూజిలాండ్ 340 స్కోరు చేసింది.

బిజినెస్
వరంగల్ ● సోమవారం 23 సెప్టెంబరు 2024

ఈ వారం మరో 11 ఐపీఓలు

» 14 కంపెనీల షేర్ల లిస్టింగ్

ముంబై: ఈ వారం కూడా పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) మార్కెట్ సందడిగా ఉండనుంది. దాదాపు రూ.900 కోట్ల సమీకరణ కోసం 11 కంపెనీలు ఐపీఓకు వస్తున్నాయి. ఇందులో మన్‌బా ఫైనాన్స్, కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ అండ్ రిఫ్రిజిరేషన్ అనే రెండు కంపెనీల ఐపీఓలు మాత్రమే మెయిన్‌బోర్డు కంపెనీల ఐపీఓలు. మిగతా తొమ్మిది ఎస్ఎంఈ కంపెనీలు. వీటికి తోడు ఈ వారం 14 కంపెనీల ఐపీఓల షేర్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్ట్ కానున్నాయి.

లీలా ప్యాలెస్ నుంచి రూ.5,000 కోట్ల ఐపీఓ

మరోవైపు లీలా ప్యాలెసెస్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ మాతృసంస్థ స్కోలస్ బెంగళూరు లిమిటెడ్ కూడా రూ.5,000 కోట్ల ఐపీఓకు సిద్ధమవుతోంది. ఇందు కోసం ఆదివారం సెబీకి దరఖాస్తు సమర్పించింది. సెబీ ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకపోతే దేశ హాస్పిటాలిటీ చరిత్రలో ఇదే అతిపెద్ద ఐపీఓ కానుంది. రూ.5,000 కోట్ల ఐపీఓలో రూ.2,000 కోట్లు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా, మిగతా రూ.3,000 కోట్లు కొత్త ఈక్విటీ షేర్ల జారీ ద్వారా సమీకరిస్తారు.

కాగా సోలార్ ఎనర్జీ సొల్యూషన్స్ అందించే సోలార్91 క్లీన్‌టెక్ అనే ఎస్ఎంఈ కంపెనీ కూడా ఐపీఓకు సిద్ధమైంది. ఐపీఓ ద్వారా రూ.100 కోట్లు సమీకరించేందుకు సెబీకి దరఖాస్తు చేసింది.

పండగల సీజన్‌పై

లగ్జరీ కార్ల కంపెనీల భారీ ఆశలు

ఈ ఏడాది 50,000కు పైగానే విక్రయాలు



న్యూఢిల్లీ: పండగల సీజన్ దగ్గర పడుతోంది. దీంతో కార్ల కంపెనీలు ముఖ్యంగా మెర్సిడెజ్ బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడి వంటి లగ్జరీ కార్ల తయారీ కంపెనీలు.. అమ్మకాలపై భారీగా ఆశలు పెట్టుకున్నాయి. ఇందుకోసం ఇప్పటికే మార్కెట్లో ఉన్న పాపులర్ మోడల్స్‌తో పాటు మరిన్ని కొత్త మోడల్స్ మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. కొన్ని కంపెనీలు ఇప్పటికే కొన్ని లగ్జరీ మోడల్స్‌ను మార్కెట్లోకి విడుదల చేశాయి. మరికొన్ని కంపెనీలు వచ్చే వారం, పది రోజుల్లో మార్కెట్లోకి విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే పండగల సీజన్ ప్రత్యేక ఆఫర్లు మరో ఎత్తు. లగ్జరీ కార్ల కంపెనీలతో పాటు డీలర్లు కూడా తమవైన మరిన్ని ఆఫర్లు జోడిస్తున్నారు. దీంతో ఈ ఫెస్టివల్ సీజన్‌లో దేశంలో లగ్జరీ కార్ల అమ్మకాల వృద్ధి రేటు రెండంకెల్లో ఉంటుందని ఆశిస్తున్నట్టు మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ చెప్పారు.

జోరుగా అమ్మకాలు

గత ఏడాది మన దేశంలో 40 లక్షలకు పైగా కార్లు అమ్ముడయ్యాయి. అందులో లగ్జరీ కార్ల అమ్మకాలు రెండు శాతం కూడా లేవు. ఈ ఏడాది మాత్రం ఈ అమ్మకాలు 50,000 నుంచి 51,000 మధ్య ఉండే అవకాశం ఉందని మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ చెప్పారు. హై ఎండ్ కార్లపై ప్రస్తుతం 28 శాతం జీఎస్‌టీకి తోడు మరో 20 శాతం సెస్ విధిస్తున్నారు. ఇది చాలదన్నట్టు రాష్ట్ర ప్రభుత్వాలు జీరో నుంచి 20 శాతం వరకు రోడ్ ట్యాక్స్ విధిస్తున్నాయి. ప్రభుత్వాలు ఈ పన్నులను హేతుబద్ధం చేస్తే దేశంలో లగ్జరీ కార్ల అమ్మకాలు మరింత జోరందుకుంటాయని కంపెనీలు చెబుతున్నాయి.

'ఈవీ'ల జోష్

వ్యాపారంలో 'ట్రెండ్ ఈజ్ మై బెస్ట్ ఫ్రెండ్' అంటారు. లగ్జరీ కార్ల కంపెనీలూ ఈ మాటను బాగా వంట పట్టించుకున్నాయి. ఇందులో భాగంగా రెండు ప్రధాన నగరాల మధ్య ప్రయాణించేందుకు వీలుగా హైఎండ్ లగ్జరీ ఈవీలను మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. మెర్సిడెజ్ బెంజ్ ఇప్పటికే తన మేబాక్ సీరిస్‌లో రెండు హైఎండ్ ఈవీలను విడుదల చేసింది. ఒకసారి చార్జింగ్ చేస్తే తమ ఈవీల్లో 600 నుంచి 800 కిలోమీటర్ల వరకు రీచార్జి అవసరం లేకుండా ప్రయాణించవచ్చని కంపెనీ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ చెప్పారు. ఈవీలపై కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల పన్ను రాయితీలు కూడా ఇందుకు దోహదం చేస్తున్నాయి. ఇవన్నీ ఈ ఫెస్టివల్ సీజన్‌లో దేశంలో లగ్జరీ కార్ల అమ్మకాలకు బాగా కలిసొస్తుందని ఆశిస్తున్నట్టు ఆడి ఇండియా చీఫ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ తెలిపారు.

నోకియా, ఎరిక్సన్, సామ్‌సంగ్‌లకు వొడాఫోన్ ఐడియా 30,000 కోట్ల ఆర్డర్



న్యూఢిల్లీ: పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో ఉన్న వొడాఫోన్ ఐడియా మరోసారి భారత టెలికాం మార్కెట్లో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అవుతోంది. ఇందుకు పెద్దఎత్తున తన 4జీ సేవలను విస్తరించడంతో పాటు 5జీ సేవల ప్రారంభానికీ సిద్ధమవుతోంది. ఇందుకు అవసరమైన నెట్‌వర్క్ యంత్రపరికరాల కొనుగోలు కోసం నోకియా, ఎరిక్సన్, సామ్‌సంగ్ కంపెనీలకు 360 కోట్ల డాలర్ల (సుమారు రూ.30,000 కోట్లు) విలువైన కాంట్రాక్టు ఇచ్చింది. ఈ కంపెనీలు ఈ పరికరాల సరఫరా వచ్చే నెల నుంచే ప్రారంభిస్తాయి. 4జీ, 5జీ టెలికాం సేవల ద్వారా రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ కంపెనీలతో దీటుగా పోటీపడవచ్చని వొడాఫోన్ ఐడియా భావిస్తోంది.

హైదరాబాద్‌లో ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్

మరో హాస్పిటల్

» రూ.220 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హాస్పిటల్స్ చెయిన్ ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ హైదరాబాద్‌లో మరో హాస్పిటల్‌ను ఏర్పాటు చేస్తోంది. రూ.220 కోట్ల పెట్టుబడితో 300 పడకలతో ఏర్పాటు చేసే ఈ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పిల్లలు, మహిళల అనారోగ్య సమస్యలపైనే దృష్టి పెట్టనుంది. 2026 డిసెంబరు నాటికి రెండు దశల్లో ఈ హాస్పిటల్‌ను పూర్తి చేయాలని ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ భావిస్తోంది. ఆస్టర్ ఇప్పటికే బెంగళూరులో పిల్లలు, స్త్రీల ఆరోగ్య సమస్యల కోసం ప్రత్యేక ఆసుపత్రిని నిర్వహిస్తోంది. ఈ ఆసుపత్రి తరహాలోనే హైదరాబాద్ చిల్డ్రన్, ఉమెన్ హాస్పిటల్‌ను అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేయనుంది. ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ ఇప్పటికే హైదరాబాద్ అమీర్‌పేట ప్రాంతంలో 204 పడకలతో ఒక మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్వహిస్తోంది.

26,100 పైన బుల్లిష్

(సెప్టెంబరు 23-27 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో నిఫ్టీ

నిఫ్టీ గత వారం 25,849-25,336 పాయింట్ల మధ్యన కదలాడి 434 పాయింట్ల లాభంతో 25,791 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 26,100 పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

p 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,530, 25,418, 25,238, 25,030 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 26,100 బ్రేక్‌డౌన్ స్థాయి: 25,300
నిరోధ స్థాయిలు: 26,000, 26,100, 26,200
(25,900 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 25,600, 25,500, 25,400
(25,700 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	555
వరంగల్	527	గోదావరి	550
చిత్తూరు	553	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	116
వరంగల్	120	గుంటూరు	119
కరీంనగర్	120	ఒంగోలు	119
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	113
కర్నూలు	120	నెల్లూరు	113
విశాఖపట్నం	105	అనంతపురం	113
గోదావరి	116		

లాభాల స్వీకరణకు చాన్స్!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఆటుపోట్లకు లోనయ్యే అవకాశాలున్నాయి. అంతర్జాతీయ సంకేతాలు, యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్ల కోతతో మార్కెట్లలో ఊపు కనిపిస్తోంది. సూచీలు ఇప్పటికే గరిష్ఠాలకు చేరటంతో ఇన్వెస్టర్లు ఏ క్షణమైనా లాభాల స్వీకరణకు దిగే అవకాశం ఉంది. ఈ వారం నిఫ్టీకి 25,550 వద్ద మద్దతు స్థాయిలుండగా, 25,800 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మెరుగైన సంకేతాలు రాకుంటే ప్రైస్ యాక్షన్ టైట్‌గా ఉండే అవకాశం ఉంది. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో బలం పెరుగుతోంది. ఎఫ్ఎంసీజీ, ఐటీ, ఫార్మా రంగాలు బుల్లిష్‌గా ఉన్నాయి.

స్టాక్ రికమండేషన్స్

జేఎస్‌డబ్ల్యూ స్టీల్: జూలై నెలలో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరులో దిద్దుబాటు మొదలైంది. 15 శాతం వరకు పతనమయ్యాయి. రూ.875 స్థాయిలో మద్దతు తీసుకున్న ఈ షేరు మూడు సార్లు రూ.970 వద్ద నిరోధాన్ని ఎదుర్కొంది. గత శుక్రవారం నాటి సెషన్లో భారీ వాల్యూమ్‌తో ఈ స్థాయిని అధిగమించిన ఈ షేరు 3.50 శాతం లాభంతో రూ.981 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.980/960 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,050/1,100 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.940 స్థాయిని స్టాప్ లా‌స్‌గా పెట్టుకోవాలి.

ఎల్ అండ్ టీ: కొన్ని నెలలుగా సైడ్‌వే‌స్‌లో చలిస్తున్న ఈ కౌంటర్‌లో ప్రైస్ యాక్షన్ టైట్ అవుతోంది. మరోసారి కీలక నిరోధ స్థాయి రూ.3,860కి చేరువ అవుతోంది. ఒకవేళ దీన్ని అధిగమిస్తే భారీ ర్యాలీకి ఆస్కారం ఉంది. లేదంటే పడినప్పుడు కొనుగోలు చేయటం మంచిది. గత శుక్రవారం ఈ షేరు 2.99 శాతం లాభంతో రూ.3,860 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.3,750/ 3,700 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.3,950 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,660 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

డీఎల్ఎఫ్: కొన్ని నెలల అప్‌ట్రెండ్ తర్వాత ఈ షేరులో మొదలైన కన్సాలిడేషన్ ఇంకా కొనసాగుతోంది. ప్రస్తుతం చక్కని బేస్ ఏర్పడుతోంది. ప్రస్తుతం ఈ షేరు కీలక నిరోధ స్థాయి రూ.870 వద్ద కదలాడుతోంది. గత శుక్రవారం 3.33 శాతం లాభంతో రూ.877 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో బ్రేకౌట్ జరిగే అవకాశం ఉంది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.870 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.950/990 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.845 స్థాయిని స్టాప్ లా‌స్‌గా పెట్టుకోవాలి.

ఎస్కార్ట్స్ కుబోటా: జీవితకాల గరిష్ఠాన్ని అందుకున్న ఈ షేర్లలో 16% మేర కరెక్షన్ జరిగింది. సెప్టెంబరులో అక్యుములేషన్ కనిపించింది. గత శుక్రవారం గణనీయమైన వాల్యూమ్‌తో ఈ షేరు ఏకంగా 6.88% లాభంతో రూ.4,079 వద్ద క్రాస్‌లైన్ నిరోధాన్ని దాటింది. చక్కని రిస్క్ రివార్డుతో ఆకర్షణీయంగా కనిపిస్తున్న ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.4,050 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.4,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.3,950 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

మ్యాన్‌కైండ్ ఫార్మా: ఈ షేరులో ఈ ఏడాది ఆరంభంలో మొదలైన కరెక్షన్ ముగిసింది. ప్రస్తుతం ఈ షేరు కీలక నిరోధ స్థాయిని అధిగమించింది. మంచి స్ట్రెంత్‌తో నిలదొక్కుకుంటోంది. గత శుక్రవారం 4.52% లాభంతో రూ.2,355 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.2,525 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,600/ 2,750 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.2,500 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ

26,000 చేరువలో నిఫ్టీ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం తొలి నాలుగు సెషన్లలో మైనర్ కరెక్షన్‌లో ట్రేడయినా శుక్రవారం బలమైన ర్యాలీ సాధించింది. నాలుగు రోజుల కరెక్షన్‌లో కూడా ప్రధాన మద్దతు స్థాయి 25,000 కన్నా పైన నిలకడగా ఉండడం మార్కెట్లో బలానికి సంకేతం. చివరికి వారం మొత్తం మీద 435 పాయింట్ల లాభంతో వారం గరిష్ఠ స్థాయి 25,800 చేరువలో ముగిసింది. గత కొద్ది వారాల్లో నిఫ్టీ ఎలాంటి కరెక్షన్ లేదా కన్సాలిడేషన్ లేకుండా 23,800 స్థాయి నుంచి 2,000 పాయింట్ల మేరకు రికార్డు ర్యాలీని సాధించింది. అయితే మిడ్‌క్యాప్ సూచీ తొలుత బలమైన కరెక్షన్ సాధించి 2,000 పాయింట్లు నష్టపోయినా శుక్రవారం బలమైన బౌన్స్‌బ్యాక్ సాధించి చివరికి 175 పాయింట్ల లాభంతో ముగిసింది. స్మాల్‌క్యాప్ సూచీ మాత్రం 170 పాయింట్ల నష్టంతో ముగిసింది. గత కొద్ది వారాలుగా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు కరెక్షన్ సాధిస్తూ వస్తున్నాయి. మానసిక అవధి 26,000 వద్ద నిఫ్టీ అప్రమత్త సానుకూల ధోరణిలో ప్రారంభం కావచ్చు. తదుపరి దిశ తీసుకునే ముందు కన్సాలిడేషన్ ఏర్పడవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ధోరణి ప్రదర్శించినట్టయితే శుక్రవారం నాటి గరిష్ఠ స్థాయి 25,850 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మానసిక అవధి 26,000. ఇక్కడ కన్సాలిడేషన్ లేదా కరెక్షన్ ఉండవచ్చు.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 25,600 కన్నా దిగజారితే మైనర్ బలహీనతలో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 25,400. భద్రత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో ప్రవేశిస్తుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారంలో అన్ని సూచీల కన్నా మెరుగ్గా ట్రేడయి 1,850 పాయింట్ల మేరకు లాభపడి 53,800 వద్ద క్లోజయింది. ఈ వారంలో పుల్‌బ్యాక్ రియాక్షన్ ఏర్పడవచ్చు. ప్రధాన నిరోధం 54,000. సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. మద్దతు స్థాయి 53,300 కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

పాటర్న్: మధ్యకాలిక నెలవారీ చార్టుల ప్రకారం మార్కెట్ ఓవర్‌బాట్ స్థితిలో ఉన్నట్టు ఆర్ఎస్ఐ సూచీ సంకేతం ఇస్తోంది. గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తంగా ఉండాలన్న సంకేతం ఇది. మార్కెట్ ప్రస్తుతం 26,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిరోధం ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు		
నిరోధం :	25,850	25,930
మద్దతు :	25,760	25,700

సేవ్ దామగుండం..

భావి తరాల కోసం ఆ అడవిని కాపాడుకోవాలి

» ధర్నా చౌక్‌లో జేఏసీ నేతల నిరసన

కవాడిగూడ/హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజధానికి అతి దగ్గరలో వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం అడవుల్లో 3 వేల ఎకరాల రక్షిత అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ స్టేషన్ నిర్మాణాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఉపసంహరించుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. లేదంటే పర్యావరణవేత్తలు, సామాజికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి స్టేషన్ నిర్మాణ పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. భావి తరాలకు మంచి ఆరోగ్యం అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని కోరారు. సేవ్ దామగుండం జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద నిరసన చేపట్టారు. సినీ దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, మెతుకు ఆనంద్, సామాజికవేత్త చెరుకు సుధాకర్, సేవ్ దామగుండం జేఏసీ కోఆర్డినేటర్ రామన్న మాదిగ, నిర్వాహకురాలు గీత హాజరయ్యారు. పరిగి, వికారాబాద్ రంగారెడ్డి జిల్లాల నుంచి ప్రకృతి ప్రేమికులు పెద్దఎత్తున తరలివచ్చారు. రాడార్ స్టేషన్ కోసం.. దామగుండం అడవిలోని 12 లక్షల చెట్లను తొలగించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు ఇచ్చాయని వక్తలు ఆరోపించారు. అనేక సంవత్సరాలుగా జంట నగరాలకు వన మూలికలు అందిస్తున్న అడవిలో.. నరికివేసిన వాటి స్థానంలో 12 లక్షల మొక్కలను నాటుతామని చెప్పడం దారుణమన్నారు.అడవుల నరికివేతకు అనుమతులిచ్చిన రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలోనే తొలిస్థానంలో ఉందన్న సంగతిని గుర్తుచేశారు. ఉన్న చెట్లను తొలగించి ప్రజలకు ఎలాంటి ఆరోగ్యం అందిస్తారని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కలను పెంచాలంటూ పథకాలు తెస్తూనే.. అడవిలోని 12 లక్షల చెట్లను ఎలా తొలగిస్తారని నిలదీశారు. ప్రభుత్వం మొండిగా ముందుకెళ్తే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని సేవ్ దామగుండం నేతలు హెచ్చరించారు. ధర్నాలో పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, ఆదివాసీ సంఘం నేత రవీందర్, వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.



ధర్నాచౌక్‌లో నిరసన తెలుపుతున్న దృశ్యం

అవసరమే.. కానీ, అక్కడొద్దు: సీపీఎం

దామగుండంలో రాడార్ స్టేషన్ నిర్మాణంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. రాడార్ స్టేషన్ అవసరమేనని, అయితే.. దామగుండంలో కాకుండా మరో ప్రాంతానికి దాన్ని తరలించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు.

అటవీ సంపదకు హాని కలగకుండా

రాడార్ స్టేషన్ నిర్మాణం

» అటవీ సంరక్షణ ప్రధానాధికారి ఆర్ఎం డోబ్రియాల్

హైదరాబాద్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దామగుండంలో 48 శాతం విస్తీర్ణాన్ని తూర్పు నౌకా దళ రాడార్ స్టేషన్ నిర్మాణానికి వినియోగిస్తుండగా మిగిలిన భూమిలో అటవీ సంపదకు ఎలాంటి హానీ కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలంగాణ అటవీ సంరక్షణ ప్రధాన అధికారి రాకేశ్ మోహన్ డోబ్రియాల్ తెలిపారు. రాడార్ స్టేషన్ నిర్మాణానికి 12 లక్షలకు పైగా వృక్షాలను తొలగిస్తున్నట్టుగా వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖకు అనుబంధంగా పనిచేస్తున్న ఫారెస్ట్ అడ్వైజరీ అథారిటీ 1,93,562 చెట్లను మాత్రమే తొలగించనున్నట్టు స్పష్టం చేసిందన్నారు. వీటికి బదులుగా రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల అడవుల్లోని 2,348 హెక్టార్లలో 17,55,070 చెట్లను అటవీ శాఖ పునరుద్ధరించనున్నదని పేర్కొన్నారు. స్టేషన్ నిర్మాణాలకు పోగా మిగిలిన స్థలాల్లో మొక్కలను పెంచే అవకాశముందని తెలిపారు. రాడార్ స్టేషన్ నిర్మాణ ప్రతిపాదనలకు గ్రామ సభల ఆమోదం లభించిందని, షెడ్యూల్డ్ తెగలు, అడవి బిడ్డలకు ఎలాంటి ఇబ్బంది లేదని కలెక్టర్ నుంచి ఆమోదం లభించాకే పనులు ప్రారంభించనున్నట్టు వివరించారు. ఈ ప్రాజెక్టుకు భూసేకరణ కోసం కేంద్రం 2010 నుంచి చర్యలు ప్రారంభించినట్టు తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వమే ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తోందన్న వాదనలో నిజం లేదన్నారు. ఈ ప్రాంతంలో 500 ఏళ్లుగా కొలువైన శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానాన్ని తరలిస్తున్నారనే వార్తలను డోబ్రియాల్ ఖండించారు.

'అమృత్'లో అక్రమాలు లేవని తేలితే

రాజకీయ సన్యాసం

(మొదటిపేజీ తరువాయి)

పత్రాలతో హైకోర్టు సీజే వద్దకు ఇద్దరం వెళదాం. అది ఇష్టం లేదంటే ఢిల్లీ సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ వద్దకైనా వెళదాం. అప్పుడు వాస్తవాలు బయటపడతాయి. సీఎం, మంత్రులు రాజీనామా చేయాల్సి వస్తుంది" అన్నారు. తన బావమరిదికి అక్రమంగా టెండర్లు కట్టబెట్టిన వ్యవహారం రేవంత్ మెడకు చుట్టుకోవడం ఖాయమని.. ఆయన దీనికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. "సూదిని సృజన్ రెడ్డి సీఎం రేవంత్ భార్యకు స్వయానా సోదరుడు. భార్య సోదరుడు బావమరిది కాక ఏమవుతారు. అవినీతి టెండర్ల కోసం సొంత బావమరిదితో సంబంధం లేదని చెప్తారా?" అని మండిపడ్డారు. "కేవలం రూ.2 కోట్ల లాభం ఉన్న బావమరిది కంపెనీకి రూ.1000 కోట్ల కాంట్రాక్టు ఇచ్చి అవినీతి జరగడం లేదంటే ఎవరైనా నమ్ముతారా?" అని నిలదీశారు. ఇప్పటికైనా తప్పును ఒప్పుకొని టెండర్లను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. లేదంటే, గతంలో సోనియాగాంధీ పదవి, మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌చవాన్, కర్ణాటక మాజీ సీఎం యడ్యూరప్ప పదవి పోయినట్లే రేవంత్ పదవి కూడా పోతుందని హెచ్చరించారు. ఇక.. సింగరేణి కార్మికులకు రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది దసరా బోనస్ కాదు.. బోగస్ అని దుయ్యబట్టారు. రూ.4,700 కోట్లు లాభాలు వచ్చాయని డిప్యూటీ సీఎం భట్టి చెప్పిన ప్రకారం సింగరేణి లాభాల్లో 33% వాటా ఇస్తే ఒక్కో కార్మికునికి రూ.3.70 లక్షలు పంచాల్సి ఉంటుందని.. కానీ, రూ.1.9 లక్షలు బోనస్‌గా ప్రకటించడమంటే.. లాభంలో ఇస్తున్న వాటా 16.2 శాతమేనని.. ఒక్కో కార్మికునికీ రూ.1.8 లక్షల నష్టమని చెప్పారు.

పురపాలకశాఖలో లంచావతారాలు..

కాంగ్రెస్ సర్కారు వచ్చిన 9 నెలల్లోనే పురపాలక శాఖలో లంచావతారాలు చెలరేగుతున్నాయని.. ఫైళ్ల క్లియరెన్స్ నత్తనడకన సాగుతోందని కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ఆరోపించారు. సీఎం వద్దే ఉన్న మునిసిపల్ శాఖ పరిధిలోని హెచ్ఎండీఏలో భారీగా పేరుకుపోతున్న ఫైళ్లు దేనికి సంకేతమని ప్రశ్నించారు. కారణాల్లేకుండా అధికారులు ఫైళ్లను తమవద్దే ఎందుకు తొక్కిపెడుతున్నారని నిలదీశారు. దీని వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయో ప్రజలకు చెప్పాలన్నారు.

నైతిక విలువలు లేని వ్యక్తి కేజ్రీవాల్

» కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏ మాత్రం నైతిక విలువలు లేని వ్యక్తి కేజ్రీవాల్ అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆదివారం విమర్శించారు. మద్యం కుంభకోణంలో జైలుకెళ్లిన వ్యక్తి, కుటుంబాలు, వారి సంక్షేమం గురించి ఆలోచించని నాయకుడు, ప్రజల ఆరోగ్యాలను పణంగా పెట్టి డబ్బులు సంపాదించాలని చూసిన నేత అని మండిపడ్డారు. తనను నమ్మి అధికారాన్ని అప్పగించినా వారి జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురానందుకు ఢిల్లీ ప్రజలకు కేజ్రీవాల్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్‌ఎస్ఎస్ అగ్రనేత మోహన్ భగవత్‌కు కేజ్రీవాల్ ఐదు ప్రశ్నలు వేయడం హాస్యాస్పదంగా ఉందని ఆక్షేపించారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధి: మంత్రి జూపల్లి

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ-హైదరాబాద్ బైక్‌రైడర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బేగంపేట ప్లాజాలో 'రైడ్‌టు నిర్వాణ-బుద్ధవనం' బైక్ ర్యాలీని మంత్రి జూపల్లి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జున సాగర్‌లో బౌద్ధ వారసత్వాన్ని నేటి తరానికి పరిచయం చేయడానికి అన్ని హంగులతో బుద్ధవనం ప్రాజెక్టును ప్రభుత్వం నిర్మించిందని చెప్పారు. అనంతరం టూరిజం ప్లాజా నుంచి తార్నాక వరకు మంత్రి జూపల్లి బైక్ నడిపి బైకర్స్‌లో ఉత్సాహాన్ని నింపారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి: కూనంనేని

కొత్తగూడెం, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): ఆటో, క్యాబ్ కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెం క్లబ్‌లో ఆటో వర్కర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర తృతీయ మహాసభల్లో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో, క్యాబ్ కార్మికులకు ప్రతినెల రూ.12వేలు అందించి ఆదుకోవాలన్నారు. రూ.10లక్షల వరకు బీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

కాళేశ్వరంపై పొన్నంది అవగాహనా రాహిత్యం

» ఎల్లంపల్లి ప్రాజెక్టును పూర్తిచేసింది మేమే: హరీశ్

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై మంత్రి పొన్నం ప్రభాకర్ అవగాహనా రాహిత్యం బయటపడిందని ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు తామే పూర్తి చేశామని పొన్నం గొప్పలు చెప్పుకోవడం విడ్డూరమన్నారు. పెండింగ్ ప్రాజెక్టుగా మిగిలిన ఎల్లంపల్లి ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వమే పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చిందన్న విషయాన్ని పొన్నం మరిచిపోతున్నారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఎల్లంపల్లి ప్రాజెక్టును ఒక కీలకమైన 'బ్యాలెన్సింగ్ రిజర్వాయర్'గా మార్చిన తర్వాతనే జలాశయం మీద ఆధారపడిన అన్ని ప్రాంతాలకు నీటిని అందించే పని ప్రారంభమైందన్నారు. ఉత్తర తెలంగాణ సీనియర్ నాయకుడిగా పొన్నం ప్రభాకర్ కాళేశ్వరం ప్రాజెక్టులో లింకు-1 పునరుద్ధరణపై దృష్టి పెట్టాలన్నారు. కాగా, హైదరాబాద్‌లో నిర్వహించిన సీఎల్పీ సమావేశానికి అరికెపూడి గాంధీ హాజరయ్యారంటూ హరీశ్‌రావు ఎక్స్‌లో ఒక ఫోటోను అప్‌లోడ్ చేశారు. శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమాధానం చెప్పాలని, పార్టీ ఫిరాయింపులపై బుకాయింపులు చాలించాలని హరీశ్ సూచించారు.

కేటీఆర్ కొత్త డ్రామా: ఆది శ్రీనివాస్

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అమృత్ టెండర్లలో అక్రమాలు నిరూపిస్తే.. మంత్రి పదవికి రాజీనామా చేస్తానని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన సవాల్‌కు కేటీఆర్ సమాధానం చెప్పలేక దాటవేస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. రాజీనామా చేయాల్సి వస్తుందని భయపడే.. సిట్టింగ్ జడ్జితో విచారణ అంటూ కొత్త డ్రామా మొదలుపెట్టారని ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఓపెన్ టెండర్లలో అర్హత సాధించిన వారికే కాంట్రాక్టు వచ్చిందని, రూ.3,516 కోట్ల టెండర్లు పిలిస్తే ఆయన రూ.8 వేల కోట్ల అవినీతి జరిగిందని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాంట్రాక్టు పొందిన సృజన్‌రెడ్డి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అల్లుడనే విషయం ముందు కేటీఆర్ తెలుసుకోవాలని వ్యాఖ్యానించారు. అమృత్ టెండర్లపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ బీఆర్ఎస్ నేతలను టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ ప్రశ్నించారు. కాగా, సింగరేణి కార్మికులకు బోనస్‌పై బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ మండిపడ్డారు. గత ప్రభుత్వం ఇచ్చిన బోనస్ కంటే రూ.20వేలు అధికంగా ఇస్తున్నామని స్పష్టం చేశారు.

పెద్దాస్పత్రులపై 'శవ' రాజకీయాలు!

» మరణాలపై రోగుల్ని భయపెడుతున్న నేతలు

» పేదల నమ్మకాన్ని వమ్ము చేస్తున్న పార్టీలు

» నాడు కాంగ్రెస్.. నేడు అదే దారిలో బీఆర్ఎస్

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సర్కారీ దవాఖానాలపై రాజకీయాలు చేస్తున్నారు. పెద్దాస్పత్రులపై ప్రజలు నమ్మకం కోల్పోయేలా చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వెళితే ప్రాణాలు పోతాయన్న భయాన్ని పేదల్లో కల్పిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ధర్మాస్పత్రుల్లో సరైన చికిత్స అందక రోగులు మరణిస్తున్నారంటూ ఆరోపణలు చేయడం, గణాంకాలు విడుదల చేయడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గాంధీ ఆస్పత్రిలో మరణాలపై నాలుగు రోజుల క్రితం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్‌లో ఒక పోస్టు పెట్టారు. 'ఒకే నెలలో గాంధీ ఆస్పత్రిలో 48 మంది పసిగుడ్డులు, 14 మంది బాలింతలు ప్రాణాలు కోల్పోయారని, ఊహించుకుంటేనే ఒళ్లు జలదరిస్తోందని, రాష్ట్రంలో వ్యవస్థలు పనిచేస్తున్నాయా?' అంటూ ప్రశ్నించారు. అలాగే ఒక్క గాంధీలోనే ఇన్ని మరణాలుంటే.. రాష్ట్రంలో పరిస్థితి ఏంటని ఆలోచిస్తే భయంగా ఉందని ఆందోళన వెలిబుచ్చారు. కేటీఆర్ పోస్టుపై వైద్య మంత్రి దామోదర ఘాటుగా స్పందించారు. గాంధీ ఆస్పత్రిపై బురద జల్లి, అక్కడికి వచ్చే నిరుపేదల మనోస్థైర్యాన్ని దెబ్బతీయవద్దని హితవు పలికారు. కార్పొరేట్ ఆస్పత్రులకు లబ్ధి చేకూర్చాలన్నదే ఆయన ప్రయత్నమని ఆరోపించారు. వైద్యమంత్రి కౌంటర్‌పై మళ్లీ కేటీఆర్ స్పందించారు. మరణాలపై సమీక్ష చేయాలని, సంఖ్యను ఎందుకు దాస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. దానిపై మళ్లీ మంత్రి కౌంటరివ్వడంతో బీఆర్ఎస్ తిరిగి స్పందించింది. గాంధీలో మాతాశిశు మరణాలపై సర్కారు అమానవీయంగా స్పందిస్తోందని, ఈ అంశంపై పార్టీ తరఫున ఒక నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. వైద్య శాఖ మాజీ మంత్రి రాజయ్య, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌తో కమిటీ వేశారు. ఆదివారం కేటీఆర్ వారితో సమావేశమయ్యారు. సోమవారం ఆ కమిటీని గాంధీతో పాటు సర్కారీ దవాఖానాలకు వెళ్లాలని సూచించారు. గతంలో కొవిడ్ సమయంలో గాంధీలో రోజూ వందల సంఖ్యలో మరణాలు సంభవించగా.. నాడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కూడా మరణాలను దాచింది. అప్పుడు విపక్షంలో ఉన్న కాంగ్రెస్ కూడా గాంధీ మరణాలపై ప్రశ్నించింది. నాడు కాంగ్రెస్, నేడు బీఆర్ఎస్ పెద్దాస్పత్రులను తమ రాజకీయాల కోసం వాడుకుంటున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఒకే బెడ్‌పై ఇద్దరు ముగ్గుర్ని ఉంచి వైద్యం చేస్తున్న ఫొటోలు మీడియాలో వస్తే.. నాటి సీఎం కేసీఆర్ డాక్టర్లు బాగా వైద్యం చేయడం వల్లనే అంతమంది వస్తున్నారని సమర్థించుకున్నారు. నేడు మళ్లీ అటువంటి కథనాలు, ఫొటోలు వస్తే ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ సర్కారీ వైద్య వ్యవస్థలన్నీ విఫలం అయ్యాయన్న అభిప్రాయాల్ని పేద రోగుల్లో కల్పిస్తోంది. గాంధీ, ఉస్మానియా లాంటి ఆస్పత్రుల్లో మరణాలు పెద్దసంఖ్యలో ఉండడానికి కారణాలు లేకపోలేదు. కేటీఆర్ పేర్కొన్న 14 ప్రసూతి మరణాలన్నీ కూడా చివరి దశలో గాంధీకి వచ్చినవేనని వారి రిపోర్టులను బట్టి తెలుస్తోంది. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొంది, డబ్బులు పెట్టలేక అక్కడి నుంచి చివరి దశలో గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులకు వచ్చే కేసులు భారీ సంఖ్యలో ఉంటాయి. సర్కారీ ఆస్పత్రులకు వచ్చిన ఒకట్రెండు రోజుల్లోనే వారు మరణిస్తున్నారు.

కుటుంబానికో డిజిటల్ కార్డు!

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ శాసనసభాపక్షం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఓ హోటల్‌లో సమావేశమయింది. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ, ఇన్‌చార్జి కార్యదర్శులు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. తొలుత కొత్తగా టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను సీఎల్పీ సన్మానించింది. ఆ తర్వాత ఆయనను నియమించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీకి ధన్యవాదాలు తెలుపుతూ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది.



సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్‌కు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న నేతలు

సమన్వయంతో ముందుకుసాగాలి..

టీపీసీసీ చీఫ్‌కు సన్మానం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీని ఓడించాల్సిన చారిత్రక అవసరం ఉన్న సమయంలో టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌గౌడ్ బాధ్యతలు చేపట్టారన్నారు. పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకెళ్లాలని, ప్రభుత్వ కార్యక్రమాలను పార్టీ నాయకత్వం ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. పార్టీ అనుబంధ విభాగాల్లో పనిచేసిన 36 మందికి నామినేటెడ్ పోస్టులు ఇచ్చామని, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పని చేసినందునే వారికి పదవులు ఇచ్చామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి కచ్చితంగా అవకాశాలు వస్తాయన్నారు. డీసీసీ అధ్యక్ష పదవులను కూడా ప్రజల్లో ఉన్న నాయకులకే ఇవ్వాలని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు సూచించారు. అధికారం కోల్పోయిన ప్రతిపక్షం.. అసహనంతో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలకు పాల్పడుతోందని సీఎం అన్నారు. పార్టీ నేతలు వాటిని తిప్పికొట్టాలన్నారు. ఇన్‌చార్జి మంత్రులు వారానికి రెండుసార్లు జిల్లాల్లో పర్యటించాలని సూచించారు. బీసీ కులగణన చేయాలన్నది రాహుల్‌గాంధీ బలమైన ఆలోచన అని, ఆయన ఆలోచన మేరకు బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులను నియమించామని తెలిపారు. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలంటే కచ్చితంగా జనాభాను లెక్కించాల్సిందేనన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలుపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నాయకత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశామని, ఈ కమిటీ సుప్రీంకోర్టు తీర్పును పూర్తిగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తుందని చెప్పారు.

ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదు..

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ గెలిచి నాలుగోసారి అధికారంలోకి వచ్చేందుకే ప్రధాని మోదీ జమిలి ఎన్నికలను తీసుకువస్తున్నారని రేవంత్ అన్నారు. ఈ నేపథ్యంలో జమిలి ఎన్నికలపై కాంగ్రెస్ నేతలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గడిచిన 9 నెలలుగా తాను ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న కొత్త కార్యక్రమాలను ఎమ్మెల్యేలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వమూ చేయని విధంగా 27 రోజుల్లో రూ.18 వేల కోట్ల మేరకు రైతుల రుణాన్ని మాఫీ చేశామని గుర్తు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ.. ప్రభుత్వానికి ప్రతి నెలా రూ.18 వేల కోట్ల మేరకు రాబడి వస్తోందని తెలిపారు. అయితే అందులో జీతభత్యాలు, అప్పులకు వాయిదాలు, వడ్డీలకే రూ.12 వేల కోట్లు పోతున్నాయన్నారు. మిగిలిన రూ.6 వేల కోట్లతోనే సర్దుబాటు చేసుకుంటూ వస్తున్నామని, దుబారా ఖర్చును పూర్తిగా తగ్గించామని చెప్పారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలు హాజరు!

బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు కూడా సీఎల్పీ సమావేశానికి హాజరయ్యారు. వీరిలో పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కడియం శ్రీహరి తదితరులు ఉన్నారు. అయితే సమావేశం అనంతరం అరికెపూడి గాంధీ సీఎల్పీ సమావేశానికి హాజరు కావడంపై మంత్రి శ్రీధర్‌బాబును మీడియా ప్రశ్నించగా.. ఆయన సీఎల్పీ భేటీలో పాల్గొన్నట్లు మీరు చూశారా? అని ఎదురు ప్రశ్నించారు. ఈ సమావేశం శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో జరిగినందున స్థానిక ఎమ్మెల్యేగా సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసేందుకు గాంధీ వచ్చారని తెలిపారు. గతంలో కేసీఆర్ సీఎం హోదాలో సిద్దిపేటకు వెళితే హరీశ్‌రావు వెళ్లి కలవలేదా? అని వ్యాఖ్యానించారు. కాగా అమెరికా పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, ఇతర కారణాలతో మంత్రి సీతక్క సీఎల్పీ భేటీకి హాజరు కాలేదు. కశ్మీర్‌లో ఎన్నికల ప్రచారంలో ఉన్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కూడా హాజరు కాలేదు. ఖమ్మం ఎంపీ, ఒకరిద్దరు ఎమ్మెల్యేలూ అనివార్య కారణాలతో రాలేకపోయినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

కార్యకర్తలను గెలిపించుకుందాం

» మహేశ్‌కుమార్‌గౌడ్

అసెంబ్లీ ఎన్నికల్లో కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన కార్యకర్తలను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో 90 శాతం స్థానాలను కాంగ్రెస్ గెలవాలని, ఈ విషయంలో ఇన్‌చార్జి మంత్రులకు ఎక్కువ బాధ్యత ఉందని అభిప్రాయపడ్డారు. కార్యకర్తలు, నాయకులకు తాను నిత్యం అందుబాటులో ఉంటానని, తన ఫోన్ ఎప్పుడూ ఆన్‌లోనే ఉంటుందని చెప్పారు. పార్టీకి, ప్రభుత్వానికి మధ్య సమన్వయకర్తగా వ్యవహరిస్తానని, కార్యకర్తలను సమాయత్తం చేసి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే తన లక్ష్యమని అన్నారు. తాను, సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో మమేకమై పనిచేశామని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలను పార్టీ, ప్రజాప్రతినిధులు జనంలోకి తీసుకెళ్లాలన్నారు. కేసీఆర్ పదేళ్లపాటు అబద్ధాలతో రాష్ట్రాన్ని పాలించారని, రూ.7 లక్షల కోట్ల అప్పుల్లో ముంచేసి వెళ్లారని ఆరోపించారు. ఈ దేశానికి ఆశాకిరణం రాహుల్‌గాంధీ అని, ఆయనను ప్రధానిగా చేయడమే ధ్యేయంగా అంతా పని చేయాలని సూచించారు. ప్రధాని మోదీకి భవిష్యత్తు లేదన్నారు. కులం, మతం పేరుతో యువతను తప్పుదారి పట్టిస్తున్నారని, వారిని చైతన్యపరుద్దామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మైనారిటీలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని తెలిపారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ ఆశీస్సులు రాష్ట్ర కాంగ్రెస్‌కు ఎప్పుడూ ఉంటాయన్నారు. రాష్ట్రంలో రెండోసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌పై వెనక్కి వెళ్లలేం

» బాధితులకు నష్టపరిహారం పెంచే యత్నం చేస్తా

» సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సమస్యలన్నీ పరిష్కరిస్తా

» సీపీఎం ప్రతినిధి బృందంతో సీఎం రేవంత్

హైదరాబాద్, సిరిసిల్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు అలైన్‌మెంట్ మార్పుపై నిర్ణయం జరిగిపోయిందని, వెనక్కి వెళ్లడం కష్టమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆర్‌ఆర్‌ఆర్ భూ సేకరణను ముందుగా నిర్ణయించిన అలైన్‌మెంట్ ప్రకారమే చేపట్టాలంటూ సీపీఎం ప్రతినిధులు బీవీ రాఘవులు, ఎస్ వీరయ్య, సీతారాములు, జూలకంటి రంగారెడ్డి తనను సచివాలయంలో కలిసిన సందర్భంగా రేవంత్ తన నిర్ణయాన్ని వెల్లడించారు. అయితే బాధితులకు నష్టపరిహారం పెంచే ప్రయత్నం చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. సిరిసిల్లలో పవర్‌లూమ్‌ల కరెంటు ఛార్జీలను ప్రభుత్వం యూనిట్‌కు రూ.2 నుంచి రూ.8.30కు పెంచడంతో 30 వేల మంది పవర్‌లూమ్ కార్మికులు ఆందోళనలో ఉన్నారని సీఎంకు సీపీఎం ప్రతినిధి బృందం వివరించింది. గతంలో ఉన్న విధంగా యూనిట్‌కు రూ.2 చొప్పున వసూలు చేసి కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ సమస్యను పరిష్కరిస్తానని, పవర్‌లూమ్ పరిశ్రమను నాలుగో కేటగిరీ కిందకు తీసుకొస్తామని సీఎం హామీ ఇచ్చారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను అందించాలని కూడా సీపీఎం ప్రతినిధులు ముఖ్యమంత్రిని కోరారు. కాగా, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలంటూ సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు.



ముఖ్యమంత్రికి కోటి రూపాయల చెక్కును అందజేస్తున్న శ్రీభరత్

సీఎంఆర్‌ఎఫ్‌కు గీతం వర్సిటీ విరాళం రూ. కోటి

హైదరాబాద్, పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 22 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అధ్యక్షుడు, విశాఖపట్నం లోక్‌సభ సభ్యుడు మతుకుమిల్లి శ్రీభరత్ తెలంగాణ వరద సహాయక చర్యలకు మద్దతుగా ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్)కి ఆదివారం కోటి రూపాయల చెక్కును అందజేశారు. సీఎం రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లో ఆయన నివాసంలో ఆదివారం స్వయంగా కలిసి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో శ్రీభరత్‌తో పాటు పూర్వ ఐఏఎస్ అధికారి గీతం ముఖ్య పరిపాలనాధికారి(సీఏవో) బీ.ఆర్. మీనా, గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి డీఎస్ రావు, కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ డీన్ సయ్యద్ అక్బరుద్దీన్, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ ఆర్ వర్మ తదితరులున్నారు.

బీజేపీలోకి ఆర్.కృష్ణయ్య?

» ఆయనతో జాతీయ అగ్రనేత చర్చలు!

» బీసీ ఓటుబ్యాంకుపై కమలం గురి



హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం జాతీయ నేత, వైసీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య.. త్వరలో కాషాయ కండువా కప్పుకోనున్నారా? కాషాయ పార్టీ వర్గాలు ఈ ప్రశ్నకు ఔననే సమాధానమే ఇస్తున్నాయి! 'బీసీ సీఎం' నినాదంతో గత అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లిన బీజేపీ.. రాష్ట్రంలో బీసీ ఓటుబ్యాంకును గణనీయంగా పెంచుకునే దిశగా దృష్టి సారించింది. అందులో భాగంగా బీసీల్లో పట్టున్న నాయకులను పార్టీలో చేర్చుకోవాలని నిర్ణయించింది. ఈమేరకు.. ఆర్.కృష్ణయ్యతో పార్టీ జాతీయ అగ్రనేత ఒకరు నేరుగా చర్చలు జరిపినట్టు సమాచారం. తమ ఆఫర్‌కు ఆయన సానుకూలంగా స్పందించారని.. ఆయనకు పార్టీలో కీలక పదవి కట్టబెట్టనున్నామని బీజేపీ వర్గాలు తెలిపాయి. గతంలో ఆరెస్సెస్‌లో క్రియాశీలంగా పనిచేసిన కృష్ణయ్యకు ఆ సంస్థ ముఖ్యులతో కూడా సన్నిహిత సంబంధాలున్నాయి. దాదాపు పదేళ్లపాటు ఆయన ఆరెస్సెస్‌లో, ఏబీవీపీలో పనిచేశారు. ఈ నేపథ్యంలో.. వారు కూడా కృష్ణయ్యతో చర్చించినట్లు సమాచారం. దాదాపు ఐదు దశాబ్దాలుగా బీసీల హక్కుల కోసం పోరాడుతున్న కృష్ణయ్య.. 2014లో టీడీపీ ఎమ్మెల్యేగా ఎల్బీనగర్ నుంచి గెలిచారు. అప్పట్లో ఆ పార్టీ ఆయన్ను సీఎం అభ్యర్థిగా ప్రకటించింది. అనంతరం.. 2022లో వైసీపీ ఆయనకు రాజ్యసభ టికెట్ ఇచ్చిన సంగతి తెలిసిందే. గడచిన రెండేళ్లుగా ఆయన వైసీపీ ఎంపీగా (రాజ్యసభ) కొనసాగుతున్నారు. కాగా, ఈ నెల 13న ఆర్.కృష్ణయ్య పుట్టిన రోజు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

సమయమొస్తే బీసీ పార్టీ: కృష్ణయ్య

ఖైరతాబాద్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): బీసీలందరూ ఏకతాటిపై నిలబడి జనాభా లెక్కింపు, రిజర్వేషన్ల పెంపు కోసం తెగించి పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆదివారం లక్డీకాపూల్‌లోని అశోకా హోటల్‌లో అఖిలపక్ష బీసీ కులసంఘాల రాష్ట్ర సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచినా, ఎవరో ఒకరు సుప్రీంకోర్టుకు వెళ్లి కొట్టేసే విధంగా చేస్తారని, కాబట్టి బీసీలందరూ ఐక్యంగా ఉద్యమించి రాజ్యాంగ సవరణ చేస్తేనే శాశ్వతంగా లాభం ఉంటుందని తెలిపారు. చాలా మంది బీసీల పార్టీ పెట్టాలని కోరుతున్నారని, సమయమొస్తే తప్పకుండా పెడదామన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ... తెలంగాణకు చివరి ఓసీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే అవుతారని, 2028లో బీసీ సీఎం కాకపోతే మల్లన్న చచ్చినట్లేనన్నారు. రాష్ట్రంలో మిగిలివున్న 6 మంత్రి పదవులు బీసీలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీని కావడం వల్ల తనకు పార్టీలో అన్యాయం జరిగిందని వీహెచ్ వ్యాఖ్యానించారు.

త్వరలోనే బీఆర్ఎస్ దుకాణం బంద్!

(మొదటిపేజీ తరువాయి)

దుర్వినియోగమయ్యాయని నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో జరిగిన నూతన వ్యవసాయ కమిటీ ప్రమాణ స్వీకార సభలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలు, మునిసిపల్ చైర్మన్లు పోతున్నారని, ఆ బాధలోనే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ దుకాణం బంద్ కానుందన్నారు. తెలంగాణ ప్రజలను మోసం చేసింది మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులేనని ఆరోపించారు. రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసిన ఘనత ఆ పార్టీదేనన్నారు. కేటీఆర్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారని, ప్రజాదరణ పొందుతున్న కాంగ్రెస్ పార్టీపై అభాండాలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. పదేళ్లు మునిసిపల్ శాఖ మంత్రిగా పని చేసిన కేటీఆర్ అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతోందని, 3 నెలలు ఎన్నికల కోడ్‌లోనే గడిచిందని చెప్పారు. తాము 6 నెలల్లో రూ.6 వేల కోట్ల అప్పులు చేశామని కేటీఆర్ అంటున్నారని, ఆ నిధులు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కుంభకోణం వల్లే మేడిగడ్డ ప్రాజెక్టు కూలిపోయిందన్నారు. దోపిడీ ఎక్కడ బయటపడుతుందోనన్న భయంతోనే అమెరికా వెళ్లి, ప్రభాకర్‌రావును ఇండియాకు రానివ్వడం లేదని ఆరోపించారు. దోచుకు తిన్నోడికి దోపిడీయే కనబడుతుందని, మీ కుటుంబంలా తాము దోచుకోవడం లేదని మంత్రి అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలనూ కాంగ్రెస్ పార్టీనే కైవసం చేసుకుంటుందని చెప్పారు. గత ప్రభుత్వంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్, కవిత కలిసి రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసి రూ.2 లక్షల కోట్లు దోచుకున్నది. వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. హరీశ్‌రావు మల్లన్న సాగర్ ప్రాజెక్టును తీసుకువెళ్లి ఆలేరును ఎడారిగా మార్చారని విమర్శించారు. యువతకు ఉపాధి కోసం ఫార్మాసిటీ అంటూ మోసం చేశారని ఆరోపించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోమటిరెడ్డి, తుమ్మల

ప్రసాదాల నాణ్యతలో రాజీపడొద్దు

రాష్ట్రం సుభిక్షంగా, రైతులు సంతోషంగా ఉండాలని లక్ష్మీనరసింహస్వామి వారిని కోరుకున్నట్లు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. ఆదివారం వారు యాదగిరిగుట్ట ఆలయంలో స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి లడ్డూ ప్రసాదాల నాణ్యతలో రాజీ పడొద్దని ఈ సందర్భంగా మంత్రులు ఆలయ ఈవో భాస్కర్‌రావుకు సూచించారు. అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడుతూ.. రైతులు బాగుండాలని, వారి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సదుపాయాలు కల్పించాలని ఆలయ అధికారులకు సూచించినట్లు చెప్పారు.

'స్టాన్‌ఫర్డ్' నేత్ర వైద్య పరిశోధకుల జాబితాలో...

వైద్యులు గుళ్లపల్లి, సంతోష్‌కు అగ్రస్థానం

జీవితకాల సేవల విభాగంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వ్యవస్థాపక చైర్మన్‌కు గుర్తింపు

ప్రపంచంలోని రెండు శాతం అగ్రశ్రేణి నేత్ర వైద్య పరిశోధకుల్లో 55 మంది భారతీయులే

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నేత్ర వైద్య రంగానికి అత్యుత్తమ సేవలందించిన పరిశోధకులతో స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ రూపొందించిన జాబితాలో హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గుళ్లపల్లి ఎన్ రావు, 'సెంటర్ ఫర్ సైట్' కంటి ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సంతోష్ జీ హొనావర్ భారతదేశంలో అగ్రగాములుగా నిలిచారు. నేత్ర వైద్య రంగంలో గత ఏడాది చేసిన కృషి, దాని ఫలితాల ఆధారంగా రూపొందించిన ఈ జాబితాను స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ, ఎల్స్‌వియర్ సంస్థ నిపుణుల బృందం ప్రకటించింది. జీవితకాలం ప్రభావవంతమైన సేవలు అందించిన వారి విభాగంలో డాక్టర్ గుళ్లపల్లి ఎన్ రావు అగ్రస్థానంలో నిలిచారు. ఆయన అంతర్జాతీయ అంధత్వ నివారణ సంస్థ సెక్రటరీ జనరల్‌గా పనిచేశారు. 'అమెరికన్ సొసైటీ ఆఫ్ క్యాటరాక్ట్, రిఫ్రాక్టివ్ సర్జరీ'.. ఆయన పేరును 'ఆప్తాల్మాలజీ హాల్ ఆఫ్ ఫేమ్'లో చేర్చింది. భారత ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి పద్మశ్రీ పురస్కారం అందజేసింది. డాక్టర్ సంతోష్ జీ హొనావర్... వరుసగా నాలుగోసారి దేశంలోని నేత్ర వైద్య పరిశోధకుల్లో అగ్రగామిగా నిలిచారు. ఆయన 'సెంటర్ ఫర్ సైట్' కంటి ఆస్పత్రిలో ఆప్తాల్మిక్ ప్లాస్టిక్ సర్జరీ, ఆక్యులర్ ఆంకాలజీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆల్ ఇండియా ఆప్తాల్మాజికల్ సొసైటీ (ఏఐవోఎస్) గౌరవ కార్యదర్శిగా కూడా సేవలందిస్తున్నారు. భారత ఉప ఖండం నుంచి బ్రిటన్‌లోని ప్రతిష్ఠాత్మక 'రాయల్ కాలేజీ ఆఫ్ ఆప్తాల్మాలజిస్ట్స్' ఫెలోషిప్ అందుకున్న ఏకైక వైద్యుడు. ఆయన 'స్టాన్‌ఫర్డ్' పరిశోధకుల జాబితాలో ప్రథమ స్థానంతో పాటు నేత్ర వైద్య రంగానికి జీవితకాల సేవల విభాగంలో రెండో స్థానంలో నిలిచారు. ప్రపంచంలో అగ్రగాములుగా ఉన్న 2 శాతం మంది నైత్ర వైద్య పరిశోధకులతో 'స్టాన్‌ఫర్డ్' ఈ జాబితాను రూపొందించగా.. ఇందులో 55 మంది భారతీయులు చోటు దక్కించుకున్నారు.



డాక్టర్ సంతోష్ జీ హొనావర్ | డాక్టర్ గుళ్లపల్లి ఎన్ రావు

పప్పు, ఉప్మా అంటేనే విరక్తి!

» ఐదేళ్లకు ముందు నేనూ రక్తహీనతతో బాధపడ్డా

» బాలికలు రక్తహీనత బారిన పడకుండా గిరిజన పోషణ మిత్ర అమలు.. భేష్

» త్వరలోనే అన్ని ఆశ్రమ స్కూళ్లలో అమలు: సీతక్క



ఉట్నూర్, సెప్టెంబరు 22: 'పేద గిరిజన కుటుంబంలో పుట్టాను.. నా చిన్నతనం నుంచి ఇంట్లో పప్పు ఎక్కువ వండే వారు.. ఆ తర్వాత హాస్టల్లోనూ పప్పే ఎక్కువ వడ్డించేవారు.. అజ్ఞాతంలో ఉన్నప్పుడు ప్రతి రోజూ ఉప్మా తినే వాళ్లం. దీంతో పప్పు భోజనం, ఉప్మా అంటేనే నాకు విరక్తి వచ్చింది' అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఐదేళ్లకు ముందు తానుకూడా రక్తహీనతతో బాధపడ్డానని, ప్రస్తుతం దాన్నుంచి బయట పడ్డానని తెలిపారు. 12 శాతం హిమోగ్లోబిన్ ఉండాల్సి ఉండగా.. తనలో ఎప్పుడూ 8 శాతమే ఉండేదని తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లోని బాలికలు చాలా మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించి.. ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా మంచి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ప్రశంసించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 60 ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన పోషణ మిత్ర అమలు చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల పరిధిలో ఉన్న బాలికల ఆశ్రమ పాఠశాలల్లో విస్తరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో గిరిజన పోషణ మిత్రను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నతాధికారులు తమ ఆలోచనలతో బాలికల సంక్షేమం కోసం కృషి చేయడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాను మంత్రి సీతక్కతోపాటు జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్‌ఆలం, ఎమ్మెల్యే బొజ్జుపటేల్, ఎమ్మెల్సీ దండేవిఠల్ అభినందించారు.



తిరుమలలో శ్రీవారి లడ్డూ విక్రయం కేంద్రంలో భక్తుల రద్దీ

పెరిగిన శ్రీవారి లడ్డూ విక్రయాలు

- 3 రోజుల్లోనే 10,45,221 పొందిన భక్తులు
- నాణ్యత, రుచిలోనూ మార్పు.. భక్తుల హర్షం

తిరుమల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందంటూ ల్యాబ్ రిపోర్టులు వెలుగులోకి రావడం ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతోంది. కల్తీ గురించి తెలిశాక.. తాము నాణ్యమైన నెయ్యినే కొనుగోలు చేసి లడ్డూలను తయారు చేస్తున్నామని టీటీడీ ప్రకటించింది. అయితే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని బహిర్గతమయ్యాక లడ్డూ అమ్మకాలు భారీగా పడిపోయాయని, భక్తులు లడ్డూలను కొనుగోలు చేయడం లేదంటూ కొందరు దుష్ప్రచారానికి దిగారు. ఇదంతా అబద్ధమని తేలింది. నిజానికి లడ్డూ విక్రయాలు పెరిగాయి. ఇప్పుడు పూర్తి స్థాయిలో పరీక్షలు చేసి స్వచ్ఛమైన నెయ్యితో లడ్డూలు తయారు చేస్తుండంతో వాటి రుచిలో మార్పు వచ్చిందని, తాజాగా కనిపిస్తున్నాయని భక్తులు చెబుతున్నారు. గత నాలుగైదు రోజులుగా నెయ్యి కల్తీ వార్తలు భారీగా వస్తున్నప్పటికీ లడ్డూల విక్రయాలు మాత్రం భారీగా పెరగడం గమనార్హం. ఈ నెల 19వ తేదీన 3,59,660 లడ్డూలు, 20వ తేదీన 3,17,954, 21వ తేదీన 3,67,607 లడ్డూలను భక్తులకు అందజేశారు. టీటీడీ ప్రస్తుతం రోజుకు మూడున్నర లడ్డూలను తయారు చేస్తోంది. గతంలో సగటున రోజుకు 2.5-3 లక్షల లడ్డూలు విక్రయాలు మాత్రమే జరిగేవి.

ఆలయాల నిర్వహణ భక్తులకే అప్పగించాలి

- తిరుమల లడ్డూ వివాదంపై సద్గురు ఆగ్రహం

అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందన్న ఆరోపణలపై ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు జగ్గీ వాసుదేవ్ స్పందించారు. భక్తులకు పంపిణీ చేసిన ప్రసాదంలో గొడ్డు కొవ్వు కలవడం అసహ్యాన్ని మించిపోయిందని ఆదివారం 'ఎక్స్'లో చేసిన పోస్టులో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే దేవాలయాల మేనేజమెంట్ల విషయంలో సమూల మార్పులు అవసరమని అన్నారు. భక్తులే గుడుల నిర్వహణను చూసుకొంటే భవిష్యత్తులో ఇటువంటి మహాపరాధాలు జరగకుండా చూసుకోవడం సాధ్యమని అభిప్రాయం వ్యక్తం చేశారు. భక్తి లేనిచోట పవిత్రత ఉండదని స్పష్టం చేశారు. హిందూ ఆలయాలు ప్రభుత్వ యంత్రాంగాల ఆజమాయిషీ నుంచి బయట పడాల్సిన సమయం ఆసన్నమైందని, వాటి నిర్వహణ బాధ్యతలను భక్తులకు అప్పగించాలని సద్గురు సూచించారు.

హిందూత్వంపై వ్యంగ్యాస్త్రాలు మానుకో

- నటుడు ప్రకాశ్‌రాజ్‌కు వీహెచ్‌పీ హెచ్చరిక

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం విషయంలో కవ్వింపు చర్యలకు దిగి పరువు తీసుకోవద్దని నటుడు ప్రకాశ్‌రాజ్‌ను విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) హెచ్చరించింది. ఈ మేరకు ఆదివారం వీహెచ్‌పీ తెలంగాణ ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి ఓ ప్రకటన విడుదల చేశారు. తిరుమల తిరుపతి లడ్డూ ప్రసాదం వివాదంలో హిందూ విశ్వాసాలపై నమ్మకం లేని వ్యక్తులు తల దూర్చడం ఏ మాత్రం క్షమార్హం కాదన్నారు. 'చిన్న విషయాన్ని పెద్దది చేసి, ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయవద్దు' అంటూ ప్రకాశ్ రాజ్ వ్యంగ్యంగా మాట్లాడటాన్ని బాలస్వామి తీవ్రంగా ఖండించారు. ఇది రాజకీయ విమర్శలకు సంబంధించిన అంశం కాదని స్పష్టం చేశారు. కాగా, దేశవ్యాప్తంగా సనాతన ధర్మ బోర్డును ఏర్పాటు చేసి, దాని ద్వారానే హిందూ దేవాలయాల నిర్వహణ కొనసాగాలని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభిప్రాయానికి విశ్వహిందూ పరిషత్ సంపూర్ణ మద్దతు తెలుపుతోందని బాలస్వామి ప్రకటించారు.

నేడు తిరుమల ఆలయంలో శాంతి హోమం

తిరుమలేశుడి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి దోషాన్ని గత నెల ఆగస్టులో సంప్రోక్షణతో పోగొట్టామని, భక్తులు ఎవరూ ఆందోళన చెందవద్దని టీటీడీ కార్యనిర్వహణాధికారి శ్యామలరావు వెల్లడించారు. "అయినప్పటికీ భక్తుల్లో నెలకొన్న ఆందోళన దృష్ట్యా ఆగమశాస్త్ర పండితులు, పెద్దజియ్యంగార్లను సంప్రదించిన తర్వాత.. శ్రీవారి ఆలయంలో ఒకరోజు శాంతి హోమం నిర్వహిస్తే బాగుంటుందని సీఎం చంద్రబాబు సూచించారు. ఈమేరకు సోమవారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు శాంతిహోమం చేస్తున్నాం" అని ఆయన తెలిపారు. అదేవిధంగా అన్ని ఆలయాల్లో పంచగవ్య ప్రోక్షణ చేయనున్నట్టు చెప్పారు. అలాగే.. శ్రీవారి ప్రసాదాలకు ఆవు నెయ్యి తీసుకునే విధానంలో మార్పు తీసుకొచ్చామని తెలిపారు.

ఉగ్ర కుట్రల్లో ఒవైసీ కాలేజీ ఫ్యాకల్టీ

- ఉగ్రవాదులను పెంచి పోషించేది ఎంఐఎం పార్టీనే
- తిరుపతి లడ్డూ కల్తీ.. హిందూ ధర్మంపై దాడి
- కాంగ్రెస్ సర్కారులో అవినీతి: బండి సంజయ్



కరీంనగర్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/మహదేవపూర్/మహేశ్వరం/హైదరాబాద్, సెప్టెంబరు 22: ఉగ్రవాదులను పెంచి పోషించేది మజ్లిస్ పార్టీ అని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. ఒవైసీకి చెందిన కాలేజీలో పని చేసిన ఓ ఫ్యాకల్టీని ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొన్నాడని గతంలో అరెస్టు చేశారని గుర్తుచేశారు. సెక్యులర్ అనే వాళ్లు ఏనాడైనా హిందువుల పండుగను జరుపుకొన్నారా..? అని ప్రశ్నించారు. ఆదివారం ఆయన కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. హిందూ ధర్మంపై దాడిలో భాగంగానే తిరుపతి లడ్డూలో కల్తీ చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని మండిపడ్డారు. తిరుమల లడ్డూ వివాదంపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా దృష్టి సారించారని తెలిపారు. కేటీఆర్‌కు మీడియా అంటే ఫోబియా అని, అమృత్ పథకం అక్రమాలపై ఫిర్యాదు చేస్తే కేంద్రం విచారణ చేస్తుందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఓటుకు నోటు కేసు విచారణ ఎందుకు జరపలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని విమర్శించారు. కాంగ్రెస్ సర్కారు అవినీతిలో కూరుకుపోయిందని కొంత మంది మంత్రులు, ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కాగా, భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు చేస్తున్న క్రమంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన కార్యకర్త మంథని రాజేందర్ కుటుంబాన్ని సంజయ్ ఆదివారం పరామర్శించి, కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం చేశారు.

మోదీతో దేశానికి ప్రపంచస్థాయి గుర్తింపు: లక్ష్మణ్

ప్రధాని మోదీ పాలనలో దేశానికి ప్రపంచస్థాయి గుర్తింపు వచ్చిందని, ఇది చూసి ఓర్వలేని కాంగ్రెస్.. లేనిపోని నిందలువేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. మోదీ జన్మదినం సందర్భంగా తుక్కుగూడలో నిర్వహించిన రక్తదాన, ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణ బిల్లుపై ముస్లింలను తప్పుదోవ పట్టించవద్దని మజ్లిస్ అధినేత అసదుద్దీన్‌కు విజ్ఞప్తి చేశారు.

చర్చి, మసీదులో చేసుంటే దేశం అల్లకల్లోలం

- హిందువులకు జరిగితే మాట్లాడొద్దా?
- జగన్ ఎలా సమర్థిస్తారు?: పవన్

పెదకాకాని, సెప్టెంబరు 22: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయడం దుర్మార్గమైన చర్య అని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. లడ్డూకు వినియోగించిన నెయ్యిలో గొడ్డుమాంసం కొవ్వు, పంది కొవ్వు, చేప నూనె, సోయా, సన్ ఫ్లవర్ లాంటి ఇతర నూనెలు ఉన్నట్లు ఎన్‌ఏడీబీ సీఏఎల్ఎఫ్ ల్యాబ్ నివేదిక ఇచ్చిందని వెల్లడించారు. వైసీపీ హయాంలో ఇలాంటి నేతిని వినియోగించి తయారు చేసిన లక్ష లడ్డూలను అయోధ్య రామ జన్మభూమి మందిరానికి టీటీడీ పంపి చాలా పెద్ద తప్పు చేసిందని అన్నారు. హిందువులు మహాప్రసాదంగా భావించే తిరుమల లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలపడం నీచమైన చర్య అని దుయ్యబట్టారు. ప్రతి హిందువూ, ధర్మాన్ని పాటించే ప్రతి వ్యక్తి దీన్ని ఖండించి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. తిరుపతి లడ్డూ ప్రసాదం అపవిత్రమైన నేపథ్యంలో క్షమించమని వేంకటేశ్వర స్వామిని కోరుతూ ఆయన ఆదివారం ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గల శ్రీ దశావతార వేంకటేశ్వర స్వామి ఆలయంలో దీక్ష మాలధారణ తీసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... కేబినెట్, అసెంబ్లీలో చర్చించి దోషులను కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. "తప్పులు చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా జగన్ వారిని ఎలా సమర్థిస్తారు? కోట్ల మంది హిందువులు స్వీకరించే ప్రసాదాన్ని అపవిత్రం చేస్తారా? దోషులకు శిక్ష పడాల్సిందే. చర్చి, మసీదులో ఇలా జరిగితే దేశం అల్లకల్లోలం అయిపోయేది. ప్రపంచం అంతా మాట్లాడేది. గ్లోబల్ న్యూస్ అయ్యేది. అదే హిందువులకు జరిగితే మాట్లాడకూడదా? సెక్యులర్ వ్యవస్థకు విఘాతం కలుగుతుందా? హిందువులకు మనోభావాలు ఉండవా? ఏ మతంపై దాడి జరిగినా ఇలాగే స్పందిస్తాం. గత ముఖ్యమంత్రి జగన్ రెడ్డిని సూటిగా అడుగుతున్నాను. తిరుమలలో జరిగిన విధంగా ఒక చర్చికి అపవిత్రం జరిగితే ఊరుకుంటావా? ఒక మసీదుకు జరిగితే ఊరుకుంటావా? మరి తిరుమలలో అపవిత్రం జరిగితే ఎందుకు మాట్లాడకూడదని అంటున్నారు? మేము మాట్లాడతాం. నెయ్యి కల్తీపై గత టీటీడీ బోర్డు బాధ్యత వహించాలి. నాటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి, ఇతర పాలక వర్గంపై విచారణ జరగాలి. తప్పు ఎవరు చేశారో బయటకు తీయాలి. స్వామివారి ప్రసాదంలో కల్తీ జరుగుతుంటే అధికారులు, బోర్డు సభ్యులు ఎందుకు మాట్లాడలేదు? వైసీపీ అంటే భయమా? లేక సుబ్బారెడ్డి అంటే భయమా? ఉద్యోగులు మౌనంగా ఉండి మహా అపరాధం చేశారు. ఈ అపరాధంతో నాకు సంబంధం లేకపోయినా ప్రాయశ్చిత్త దీక్ష తీసుకుంటున్నాను" అని పవన్ అన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

హెచ్చరించినా మారలేదు!

ఏఆర్ డెయిరీ కల్తీ నెయ్యే పంపింది!.. సీఎంకు టీటీడీ ఈవో నివేదిక

అమరావతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదంపై భక్తుల నుంచి ఫిర్యాదులు రావడంతో.. టీటీడీకి నెయ్యి సరఫరా చేసే కంపెనీలను ముందుగానే హెచ్చరించామని టీటీడీ ఈవో శ్యామలరావు ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదించారు. కొన్ని కంపెనీలు సరేనన్నా.. ఏఆర్ డెయిరీ ఫుడ్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ తక్కువ నాణ్యత గల నెయ్యి సరఫరా చేసిందని తెలిపారు. నాసిరకం ట్యాంకర్లు పంపిందని.. అనుమానం వచ్చి గోప్యంగా పరీక్షలు చేయించామని తెలిపారు. జంతువుల కొవ్వు కలిసినట్లు రిపోర్టుల్లో తేలడంతో ఆ కంపెనీ నుంచి మొత్తం సరఫరానే నిలిపివేశామని వెల్లడించారు. ఈ మేరకు ప్రాథమిక నివేదికను ఆదివారమిక్కడ సీఎంకు అందించారు. టీటీడీ ల్యాబ్‌లో కల్తీ నెయ్యిని పరీక్షించే పరికరాలు లేవని తెలిపారు. 'టీటీడీకి 10 వేల కేజీలు నెయ్యి సరఫరాకు ఏఆర్ కంపెనీని ఈ-టెండర్ ద్వారా 2024 ఫిబ్రవరిలో అధికారులు ఎంపిక చేశారు. ఈ కంపెనీ రివర్స్ టెండరింగ్‌లో కిలో నెయ్యి రూ.319.80 చొప్పున రోజుకు పది వేల కిలోలు సరఫరా చేసేందుకు అంగీకరించింది. జూన్ 12 (చంద్రబాబు సీఎంగా ప్రమాణం చేసిన రోజు) నుంచి సరఫరా ప్రారంభించింది. జూలై 6న రెండు ట్యాంకర్లు, జూలై 15న మరో రెంటిని పంపించింది. వాటిని పరిశీలించాక.. నాణ్యత లేని నెయ్యి వచ్చినట్లు భౌతిక పరిశీలనలో గుర్తించాం. కల్తీగా అనుమానించాం. వాసన, రుచి సరిగా లేకపోవడంతో.. ఆ నాలుగు ట్యాంకర్ల నుంచి శాంపిల్స్ తీసుకుని.. భారత ఆహార భద్రత-ప్రమాణాల అథారిటీ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నాణ్యత ప్రకారం నెయ్యి ఉందా లేదా అన్న నిర్ధారణ కోసం అత్యంత గోప్యంగా గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ ల్యాబ్‌కు పరీక్షల కోసం పంపించాం. అదే నెల 16, 23వ తేదీల్లో నివేదికలు వచ్చాయి. సదరు కంపెనీ సరఫరా చేసిన నెయ్యిలో వెజిటబుల్ ఆయిల్, జంతువుల కొవ్వు ఆధారిత కల్తీ పదార్థాలున్నట్లు తేలింది.



వెంటనే కల్తీ నెయ్యి ట్యాంకర్లను సదరు డెయిరీకి వెనక్కి పంపించేశాం. ఆ కంపెనీ నుంచి మొత్తం సరఫరాయే నిలిపివేశాం. 22, 23, 27వ తేదీల్లో వరుసగా షోకాజ్ నోటీసులు కూడా జారీ చేశాం. కంపెనీ చెల్లించిన ఈఎండీ, ఎస్‌డీ మొత్తంతోపాటు 5 శాతం పెనాల్టీ ఎందుకు విధించకూడదో చెప్పాలని వివరణ కోరాం. దానికి కంపెనీ 28వ తేదీన సమాధానం ఇచ్చింది. వారిచ్చిన సమాధానంలో కొన్ని అభ్యంతరాలను లేవనెత్తి మరోసారి ఆగస్టు 8న నోటీసులు జారీ చేశాం. దానికి ఆ కంపెనీ ఇచ్చిన తిరుగు జవాబును పరిశీలిస్తున్నాం. నెయ్యి కల్తీ సమస్య నేపథ్యంలో వెంటనే నిపుణుల కమిటీని ఏర్పాటు చేశాం. నాణ్యమైన నెయ్యి కొనుగోలుకు సంబంధించిన సలహాలు, సూచనలు ఇవ్వాలని కమిటీని కోరాం. ప్రస్తుతం నెయ్యి కొరత లేకుండా కొన్ని తాత్కాలిక చర్యలు తీసుకున్నాం. టెండర్లు ఆహ్వానించగా నాలుగు డెయిరీ కంపెనీలు పాల్గొన్నాయి. అందులో ఆల్ఫా మిల్క్ ఫుడ్స్ (న్యూఢిల్లీ) ఎల్-1, కర్ణాటక మిల్క్ ఫెడరేషన్(నందిని)ను ఎల్-2గా ఎంపిక చేశాం. ఈ రెండు డెయిరీలు ప్రస్తుతం టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్నాయి. టీటీడీలో ల్యాబ్ ఏర్పాటుకు అవసరమైన పరికరాలను ఉచితంగా అందించేందుకు ఎన్‌డీడీబీ ల్యాబ్ కూడా ముందుకొచ్చింది' అని పేర్కొన్నారు. "స్వచ్ఛమైన నెయ్యిని రూ.320 లేదా రూ.411కు మార్కెట్‌లో లేని ధరలకు సరఫరా చేయడం సాధ్యం కాదు. ఇది ప్రతి ఒక్కరికీ తెలిసిన విషయమే. రివర్స్ టెండరింగ్ వల్ల నెయ్యి ధరలు మరింత తగ్గిపోయాయి. పైగా నాణ్యమైన నెయ్యి అందించే సరఫరాదారులు రివర్స్ టెండరింగ్ వల్ల వెనక్కి వెళ్లిపోయారు. ఈ విధానంపై లోతైన సమీక్ష చేయాల్సిన అవసరం ఉంది" అని నివేదికలో తెలిపారు.

నలుగురు నిపుణుల నివేదికతో..

గతంలో కొనుగోలు చేసిన నెయ్యిలో కనీస ప్రమాణాలు లేవని గ్రహించిన టీటీడీ ఈవో.. నెయ్యి కొనుగోళ్ల టెండర్లలో మార్పులు చేయాలని నిర్ణయించారు. డెయిరీ రంగంలోని నలుగురు నిపుణులతో జూలై 2వ తేదీన కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో ఎన్‌డీఆర్ఐ మాజీ ఆచార్యుడు డాక్టర్ సురేంద్రనాథ్, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, ప్రొఫెసర్ స్వర్ణలత, బెంగుళూరుకు చెందిన డాక్టర్ మహదేవన్ ఉన్నారు. ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే ప్రస్తుతం నాణ్యమైన నెయ్యి టీటీడీకి అందుతోంది. నెయ్యిలో ఎస్ విలువలను కమిటీ మార్పు చేసింది.

గతంలో కొన్న, ఇప్పుడు కొంటున్న నెయ్యిలో ఎస్ విలువలు

ఈక్వేషన్	ఉండాల్సిన విలువ	గతంలో విలువ	రాజా శాంపుల్
1.	98.05-101.95	86.62	100.20
2.	99.42-100.58	106.89	100.39
3.	95.90-104.10	22.48	98.61
4.	97.96-102.04	117.42	100.35
5.	95.68-104.32	19.72	97.21

టీటీడీ బోర్డులో బీజేపీ వాళ్లే ఎక్కువ!

- నెయ్యి కొనుగోళ్లపై వారికి అవగాహన
- తిరస్కరించిన నెయ్యిని లడ్డూల్లో వాడలేదు
- ప్రధాని మోదీకి జగన్ లేఖ



అమరావతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదం కోసం వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యత లేకుండా చేసిన వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఏం చేస్తారోనని దేశమంతా ఆయనవైపే చూస్తోందని మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) బోర్డులో మెజారిటీ సభ్యులు బీజేపీకి చెందినవారేనని, వీరిని కేంద్ర మంత్రులే సిఫారసు చేశారని గుర్తుచేశారు. నెయ్యి, ఇతర సరుకుల కొనుగోలు ప్రక్రియను బోర్డు కూడా పర్యవేక్షిస్తుందని, సభ్యులకు దానిపై పూర్తి అవగాహన ఉంటుందని తెలిపారు. తిరస్కరించిన నెయ్యిని లడ్డూ ప్రసాదానికి వినియోగించలేదని చెప్పారు. చంద్రబాబు చేసిన పనివల్ల లడ్డూ పవిత్రతపై సందేహాలు నెలకొన్నాయని, భక్తుల్లో మళ్లీ విశ్వాసాన్ని పెంచేలా ప్రధాని చూడాలని కోరారు. ఈ మేరకు జగన్ ప్రధాని మోదీకి ఆదివారం 8 పేజీల లేఖ రాశారు. '100 రోజుల చంద్రబాబు ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ఆగ్రహం పెల్లుబుకుతోంది. దీనిని పక్కదోవ పట్టించేందుకే లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు ఉందంటూ కూటమి సభలో ఆయన ఉద్దేశపూర్వకంగా మాట్లాడారు. ఈ ఏడాది జూలై 12వ తేదీన తిరుమల దేవస్థానానికి వచ్చిన నెయ్యి శాంపిల్స్ నెగిటివ్ రావడంతో తిరస్కరించారు. తుది నివేదిక జూలై 23న వస్తే.. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులయిన సందర్భంగా చంద్రబాబు ఎందుకు బహిర్గతం చేశారు? తిరస్కరించిన నెయ్యిని లడ్డూ ప్రసాదం కోసం వాడలేదు. వాడకపోయినా వాడినట్లు ఆయన అబద్ధాలు చెబుతున్నారు. సరుకుల కొనుగోళ్లకు టీటీడీ దశాబ్దాలుగా స్పష్టమైన విధానం పాటిస్తోంది. ఈ అంశంపై మీ నిర్ణయంపై దేశమంతా ఎదురు చూస్తోంది' అని జగన్ తన లేఖలో విజ్ఞప్తి చేశారు.



జగన్ ఇంటి గేట్ ముందు ఆందోళన చేస్తున్న బీజేవైఎం కార్యకర్తలు

జగన్ కోటను తాకిన నిరసన

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 22: తిరుమల ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగంపై ప్రజల్లో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వుతో తయారు చేసిన నెయ్యిని వినియోగించడానికి మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు జగనే కారణమని ఆరోపిస్తూ బీజేపీ, హిందూ సంఘాలు ఆందోళన బాటపట్టాయి. ఇందులో భాగంగా ఆదివారం బీజేపీ నాయకులు తాడేపల్లిలోని జగన్ ప్యాలెస్‌ను, వైసీపీ కార్యాలయాన్ని ముట్టడించారు. బీజేపీ, బీజేవైఎం నేతలు, కార్యకర్తలు ఒక్కసారిగా మెరుపు వేగంతో జగన్ నివాసాన్ని చేరుకుని ఆందోళనకు దిగడంతో అక్కడంతా గందరగోళ పరిస్థితి నెలకొంది. కొద్దిసేపు గోవింద నామస్మరణ చేస్తూ శాంతియుతంగా నిరసన తెలియజేశారు. ఎమ్మెల్యే జగన్, టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒకానొక సందర్భంలో జగన్ నివాసంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. ప్యాలెస్ ముందు భారీ గేటు మూసివేసి ఉండడంతో తమ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. జగన్ నివాసంలోకి కాషాయ రంగు బాల్స్, చెప్పులు విసిరారు. అనంతరం జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. జగన్ ఇంటి ముందున్న సెక్యూరిటీ కార్యాలయంపైకి రాళ్లు విసరడంతో కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని మంగళగిరి పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. మంగళగిరికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు బీజేపీ నేతలను పరామర్శించి సంఘీభావం తెలియజేశారు.

లడ్డూ కల్తీపై సిట్!

(మొదటి పేజీ తరువాయి)



వల్ల అడుగడుగునా సెంటిమెంట్లు దెబ్బతిన్నాయి. వ్యాపార సంస్థగా, రాజకీయ పునరావాస కేంద్రంగా, వారికి కావాల్సిన పనులు చేయించేందుకు టీటీడీని ఉపయోగించుకున్నారు. దానిపై చాలా మంది బాధపడ్డారు. ఏదైనా మళ్లీ ప్రజల మనోభావాలను కాపాడే బాధ్యత మేం తీసుకుంటాం. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం' అని స్పష్టం చేశారు. ఆదివారమిక్కడి ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నాదెండ్ల మనోహర్‌తో కలిసి చంద్రబాబు విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఇష్టానుసారంగా టీటీడీ బోర్డు సభ్యులను నియమించారన్నారు. 50 మంది సభ్యులను నియమిస్తే కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, కనపడిన వారందరినీ ఎక్స్‌అఫిషియో సభ్యులుగా నియమించారని ఆక్షేపించారు. 'శ్రీవారి దర్శనం టికెట్లను ఇష్టారీతిగా విక్రయించారు. దానిపై నేను, పవన్ కల్యాణ్ ధర్నాలు చేశాం. తిరుమలకు అనుమతించకపోవడంతో అలిపిరి వద్ద ధర్నా చేసి వెనక్కి వచ్చాం' అని గుర్తుచేశారు. అన్య మతస్థులకు ప్రాధాన్యమివ్వడం, దేవుడిపై నమ్మకం లేని వారిని దేవాలయాల్లో పెట్టడం, రాజకీయ ప్రయోజనాల కోసం టీటీడీని వినియోగించారని విమర్శించారు. 'వాళ్లు రాగానే నెయ్యి, ఇతర సరుకుల సరఫరాకు సంబంధించి రివర్స్ టెండర్ల పేరుతో నిబంధనలు మార్చారు. 18వ నిబంధనలో ఉన్న మూడేళ్ల అనుభవాన్ని ఏడాదికి తగ్గించారు. డెయిరీ పెట్టిన మూడేళ్ల తర్వాతకు బదులుగా ఏడాదిలోనే నెయ్యి సరఫరా చేయవచ్చని పెట్టారు. 4 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి అనుభవం ఉండాలి. ఆ నిబంధనా తీసేశారు. అదే విధంగా 8 టన్నుల ఉత్పత్తి చేయాలన్న నిబంధనా తొలగించారు. రివర్స్ టెండరింగ్‌తో విన్యాసాలు చేశారు. పెద్ద సంస్థలు రాకుండా చేశారు. అనుభవం లేని వారికి, డెయిరీయే లేని వారికి అవకాశమిచ్చారు. దీంతో వారు నాసిరకం నెయ్యి సరఫరా చేశారు. కల్తీ నెయ్యితో అందరి మనోభావాలు దెబ్బతిన్నాయి' అని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే..

నిబద్ధత కలిగిన ఈవోను నియమించా..

లడ్డూ మూడ్రోజుల్లోనే చెడిపోవడం, ఘుమఘుమలాడాల్సిన లడ్డూ పాచిపోయినట్లుగా, రంగుమారినట్లుగా కనబడుతుండడంతో తినాలన్నా బాధవేసేది. నేను ముఖ్యమంత్రి కాగానే.. మిగతా పోస్టింగుల గురించి ఆలోచించలేదు. టీటీడీ ఈవోగా ఎవరిని నియమిస్తే ప్రక్షాళన జరుగుతుందో ఆలోచించి శ్యామలరావును నియమించాను. తిరుమలలో అపవిత్ర కార్యక్రమాలు జరిగాయని, ప్రక్షాళన మొదలుపెట్టాలని సూచించా. పుణ్యక్షేత్రానికి పూర్వ వైభవం తేవడానికి భగవంతుడు ఆదేశాలిచ్చాడు.. ఆ ఆదేశాలనే నీకిస్తున్నానని చెప్పాను. అప్పటి నుంచి రోజురోజుకూ పురోగతి చూస్తున్నాం. ఎవరైతే నాసిరకం సరఫరా చేస్తున్నారో ఆ కాంట్రాక్టర్లకు ఆయన వార్నింగ్ ఇచ్చారు. అన్ని అకౌంట్లూ స్వామి సెటిల్ చేస్తారని పలు దఫాలు చెప్పానని చంద్రబాబు గుర్తు చేశారు. వైఎస్ ఉన్నప్పుడు ఏడుకొండలను ఐదు కొండలంటే ఫైట్ చేశానని, పాదయాత్ర చేసి ఏడుకొండలు ఎక్కి మొక్కు తీర్చుకున్నానని తెలిపారు.

సైదాబాద్‌లో మళ్లీ ఉగ్రమూలాలు

- ఐఎస్ ఉగ్రవాది రిజ్వాన్ అలీకి ఆశ్రయం

సైదాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్‌లో మళ్లీ ఉగ్రమూలాలు బయటపడ్డాయి. ఒకప్పుడు దేశం లో ఎక్కడ ఉగ్రవాద ఘటన చోటుచేసుకున్నా.. సైదాబాద్‌తో లింకులు ఉంటాయనే అపవాదు ఉండేది. అప్పట్లో గుజరాత్ హోం మంత్రి హరేన్‌పాండ్య హత్య కేసుకు కూడా ఇక్కడి ఓ హోటల్‌లో కుట్ర జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత సూరత్, అహ్మదాబాద్, బెంగళూరు పేలుళ్లు, పలు కుట్రల విషయంలోనూ ఇక్కడి వారు అరెస్టయ్యారు. దిల్‌సుఖ్‌నగర్ జంటపేలుళ్ల తర్వాత.. ఆ అపవాదుకు దూరంగా ఉన్న సైదాబాద్ పేరు మరోమారు మార్మోగింది. ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) ఉగ్రవాది రిజ్వాన్ అబ్దుల్ హజ్ అలీ అలియాస్ రిజ్వాన్(29) సైదాబాద్ శంకేశ్వర్‌బజార్‌లోని గ్రీన్‌వ్యూ అపార్ట్‌మెంట్‌లో తలదాచుకున్న విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు ఆదివారం ఇక్కడ విస్తృతంగా సోదాలు జరిపారు. ఢిల్లీ పోలీసులు గత నెల 8న రిజ్వాన్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే.! తదుపరి విచారణలో తాను హైదరాబాద్‌లో ఆర్నెల్లు ఆశ్రయం పొం దినట్లు రిజ్వాన్ వెల్లడించాడు. దీంతో ఎన్ఐఏ అదనపు ఎస్పీ రాజ్‌కుమార్ నేతృత్వంలోని బృందం ఆదివారం రిజ్వాన్‌ను వెంటబెట్టుకుని, భారీ బందోబస్తు మధ్య సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ నిర్వహించింది. అతనికి ఆశ్ర యం ఇచ్చిన ఇంటి యజమానిని ఎన్ఐఏ ప్రశ్నించిం ది. సుమారు నాలుగు నెలల పాటు రిజ్వాన్ అక్కడ మారుపేరుతో తలదాచుకున్నట్లు గుర్తించింది. ఢిల్లీకి చెందిన రిజ్వాన్ డిగ్రీ పూర్తి చేసిన తర్వాత.. 2015-16లో ఐఎస్‌లో చేరాడు. షాహిన్‌బాగ్‌లో నివసిస్తున్న ఝార్ఖండ్ వాసి షానవాజ్‌తో 2017లో పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ కలిసి ఆన్‌లైన్‌లో యువతను ఆకర్షించి, ఉగ్రవాదం వైపు మళ్లించారు. షానవాజ్ మాడ్యుల్ గత ఏడాది పుణెలో పట్టుబడగా.. రిజ్వాన్ అప్పటి నుంచి అజ్ఞాతంలో ఉన్నాడు. ఆ సమయంలోనే హైదరాబాద్‌కు వచ్చి.. మాజీ ఉగ్రవాది ఫర్హతుల్లా ఘోరీ సహాయంతో ఆశ్రయం పొందినట్లు తెలిసింది. ఆగస్టు 8న ఢిల్లీ సరిహద్దుల్లో రిజ్వాన్‌ను అరెస్టు చేసిన ఎన్ఐఏ.. అతని నుంచి తుపాకీ, క్యాట్రిడ్జ్‌లు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుంది. కాగా.. రిజ్వాన్ పేరుతో సైదాబాద్ ఠాణాలో ఓ చోరీ కేసు ఉంది. ఈ కేసులో దొంగ, ఎన్ఐఏ అరెస్టు చేసిన రిజ్వాన్ ఒకరేనా? అని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: **K. Srinivas.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.